ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 190 పేజీలు: 10+4 వెల: 8.00

హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన అభ్యర్థులు 3

అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు కొత్త పేర్లు 5



ప్రపంచం ఫాస్ట్‌గా మారుతోంది.. 5

యువత ఆవిష్కరణలతో స్టార్టప్ వ్యవస్థ బలోపేతం
ఐఐటి విద్యతోనే మెరుగైన సామర్థ్యం: ప్రధాని మోడీ



ఇథనాల్‌పై దేశవ్యాప్త పోరాటానికి సిద్ధం 3

మిక్సింగ్‌లో భారీగా అవినీతి
ప్రభుత్వ పెద్దల లబ్ధికే ఆ విధానం: రాహుల్

## బిసి సబ్‌ప్లాన్‌తో ఆర్థిక స్వావలంబన

14న జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి విగ్రహావిష్కరణ

ఫీజు రీయింబర్స్ బకాయిలు విడతల వారీగా చెల్లింపు

మంత్రి పొన్నం నివాసంలో బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమావేశం



శనివారం బిసిల సమావేశంలో మంత్రులు పొన్నం, వాకిటి తదితరులు

**హైదరాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త:** బిసి సబ్‌ప్లాన్, కులగణనతోనే బిసి ఆర్థిక సామజిక రాజకీయ స్వావలంభన కు బాటలు పడుతాయని రాష్ట్రరవాణాశాఖ, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. హైదరాబాద్ హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్ పక్కన ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈ నెల 14వ తేదీన ప్రారంభించేందుకు నిర్ణయించారు. అలాగే ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఈ నెల 18వ తేదీన ప్రారంభించే కార్యక్రమంపై చర్చించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బిసిమంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు కలిసి ఆహ్వానించాలని >>2



యుపిఐ చెల్లింపులపై

## ఛార్జీలు ఉండవు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

**న్యూఢిల్లీ:** యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించినా ఆ భారం వినియోగదారులపై ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఎండీఆర్ అమలుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆమె వెల్లడించారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన విమర్శలకు ఎక్స్ వేదికగా స్పందించిన సీతారామన్ ఎండీఆర్ కేవలం వ్యాపారులకే వర్తిస్తుందని, కస్టమర్ల నుంచి వసూలు >>2

# చేతులు కలపండి

తెలంగాణ పురోభివృద్ధిలో భాగం కండి

రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు

ప్రపంచ మౌలిక సౌకర్యాలతో ఫ్యూచర్ సిటీ

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

అమెరికాలోని ప్రవాసులతో డి.సిఎం భట్టి




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ ఎస్ఎఫ్ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా, సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంప్రదాయ విద్యుత్‌తో పాటు పునరుత్పాదక ఇంధన వనరు రంగంలోనూ రాష్ట్రం గరిష్ట ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడా అలస్యం జరక్కుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని >>2



15 రోజులు దాటిన జార్ఖండ్ విద్యార్థుల

## ఆందోళన

పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఆగని ఉద్యమం

**రాంచి,ఆగస్టు 8:** జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీ అంశంపై జార్ఖండ్ ప్రభుత్వంతో విద్యార్థులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో తమ నిరసన మరింత ఉధృతంగా కొనసాగనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. జార్ఖండ్‌లో ఇటీవల జరిగిన జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీలతోపాటు అనేక పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు రాజధాని రాంచీలో నిరవధిక ఆందోళనకు దిగాయి. శనివారం ఈ ఆందోళనలు వరుసగా 15వ రోజుకు >>2

# నిధుల కొరత రానివ్వం




శనివారం సాగునీటిపారుదల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.
చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు

రూ.5 వేల కోట్ల విడుదలకు లైన్‌క్లియర్

మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే ప్రారంభం

పత్తిపాక డిపిఆర్ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సాగునీటి పారుదల సమీక్షలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అడ్లూరి, తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు8,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ పునరావాసం-పునర్నిర్మాణం కోసం ప్రాధాన్యత ప్రాతిపదికన రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడమే కాకుండా ఇప్పటి వరకు రెండువేల కోట్లు విడుదల చేశామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రగతి దశలో, తుది దశకు చేరిన సాగునీటి ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా నిలిచిపోవడానికి వీల్లేదని ఇంకా మూడువేల కోట్లు త్వరలోనే విడుదలకు సిద్దంగా ఉన్నాయనీ చెప్పారు. శనివారం బిఆర్ అంబెద్కర్ సచివాలయంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులపై శనివారం నిర్వహించిన సమగ్ర సమీక్షలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ గరిమఅగర్వాల్ నాలుగు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఇంజినీరింగ్ పనులు సమాంతరంగా భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధి అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పనులకు అడ్డంకిగా మారిన భూసంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సవరించిన అంచనాలు >>2



## జల ఉద్యమం చేస్తాం

నదీ జలాల్లో నష్టం చేస్తే తిరుగుబాటు తప్పదు..

జిఆర్‌ఎంబి సమావేశం అజెండాను ఒప్పుకున్నారా? సిఎం, ఉత్తమ్ జవాబివ్వాలి: మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** జిఆర్ఎంబీ సమావేశం ఎజెండాను ఒప్పుకున్నారా? ఈ సమావేశానికి హాజరైతారా? హాజరైతే తెలంగాణ ప్రజల తరఫున ఏం చెప్తారు? ఈ విషయంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలో ఈ జల ఉద్యమం వస్తది. తెలంగాణ నీటి హక్కులకు మించిన మరో ప్రాధాన్యత మా పార్టీకి లేదు. నదీ జలాల్లో కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదు అని హెచ్చరించారు. శనివారం నందినగర్ నివాసంలో మీడియా రిపోర్టర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుంది. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఎజెండాను ఒప్పుకొని ఎలా మీటింగ్‌కి హాజరవుతుంది? అని ప్రశ్నించారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన >>2

వాటర్ అమృత్ స్కీంలో

## ఎస్సారెస్పీ

**హైదరాబాద్, ఆగస్టు 8,ప్రభాతవార్త:** ప్రపంచబ్యాంకు సౌజన్యంతో జలశక్తి మంత్రిత్వశాఖ చేపట్టిన వాటర్-అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ రిసోర్సెస్ త్రూ ఇన్ఫర్‌మేటిక్స్ టెక్నాలోజి అనలటిక్స్ అండ్ మానిటరింగ్ (డబ్ల్యుఅమృతం) కార్యక్రమంలో తెలంగాణకు చెందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విశ్లేషణలను ఉపయోగించుకొని వరదలు, భూఉపరిత నీరు, భూగర్భజలాలు ఎప్పటి కప్పుడు తక్షణమే జాప్యం లేకుండా పర్యవేక్షణ చేయడానికి కొత్త విధానం దారులు వేయనున్నది. సాగునీటి రంగాన్ని పూర్తిగా డేటా, సాంకేతిక ఆధారిత వ్యవస్థగా మార్చి జలవనరుల నిర్వహణ మరింత >>2





## రోహిత్ రెడ్డి దోషి

చెక్‌బౌన్స్ కేసులో కోర్టు తీర్పు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** చెక్ బౌన్స్ కేసులో బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డిని హైదరాబాద్ మున్సిపల్‌కోర్టు దోషిగా నిర్ధారించింది. మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఖుష్బు ఉపాధ్యాయ ఈ మేరకు తీర్పు చెప్పారు. వివరాలు ఇలావున్నాయి. మెసర్స్ ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ వనరులను వ్యక్తిగత లాభాలకు వాడుకుని ఆ కంపెనీకి నష్టం కలిగించాడనే కారణంతో రోహిత్‌రెడ్డి 2014లో రాజీనామా చేశారు. దీని తరువాత ఆ కంపెనీతో కుదిరిన ఒప్పందం ప్రకారం రోహిత్‌రెడ్డి సదరు కంపెనీకి 34 లక్షల 23 వేల రూపాయలు చెల్లించేందుకు >>2

96 లక్షల మంది భారతీయులపై

# గల్ఫ్ యుద్ధ ముప్పు

కేరళం, తమిళనాడు, యుపి, బీహార్ నుంచి వెళ్లిన వారే అధికం




**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఇరాన్‌పై అమెరికా ఇరాన్‌అమెరికా యుద్ధ ప్రభావం గల్ఫ్‌లో నివసిస్తున్న భారతీయులపై ఎక్కువ పడుతోంది. ఇపుడు వీరి భద్రత ప్రశ్నార్థకం అవుతున్నది. మధ్యప్రాచ్యంలో సుమారు 96.8 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో 95.7 లక్షల మందికి పైగా ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు). వీరిలో అత్యధికులు ఇప్పటికే యుద్ధ ప్రభావానికి గురవుతున్న ఆరు గల్ఫ్ దేశాల్లోనే ఉన్నారు. పార్లమెంట్‌కు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సమర్పించిన గణాంకాల ప్రకారం.. 2025 జనవరి నాటికి మధ్యప్రాచ్యంలో 96,79,121 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో దాదాపు లక్ష మంది భారత సంతతికి చెందినవారు కాగా, మిగిలిన వారు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులే. యూఏఈలో సుమారు 40 లక్షల మంది, సౌదీ అరేబియాలో 20 లక్షలకు పైగా, కువైట్‌లో 10 లక్షలకు పైగా భారతీయులు నివసిస్తున్నారు. ఒమన్, ఖతార్, బహ్రెయిన్‌లలో కలిపి మరో 10 లక్షలకు పైగా భారతీయులు ఉన్నారు. >>2

## హైదరాబాద్‌లో రాజస్థాన్ డ్రగ్స్ ముఠా

ఏడుగురు స్మగ్లర్ల అరెస్టు, 1.031 కిలోల ఓపియం, 25 గ్రాముల ఎండి డ్రగ్ జప్తు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** దక్షిణాది నగరాలను టార్గెట్ చేస్తూ రాజస్తాన్ డ్రగ్స్ ముఠా కొనసాగిస్తున్న మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌ను ఈగల్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా మియాపూర్, సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లలో నమోదైన రెండు కేసులకు సంబంధించి ఏడు గురు అంతరాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్లను అరెస్టు చేయగా వీరి వద్ద నుంచి 1.031 గ్రాముల ఓపియంతో పాటు 25 గ్రాముల ఎండి డ్రగ్‌ను జప్తు చేశా రు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా శనివారం నాడు మీడియాకు వెల్లడించారు. పట్టుబడ్డ ముఠా 2023 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 78 సార్లు డ్రగ్స్ దందాలు చేసినట్లు ఈగల్ పోలీసులు నిర్ధారించారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ >>2



హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో శనివారం బోల్తా పడిన ప్రైవేట్ బస్సు వద్ద గుమిగూడిన ప్రజలు

# విద్యార్థుల ఆందోళన

>> చేరుకున్నాయి. ఈ ఉద్యమానికి ప్రధా నంగా జేఎల్‌కేఎం నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో నాయకత్వం వహిస్తుం డగా, రాష్ట్రంలోని ఇతర విద్యార్థి సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులతో సీఎం హేమంత్ సోరేన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం శనివారం చర్చలు జరిపింది. ముందుగా దేవేంద్ర నాథ్ మహతాతో, అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఎన్ఎస్‌యూఐ, ఏసీఎస్, జేసీఎం వంటి సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఇదే సమయంలో పరీక్ష రాసిన అభ్యర్థులతో కూడా చర్చలు జరిపింది. అయితే, ఈ చర్చలు విఫలమయ్యాయి. విద్యార్థుల పలు డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించలేదు. అందులో ఈ పరీక్షల్ని పూర్తిగా రద్దు చేయాలని దేవేంద్ర నాథ్ మహతో డిమాండ్ చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. ఇదే సమయంలో వేర్వేరు విద్యార్థి సంఘాలు, వేర్వేరు డిమాండ్లు చేస్తున్నాయి. ఈ పేపర్ లీకేజీలపై సీఐడీ విచారణ జరపాలని, 90 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని, ఎన్‌టీయేలాగా జార్ఖండ్ టెస్టింగ్ ఏజెన్సీ (జేటీయే) పేరుతో కొత్తగా పరీక్ష నిర్వహణా సంస్థ ఏర్పాటు చేయాలని.. ఇలా వేర్వేరు డిమాండ్లు ప్రభుత్వానికి వచ్చాయి. వీటిపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పష్టతా రాలేదు. కానీ, విద్యార్థుల డిమాండ్లలో న్యాయం ఉందని, వాటిని సీఎంకు తెలియజేస్తామని ప్రభుత్వం తరఫున మంత్రుల బృందం తెలిపింది. ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోవడంపై విద్యార్థి సంఘాలు స్పందించాయి. తమ డిమాండ్లను ఈ నెల 10లోపు నెరవేర్చాలని తుది హెచ్చరిక జారీ చేశాయి. లేకుంటే తమ నిరసనను మరింత ఉధృతం చేస్తామని చెప్పాయి. రాష్ట్రవ్యాప్తంగా ఘెరావ్‌లు చేపడతామని హెచ్చరించాయి.

# ఛార్జీలు ఉండవు

>> చేయబోమని పేర్కొన్నారు. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతులు, భద్రత, సాంకేతికతలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఎండీఆర్ తోడ్పడుతుందని తెలిపారు. యూపీఐపై ఎండీఆర్ విధించే అంశాన్ని పార్లమెంట్‌లో పన్నుల మరియు ఇతర చట్టాల (సవరణ) బిల్లు2026 ఆమోదం పొందిన తర్వాత పరిశీలిస్తామని మంత్రి చెప్పారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నేతృత్వంలోని యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఈ అంశంపై చర్చిస్తుందని వివరించారు. ప్రస్తుతం యూపీఐ, రూపే లావాదేవీలపై జీరోఎండీఆర్ విధానం అమల్లో ఉంది. ప్రతిపాదిత బిల్లు పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్2007లోని సెక్షన్ 10(ఏ)లో మార్పులు చేయనుంది. దీని ద్వారా భవిష్యత్తులో జీరోఎండీఆర్ విధానాన్ని మార్చే అధికారం కేంద్రానికి లభిస్తుంది. అయితే బిల్లులో ఎండీఆర్‌ను తప్పనిసరిగా విధించాలని పేర్కొనడం లేదు. ఎలాంటి రుసుము ఎంత ఉండాలనే విషయాన్నీ నిర్దేశించలేదు. భవిష్యత్తులో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఎండీఆర్ అమలు చేసేందుకు అవసరమైన చట్టపరమైన వ్యవస్థను మాత్రమే కల్పిస్తోంది.

**యూపీఐ ఉచితంగానే కొనసాగుతుంది: పేమెంట్స్ కౌన్సిల్**

యూపీఐపై జరుగుతున్న చర్చ నేపథ్యంలో పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కూడా స్పష్టత ఇచ్చింది. 2016లో ప్రారంభమైనప్పటి నుంచి వినియోగదారులకు యూపీఐ ఉచితంగానే ఉందని, ఇకపై కూడా తక్షణ డిజిటల్ చెల్లింపులకు వినియోగదారుల నుంచి లావాదేవీ రుసుము వసూలు చేయబోరని తెలిపింది. చిన్న వ్యాపారాలు, కిరాణా దుకాణాలు యూపీఐ చెల్లింపులను స్వీకరించేందుకు ప్రస్తుతం ఎండీఆర్ చెల్లించాల్సిన అవసరం లేదని పీసీఐ పేర్కొంది.

చిన్న వ్యాపారులకు డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తీసుకురావడమే యూపీఐ లక్ష్యమని వివరించింది. యూపీఐపై చర్చకు స్పందించిన ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ కూడా వినియోగదారులకు యూపీఐ ఉచితంగానే కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారతీయ వినియోగదారులు యూపీఐ చెల్లింపులు చేయడానికి ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదని ఆయన పేర్కొన్నారు.

# నిధుల కొరత రానివ్వం

>> సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధ నఇవన్నీ ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ను వేగంగా ముందుకు తీసుకెళ్ళితే ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలలో కాకతీయ కాలువ డి-83 నుంఇ డి-94 వరకు రెండులక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరణ చేయడమే కాకుండా కొత్తగా పదివేల ఎకరాలకు సాగునీరు అందుతోందని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. పత్తిపాక వద్ద 3 టిఎంసి లు లేదా 5 టిఎంసి ల సామర్థంతో రిజర్వాయర్ నిర్మించే రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయని, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డిపిఆర్ సమర్పిస్తామని తెలిపారు రోళ్ళవాగు నీటిసామర్థ్యం 0.949 టిఎంసిలకు పెంచడానికి అటవీ అనుమతులు వెంటనే పొందే విధంగా ప్రత్యామ్నయ అటవీపెంపకం వన్యప్రాణుల సంరక్షణ వంటి అంశాలపై దృష్టిసారిస్తే ఇప్పటికే 96శాతం పనులు పూర్తి అయిన ప్రాజెక్టు చెందిన మూడు కట్టలలో రెండో కట్ట విషయంలో అటవీ భూమి ఉండటంతో క్లియరెన్స్ వస్తే వినియోగదిశగా తీసుకొనిరావొచ్చని తెలిపారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ అనుమతుల కారణంగా ఏ సాగునీటి ప్రాజెక్టు నిలిచిపోయినా వెంటనే ప్రతిపాదనలు పంపండి. నిధులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు మరింత ఆలస్యం లేకుండా నీరు అందించడమే మా లక్ష్యం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

# రోహిత్ రెడ్డి దోషి

>> అంగీకరించారు. ఇందుకు సంబంధించి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుకు చెందిన చెక్‌ను రోహిత్ రెడ్డి సదరు కంపెనీ నిర్వాహకులకు ఇచ్చారు. అయితే ఈ చెక్ మూడుసార్లు తగి నంత నగదు నిలువ లేని కారణంగా బౌన్స్ అయ్యింది. దీనిపై మెసర్స్ ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటె డ్ కంపెనీ రోహిత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపినా స్పందించలేదు. దీంతో కంపెనీ నిర్వాహకులు రోహిత్ రెడ్డిపై కోర్టులో కేసు దాఖలు చేశారు.

దీనిపై కొంతకాలంగా కోర్టులో వాదనలు సాగుతున్నాయి. చివరకు ఈ కేసులో పైలట్ రోహిత్ రెడ్డిని నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ సెక్ష న్ 138 కింద దోషిగా తేలుస్తూ న్యాయమూరి తీర్పు చెప్పారు.

తీర్పు వెలువడే సమయంలో పైలట్ రోహిత్ రెడ్డి కోర్టులో లేక పోవడంతో ఆ యనపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. దీనిపై రోహిత్ రెడ్డి కోర్టుకు హాజరైన తరువాత శిక్షను ఖరారు చేయనున్నారు.

# చేతులు కలపండి

>> కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాన్‌ఫ్రాన్సిస్కోలో వేమో స్వయంచాలక (డ్రైవర్‌లెస్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆయన ఆరా తీశారు. ఇందుకు అవసరమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవసరమైన నియంత్రణ, విధానపరమైన చట్రాలపైనా చర్చించారు.

నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆసక్తి వ్యక్తం చేశారు.

## వారం - వర్జ్యం

09-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.ఏకాదశి ఉ.11.04 న.మృగశిర మ.2.42
వ.రా.10.19-రా.11.46
దు.సా.4.49-సా.5.40
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-9.00

## వార్తాఫలం

**మేషం :** సంతానము మీ అభిప్రాయములలో ఏకీభవించడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృషభం :** టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలముగా వస్తాయి. వివాదాస్పదమైన వ్యవహారములు పరిష్కారమౌతాయి.

**మిథునం :** పెట్టుబడి పెట్టిన వారికి ఏకకాలంలో భాగములను ఇవ్వవలసి వస్తుంది. ప్రయాణాలు లభిస్తాయి.

**కర్కాటకం :** వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను, సంస్కరణలను ప్రవేశపెడతారు. మిత్రుల కలయిక.

**సింహం :** అనేక నూతన కార్యక్రమములకు శ్రీకారం చుడతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. వస్తువులను కొనుగోలు చేస్తారు.

**కన్య :** సకుటుంబ సమేతముగా విహార యాత్రలు చేస్తారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మిత్రుల కలయిక.

**తుల :** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి. వస్త్ర లాభం.

**వృశ్చికం :** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.

**ధనుస్సు :** ఆధ్యాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చు చేస్తారు. వస్తు కొనుగోలు.

**మకరం :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు. బంధువుల కలయిక.

**కుంభం :** వృత్తియందు బాధ్యతలు పెరగటంలో సమయమునకు విశ్రాంతిని తీసుకోలేరు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** వ్యాపారములో చేసిన మార్పులు, ప్రచారము సత్ఫలితములనిస్తాయి. వాహన యోగం. స్వల్ప ధనలాభం పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జల ఉద్యమం చేస్తాం

>> తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నది. ఇదే జరిగితే కచ్చితంగా బిఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి పంపులు ఎప్పుడు ఆన్ చేయాలి, నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో కనీస అవగాహన లేదు. పాలమూరు జిల్లా బిడ్డ అని చెప్పుకునే రేవంత్ కనీసం అక్కడికి చెరువులలో నీళ్లు నింపడానికి కూడా సోయి లేదు. సాగునీటి ప్రాజెక్టుల పైన తెలంగాణకు నష్టం జరిగేలా ఆంధ్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను అంగీకరిస్తున్నారా లేదా అన్నది కాంగ్రెస్ ఇప్పటిదాకా స్పష్టం చేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్ లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి మాది కాదు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయన్నారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ అన్నారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులతో ప్రజల సొమ్మును కాజేసే కుట్రను రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఈ అంశాన్ని ఎండగడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం వేల కోట్ల రూపాయల సొమ్ములను దండుకునేందుకు తీసుకొచ్చిన హిల్ట్ పాలసీని అధికారంలోకి రాగానే రద్దు చేస్తామన్న విషయాన్ని స్పష్టం చేస్తూ ప్రతి ఒక్క పారిశ్రామిక ఆర్గనైజేషన్‌కి లేఖలు రాస్తామని తెలిపారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్‌ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. దీంతోపాటు హైదరాబాద్ నగరంలో ప్రతి నియోజకవర్గంలో ప్రజల విలువైన ఆస్తిని కాపాడేందుకు అనేక కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. గతంలో బాంబే. ఇతర నగరాల్లో పారిశ్రామిక భూములను ప్రభుత్వం తీసుకొని తిరిగి రీడెవలప్మెంట్ చేసిన ఉదంతాలను కాదని ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా పాత భూముల ధరలకు కట్టబెట్టే కుట్రను రేవంత్ రెడ్డి చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఈ పాలసీ వలన ఎవరైనా భూములను రెగ్యులరైజ్ చేయించుకుంటే భవిష్యత్తులో తీరని నష్టం జరుగుతుందన్న విషయాన్ని స్పష్టం చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రజల అవసరాల కోసం ఒక్క ఎకరం భూమి అందుబాటులో లేదని, చివరికి ఆట స్థలాలకు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు, చివరికి స్మశానాలకు కూడా భూములు లేని హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ వ్యక్తులకు 10,000 ఎకరాల భూమిని దోచిపెట్టడం తీరని ద్రోహమన్నారు. ఒకప్పుడు ప్రజల ఆస్తిని పరిశ్రమల కోసం ఇచ్చారని, కేవలం పరిశ్రమలు మాత్రమే నడపాలని, అంతేకానీ మాల్స్ కట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటే సరైంది కాదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ స్కామ్ పైన హైకోర్టు దృష్టికి కూడా తీసుకువెళ్లి జరుగుతున్న అక్రమాలను వారి ముందు ఉంచుతామని కేటీఆర్ తెలిపారు. గత లో మా ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక భూములను ఐటి, సెజ్ ల పేరిట డెవలప్ చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఐటి పరిశ్రమను నగరం నాలుగు మూలలా విస్తరించాలన్న లక్ష్యంతో పాలసీని తీసుకువస్తే దాన్ని మార్చి అప్పనంగా అమ్ముకునేలా హిల్ట్ పాలసీని రేవంత్ రెడ్డి రూపొందించారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్ముకోవడమే కాకుండా ప్రజల వ్యక్తిగత ఆస్తుల పైన కూడా రేవంత్ రెడ్డి కన్నేసి అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. కేవలం 16 లక్షల లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉంటే దాన్ని కోటి 20 లక్షలకు చేర్చి ప్రైవేట్ వ్యక్తులను బ్లాక్ మెయిల్ చేస్తూ భూ కబ్జ బ్లాక్ మెయిలింగ్ దందాకు ప్రభుత్వం తెరలేపిందన్నారు. ఇప్పుడు కొత్తగా 22ఎ పేరుతో హైదరాబాద్ నగరంలోనూ తీవ్రమైన ఇబ్బందులకు గురిచేసేలా లక్షల మందిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. కాలనీలకు కాలనీలను నిషేధిత జాబితాలో పెట్టి తమ సొంత కష్టార్జితంతో సంపాదించుకున్న 100 గజాలను కూడా అమ్ముకోకుండా అడ్డుకుంటున్నారని కేటీఆర్ అన్నారు.

## హిమాచల్‌లో భారీ ఎత్తున
# తిరంగా యాత్ర

**సిమ్లా, ఆగస్టు 8:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నద్ధతతో హిమాలయ రాష్ట్రం ముందువరుసలో నిలిచింది. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో శనివారం మధ్యాహ్నం తిరంగా యాత్ర అత్యంత వైభవంగా జరిగింది. బీజేపీ రాష్ట్రశాఖ ఈ వేడుక నిర్వహించింది. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ దీనికి నేతృత్వం వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సిమ్లాలోని సీటీఓ జంక్షన్ వద్ద ఈ తిరంగా యాత్ర ఘనంగా ప్రారంభమైంది. అక్కడి నుంచి షేర్ ఎ పంజాబ్ మీదుగా మాల్ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ ర్యాలీలో స్థానికులతో పాటు పర్యాటకులు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతపట్టి వందలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. వారి నినాదాలతో సిమ్లా వీధులన్నీ మార్మోగాయి. ఈ సందర్భంగా జైరామ్ ఠాకూర్ మాట్లాడారు. ఆగస్టు 15న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి ఒక మహోత్సవం లాంటిదని అభివర్ణించారు. ఎందరో దేశభక్తులు, అమరవీరుల త్యాగాల పునాదులపైనే దేశం బలంగా నిర్మితమైందని ఈ తిరంగా యాత్ర ద్వారా యువతలో జాతీయవాదాన్ని మళ్లీ మేల్కొలపడంతో పాటు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలనే దృఢ సంకల్పం ఏర్పడుతుందని జైరామ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. సిమ్లా లోక్‌సభ సభ్యుడు సురేష్ కశ్యప్ మాట్లాడుతూ జాతీయ జెండా అనేది దేశ పౌరుల ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారతీయులందరి మధ్య పరస్పర సోదరభావాన్ని, జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ఈ తిరంగా యాత్రలు దేశవ్యాప్తంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు అన్ని రాష్ట్రాల్లోనూ తరఫున తిరంగా కార్యకలాపాలను నిర్వహించాలని పార్టీ హైకమాండ్ సూచించిందని వివరించారు.




న్యూఢిల్లీలోని ఓఖ్లా, కాళింది కుంజ్ వద్ద శనివారం యమునా నదిలో విషపూరితమైన నురుగ దట్టమైన పొరలా తేలుతున్న దృశ్యం

## 96 లక్షల మంది భారతీయులపై గల్ఫ్ యుద్ధ ముప్పు

>> కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల నుంచి వెళ్లినవారే వీరిలో అధిక సంఖ్యలో ఉన్నారు. భారతీయ నిర్మాణ కార్మికులు, నర్సులు, డ్రైవర్లు, దుకాణదారులు, ఇంజినీర్లు తదితరులు పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. వారి భద్రతపై యుద్ధ తీవ్రత పెరిగే కొద్దీ ఆందోళన కూడా పెరుగుతోంది. ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే ఈ దేశాలన్నింటిలోనూ అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా ఈ స్థావరాలే లక్ష్యాలుగా మారుతున్నాయి. అదే జరిగితే అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది భారతీయులు నేరుగా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో దాడులు ప్రధానంగా సైనిక స్థావరాలకే పరిమితమయ్యాయి. భారతీయులు నివసించే నగరాలు, కార్మికుల వసతి ప్రాంతాలు ఇప్పటివరకు పెద్దగా లక్ష్యంగా మారలేదు. ఇరాన్ యుద్ధం భారత్‌కు రెండు రకాల ముప్పును తెచ్చిపెడుతోంది. ఒకవైపు ముడిచమురు ధరల పెరుగుదలతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలపై ప్రభావం పడుతోంది. మరోవైపు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న దాదాపు 96.8 లక్షల మంది భారతీయుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. యుద్ధం ప్రతిసారీ పూర్తిగా ముగిసిపోకుండా కొంతకాలం విరామం తర్వాత మళ్లీ తీవ్రరూపం దాల్చుతోంది. ఈ మానవీయ ముప్పు భారత్‌కు అత్యంత కీలకమైన సవాలుగా మారుతోంది. భారత విదేశాంగశాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంచేస్తున్నా అమెరికా అధ్యక్షుడి వైఖరిపై స్పష్టత లేకపోవడంతో ఏనిమిషంలో ఏముప్పు వచ్చిపడుతుందోనని గల్ఫ్‌దేశాల్లోని భారతీయ కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

# హైదరాబాద్‌లో రాజస్థాన్ డ్రగ్స్ ముఠా

>> సందీప్ శాండల్యా శనివారం నాడు వెల్లడించారు. మియాపూర్‌లో నమోదైన మొదటి కేసులో రాజస్తాన్‌లోని జాలోర్‌కు చెందిన మహేందర్ కుమావత్ కీలక నిందితుడు. ఇతను దక్షిణాది నగరాలకు ఓపిఎంతో పాటు ఎండి డ్రగ్స్‌ను సరఫరా చేస్తుంటాడు. ఇందుకోసం అ న్ని నగరాల్లో ఏజెంట్లను నియమించుకున్నాడు. యువకులను వాడుతూ సరఫరా చేస్తు డిజిటల్ ప్లాట్ ఫాంల ద్వారా నగదు బదిలీ చేయించు కుంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఇతను 1.031 కిలో ఓపియంతో పాటు 40 గ్రాముల మెఫెడ్రోన్ డ్రగ్‌ను రాజస్తాన్‌కు చెందిన ఎంఆర్ ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ రాం ప్రసాద్‌కు ఇచ్చి దానిని బెంగళూరుకు చేర్చాలని కోరాడు. ఈ డ్రగ్‌ను బెంగళూరులో హైదరాబాద్ వాసి మధురా ంకు ఇవ్వాలని కోరాడు. ఇందుకుగానూ రాంప్రసాద్‌కు దండిగా కమీషన్ ఇచ్చాడు. మహేందర్ కుమావత్ ఆదేశాల మేరకు ట్రావెల్స్ బస్సు డ్రై వర్ రాంప్రసాద్ నుంచి మధురాం సదరు డ్రగ్స్ పాకెట్లను తీసుకుని వాటిని నగరంలోని మియాపూర్‌లో గల ఓ నిర్జన ప్రాంతం వద్దకు రెండు రోజుల క్రితం తీసుకువచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు, మియాపూర్ పోలీసుల సహకారంతో దాడిచేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద 1.031 కిలోల ఓపియంతో పాటు 25 గ్రాముల ఎండి మెఫెడ్రోం పట్టుబడింది.

ఈ కేసులో హైదరాబాద్‌కు చె ందిన మధురాం (29) (అసలు నివాసం రాజస్తాన్), కెపిహెచ్‌బికి చెందిన మహేంద్ర పటేల్ (36), మియాపూర్‌కు చెందిన ధర్మేంద్ర (38) ప ట్టుబడ్డారు. ఇదే కేసులో రాజస్తాన్‌కు చెందిన మహేందర్ కుమావత్, ఎంఆర్ ట్రావెల్స్‌కు చెందిన రాంప్రసాద్, అమీర్‌పేట్ నివాసి రాము, అ త్తాపూర్‌కు చెందిన శ్రవణ్, రామాయంపేట్ కు చెందిన రాజేందర్, రమేష్‌లు పరారీలో వున్నారు. సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన రెం డవ కేసులో ఈగల్ పోలీసులు రాజస్తాన్‌లోని పరిశ్రమ భవన్ వద్ద నలుగురు డ్రగ్స్ స్మగ్లర్లు పట్టుబడ్డారు. వీరి వద్ద ఏడు గ్రాముల ఎండి డ్రగ్ పట్టుబడింది. ఈ కేసులో హరీందర్ దేవ్‌డా సూత్రధారి. ఇతని ముఠా దక్షిణాది నగరాలతో పాటు ఉత్తరాది నగరాలలో ఈ దందా సాగిస్తోంది . మాదకద్రవ్యాల విషయంలో అన్ని వర్గాలు అప్రమత్తంగా వుండాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఎ లాంటి సమాచారం వున్నా 1908, 8712671111 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# ఆర్థిక స్వావలంబన

>> సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యమంత్రిని కలిసి బిసి వర్గాల సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా చర్చించాలని నిర్ణయించారు. బిసిల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించే అంశంపై కృషి చేయాలని నిర్ణయించారు. అలాగేబిసి కమిషన్‌ను మరింత బలోపేతం చేసి, బిసిల సమస్యల పరిష్కారంలో కమిషన్‌కు అవసరమైన సహకారం అందించాలని చర్చించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రజా పాలన ప్రభుత్వం కొనసాగిస్తోందని సమావేశంలో పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతల వారీగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. బిసి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరాలనీ సూచించారు. బిసి సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. బిసి వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బిసి సంక్షేమ శాఖకు అవసరమైన నిధులు కేటాయించి, సంక్షేమం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి వేగంరాష్ట్రంలోని వివిధ బిసి కుల సంఘాలకు సంబంధించిన ఆత్మగౌరవ భవనాలకు సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి, నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు నిర్ణయించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలోని బిసి ప్రజాప్రతినిధులు, నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.

సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మాజీ ఎంపి వి. హనుమంతరావు, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, నవీన్ యాదవ్, ఈర్లపల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## వాటర్ అమృత్ స్కీంలో ఎస్సారెస్పీ

>> సులభం చేసేందుకు కేంద్ర జలసంఘం రాష్ట్ర నీటిపారుదలశాఖ కలిసి పనిచేయడానికి వీలవుతోంది. ఇందులో భాగంగా సాగునీటి నిర్వహణ డిజిటలైజేషన్ దిశగా తెలంగాణ ప్రభుత్వం కూడా "స్టేట్‌వాటర్ ఇన్ఫర్మేటిక్ సెంటర్"ఏర్పాటు చేయడానికి సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టు 44 వేల చిన్ననీటి వనరులు, చెరువుల నిర్వహణను కూడా డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్నారు .కరవు, వరదలు సంభవించినప్పుడు చెరువులు, భారీ ఎత్తిపోతల పథకాల వరకు నీటినిర్వహణలో సమర్థవంగా ఉపయోగించేందుకు డిజిటల్ విధానంను రూపకల్పన చేయనున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డబ్ల్యుఅమృతం పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధం చేసిన ప్రతిపాదనలు కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం సమర్పించడమే కాకుండా ఆ మొత్తం కార్యచరణ వివరించించింది. తెలంగాణ రాష్ట్రం కూడా "డబ్ల్యు అమృతం" తోసాగునీటి నిర్వహణను పూర్తిగా డిజిటలైజేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.

## సిఎం విజయ్ ప్లాన్‌కు డీఎంకే చెక్!

**చెన్నై, ఆగస్టు 8:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు ఏదీ కలిసి రావడం లేదు. తాజాగా త్రిష వ్యవహారంలో విపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ను అరెస్టు చేసి, తిరిగి కోర్టులో ఆయన్ను విచారించి వదిలేస్తామని చెప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత డీలిమిటేషన్ బిల్లు విషయంలో రాష్ట్ర ఎంపీల్ని ఏకం చేసి తమిళనాడు ప్రతినిధిగా కేంద్రం దగ్గర మార్కులు కొట్టేద్దామని విజయ్ వేసిన భారీ ప్లాన్ కాస్తా అట్టర్ ప్లాప్ అయ్యేలా కనిపిస్తోంది. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ మహిళా బిల్లు సహా పలు కీలక బిల్లుల్ని ఆమోదింపచేసుకునేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కానీ విపక్షాలు మాత్రం అమిత్ షాను సభకు వచ్చి విద్యార్దులపై పోలీసులు చేసిన దాడులపై సమాధానం ఇవ్వాలంటూ పట్టుబడుతున్నాయి. అదే సమయంలో డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర బిల్లుల్ని కలిపి ఇదే సమావేశాల్లో ఆమోదింపచేసుకుందామని అనుకుంటే, డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తున్న ఎంపీలు, ఇతర బిల్లులకు మద్దతివ్వడం లేదు. దీంతో డీలిమిటేషన్‌మహిళా బిల్లుల్ని పక్కనబెట్టి మిగతా బిల్లులు ఆమోదింపచేసుకుంటున్న కేంద్రం వాటి కోసం ఈ నెల 16,18 తేదీల మధ్య ప్రత్యేక సమావేశాల నిర్వహణకు సిద్దమవుతోంది. ఇంత కీలకమైన డీలిమిటేషన్ బిల్లుకు విపక్షాల మద్దతు కీలకంగా మారింది. ఇప్పటికే తమిళనాడులో రాజకీయ పార్టీల మధ్య ఉన్న విభేదాల్ని సొమ్ము చేసుకుంటూ డీలిమిటేషన్ బిల్లును నెగ్గించుకోవాలని కేంద్రం చూస్తోంది.

## చెక్‌బౌన్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిని దోషిగా తేల్చిన కోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** చెక్‌బౌన్స్ కేసులో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిని హైదరాబాద్ మున్సిపల్ కోర్టు దోషిగా నిరారించింది. మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఖుష్బు ఉపాధ్యాయ ఈ మేరకు తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మెసర్స్ ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ వనరులను వ్యక్తిగత లాభాలకు వాడుకుని ఆ కంపెనీకి నష్టం కలిగించాడనే కారణంతో రోహిత్ రెడ్డి 2014 లో రాజీనామా చేశారు. దీని తరువాత ఆ కంపెనీతో కుదిరిన ఒప్పందం ప్రకారం రోహిత్ రెడ్డి సదరు కంపెనీకి 34 లక్షల 23 వేల రూపాయ లు చెల్లించేందుకు అంగీకరించారు. ఇందుకు సంబంధించి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుకు చెందిన చెక్‌ను రోహిత్‌రెడ్డి సదరు కంపెనీ నిర్వాహకులకు ఇచ్చారు. అయితే ఈ చెక్ మూడుసార్లు తగినంత నగదు నిలువలేని కారణంగా బౌన్స్ అయ్యింది. దీనిపై మెసర్స్ ఇంటె ల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రోహిత్‌రెడ్డికి లీగల్ నోటీసు పంపినా స్పందించలేదు. దీంతో కంపెనీ నిర్వాహకులు రోహిత్ రెడ్డిపై కోర్టులో కేసు దాఖలు చేశారు. దీనిపై కొంతకాలంగా కోర్టులో వాదనలు సాగుతు న్నాయి. చివరకు ఈ కేసులో పైలట్ రోహిత్ రెడ్డిని నెగోషియబుల్ ఇన్‌స్ట్రు మెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద దోషిగా తేలుస్తూ న్యాయ మూర్తి తీర్పు చెప్పారు. తీర్పు వెలువడే సమయంలో పైలట్ రోహిత్ రెడ్డి కోర్టులో లేకపోవడంతో ఆయనపై నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. దీనిపై రోహిత్‌రెడ్డి కోర్టుకు హాజరైన తరువాత శిక్షను ఖరారు చేయనున్నారు.

## పెద్ది కుటుంబానికి పెద్దదిక్కుగా కెసిఆర్

### సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి రూ. 2.25 కోట్లు అందజేత

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఇటీవల అనా రోగ్యంతో మరణించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసిఆర్ నిర్ణయించారు. ఇందులో భాగం గా, సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుద ర్శన్‌రెడ్డి తల్లి వృద్ధురాలైన అమృతమ్మ బాగోగుల కోసం మరో 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కెసిఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపా యలను పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బిఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అంతేకాకుండా పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబం ధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత కెసిఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతోపాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

## ఔటర్ రింగురోడ్డుపై ఘోరప్రమాదం

### నియోపోలిస్ బ్రిడ్జి పిల్లర్‌ను ఢీకొట్టిన కారు

### ఇద్దరు వలస కార్మికులు మృతి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఔటర్ రింగురోడ్డు మీద అర్ధరాత్రి ఘోరప్రమాదం చోటుచేసుకుకుంది. ఐటి కారిడార్ సమీపం లోని నియోపోలిస్ సర్వీసు రోడ్డు మీద ఉన్న బ్రిడ్జి పిల్లర్‌ను అతివేగంగా దూసుకు వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్ నుంచి నగ రానికి వచ్చి టైల్స్ కార్మికులుగా పనిచేస్తున్న ఇద్దరు మ ృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకా రం..



కన్హయ్యలాల్, దేరామ్(ఫైల్)

రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కన్హయ్య లాల్(25), దేరామ్ (24)లు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి టైల్స్ కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఉస్మాన్ నగర్ సమీపంలోని ఔటర్ రింగురోడ్డుకు ఆనుకొని ఉన్న ఇంద్రారెడ్డినగర్‌లో నివాసం ఉంటూ కొంతకాలంగా నానక్‌రాంగూడలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీరు ఇద్దరు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంద్రారెడ్డినగర్ నుంచి నానక్‌రాంగూడ సత్వా నాలెడ్జ్‌సిటీకి టవేరా కారు (ఎపి01 ఎబి2232) లో బయలుదేరారు. ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డు మీదుగా కన్హయ్యలాల్ కారు నడుపుతూ వస్తున్నారు. మార్గమధ్యంలో నియో పోలిస్ సమీపంలో సర్వీసు రోడ్డుమధ్యలో ఉన్న నియోపోలిస్ బ్రిడ్జిని అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కన్హయ్యలాల్, పక్కనే ఉన్న దేరామ్‌లు అక్కడికక్కడే మ ృతిచెందారు. పిల్లర్‌ను ఢీకొట్టిన కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మ ృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సర్వీసు రోడ్డు మీద వేగంగా వచ్చే వాహనాలు నియోపోలిస్ బ్రిడ్జి పిల్లర్‌తో తికమకపడుతున్నారని వాపోయారు. ఈ మేరకు ప్రమాదంపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యోగాల కోసం పిలిచి లాఠీఛార్జి చేయిస్తారా?: బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు8:** హైడ్రా ఉద్యోగాల కోసం నిరుద్యోగులను పిలిచి లాఠీ ఛార్జి చేయిస్తారా ? అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీలు ఝుళిపించి, తీవ్రంగా కొడుతున్న దృశ్యాలు తనను కలిచి వేశాయని ఆయన తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో హైడ్రా ఉద్యోగాల నియామకం కోసం తరలి వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీ ఛార్జి చేయడం బాధాకరం అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఘటనను రాజకీయం చేసిన కాంగ్రెస్, ఈ లాఠీఛార్జి ఘటనకు ఏమని సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మొహబ్బత్ కీ దుకాణ్ అంటే ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు. కేవలం 150 ఖాళీల కోసం అంత భారీ సంఖ్యలో యువతీ యువకులు తరలిరావడం అత్యంత ఆశ్చర్యకరం అని యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనడానికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనం అని ఆయన విమర్శించారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు ఎన్నో ఆకర్షణీయమైన హామీలిచ్చిందని, అధికార పీఠం దక్కగానే ప్రాధాన్యతా క్రమంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడతామని, ప్రతి నెల నిరుద్యోగ భృతితో పాటు యువతకు అన్ని విధాలా అండగా ఉంటామని గొప్పలు చెప్పిందని ఆయన గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండేళ్లు గడిచినా, నేటికీ యువత ఉద్యోగాల కోసం రోడ్లపైనే నిరీక్షించాల్సి రావడం శోచనీయం అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కొత్త ఉద్యోగావకాశాలు లేక యువత అల్లాడుతుంటే హైడ్రాలో కేవలం 150 ఉద్యోగ ఖాళీల ప్రకటన రాగానే వేలాది మంది నిరుద్యోగులు సరూర్ నగర్ స్టేడియానికి పరుగులు తీశారని ఆయన తెలిపారు.

## ఆదివాసీల భూహక్కులు పరిరక్షించాలి

### రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఆదివాసుల సాంప్రదాయ జీవన విధానాన్ని గౌరవించి, వారి భూ హక్కులను పరిరక్షించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండ రెడ్డి అటవీ అధికారులను సూచించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూనే వారి భూహక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ శాఖలపై ఉందని అన్నారు. ఉట్నూరులో ఆదివాసులు, గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో కొదండరెడ్డి మాట్లాడుతూ ప్రకృతితో సన్నిహితంగా ముడిపడి ఆదివాసీ జీవన విధానాన్ని ఉందన్నారు. గిరిజన వర్గాలతో సత్సంబంధాలు కొనసాగించాలని అటవీ అధికారులను ఆయన విజ్ఞప్తి చేశారు. సాంప్రదాయ పంటలను, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను మరింతగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. నేల సారవంతం మెరుగుపరచడానికి, దేశీయ సాగు పద్ధతులను పునరుద్ధరించడానికి ఆదివాసీ రైతులలో సాంప్రదాయ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు.

# ఇథనాల్‌పై దేశవ్యాప్త పోరాటానికి సిద్ధం

## మిక్సింగ్‌లో భారీగా అవినీతి

## ప్రభుత్వ పెద్దలకు లబ్ధికే ఆ విధానం: రాహుల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** పెట్రోలులో ఇథనాల్ మిక్సింగ్ వ్యవహారంలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధం అవుతున్నది. అక్రమాలపై త్వరలోనే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రకటించారు. అందరికంటే ముందుగా రాహుల్ గాంధీ ఓ వీడియోను తన అధికారిక సోషల్ మీడి యా ప్లాట్ ఫామ్స్‌పై పోస్ట్ చేశారు. తన ఇంటి ఆవరణలో ఓ కారు పక్కన నిల్చుని ఈ వీడియోను చిత్రీకరించారు. ఈ20 అంశాన్ని ప్రస్తావించారు. సాధారణంగా ఏదైనా వ్యవహారంలో మోసం జరిగితే దాల్ మే కుచ్ కాలా హై అని అంటుంటామని, ఈ ఈ20 పెట్రోల్ వ్యవహారం దీనికి పూర్తిగా భిన్నంగా ఉందని, ఇక్కడ వ్యవస్థ మొత్తం అవినీతిమయమైందని వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ పెద్దలు మాత్రమే లబ్ధి పొందుతుంటే, సామాన్య ప్రజలు మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మెడలు వంచేంత వరకూ దీనిపై పోరాటం సాగిస్తూనే ఉంటామని తేల్చి చెప్పారు. భారీ ఎత్తున ప్రజా పోరాటాలు చేసేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకున్నామని పేర్కొన్నారు. దీని నుంచి కేంద్రం వెనక్కి తగ్గేంత వరకూ వదలబోమని అన్నారు. ఈ వీడియోకు లక్షల్లో వ్యూస్ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఫేస్ బుక్ లో 10లక్షల మందికి పైగా యూజర్లు ఈ వీడియోను చూశారు. రియాక్ట్ అయ్యారు. 28,000 వరకు వేర్వేరు ఎమోజీలతో తమ స్పందన తెలియజేశారు. 28వేల వరకు కామెంట్స్ పోస్ట్ అయ్యాయి. అదే స్థాయిలో ఈ వీడియోను షేర్ చేశారు నెటిజన్లు. ఇదే వీడియోను ట్విట్టర్‌లో 64లక్షల వ్యూస్ లభించాయి. 18వేల మంది ట్విట్టరెటీలు దీన్ని రీపోస్ట్ చేశారు. ఇథనాల్ పై గానీ, కేంద్ర ప్రభుత్వంపై గానీ నెలకొన్న అసంతృప్తికి అద్దం పట్టినట్టయింది. దేశంలో వాహన దారులను ఇథనాల్ వ్యవహారం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని 20 శాతానికి (ఇ20) పెంచడం వల్ల పాత వాహనాల మైలేజ్ తగ్గుతోంది. ఇంజిన్ దెబ్బతింటోంది. 2023 కంటే ముందు తయారైన నాన్‌ఈ20 వాహనాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోందంటూ సర్వేలు సైతం తేల్చి చెబుతున్నాయి. ఇది ఇంధన సామర్థ్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, ఇంజిన్ దీర్ఘకాలిక మనుగడను దెబ్బ తీస్తోందని స్పష్టం చేస్తోన్నాయి. ఈ అంశంపై దేశవ్యాప్త పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇథనాల్ బ్లెండింగ్ వెనుక భారీ ఎత్తున అవినీతి జరుగుతోందంటూ కాంగ్రెస్ మండిపడుతోంది. ఆమ్ ఆద్మీ, ఇతర ఇండియా బ్లాక్ పార్టీలను కలుపుకెళ్తోంది విషయంలో ఇప్పటికే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా దీనిపై గళం ఎత్తింది కూడా.

# అమ్మాయిలు టార్గెట్‌గా 'రెంటల్ బాయ్‌ఫ్రెండ్స్'!

## కొత్త తరహా సైబర్ మోసం

## జాగ్రత్తగా ఉండాలని కొత్వాల్ సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసం ట్రెండ్ అవుతోంది. ఇప్పటి వరకు జరిగిన మోసాలకు భిన్నంగా కే వలం అమ్మాయిలు ముఖ్యంగా టీనేజిలను టార్గెట్ చేసుకుని ఒంటరి వా రికి వల విసురుతూ అందినంత దోచుకోవడం, వీలైతే బ్లాక్ మెయిల్ చేసీ మరీ భారీగా లబ్ధి పొందడం నేరగాళ్ల లక్ష్యంగా సైబర్ నిపుణులు చెబుతున్నారు. ఈ తరహా మోసాల పట్ల అమ్మాయిలు జాగ్రత్తగా వుండాల ని సిటీ కొత్వాల్ సజ్జనఆర్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల బరితెగించారు. కాలేజీల్లో చదువుతున్న అమ్మాయిలను టార్గెట్ చేస్తూ వారిని డేటింగ్ ఉచ్చులో దించేందుకు రెంటల్ బాయ్ ఫ్రెండ్స్ పేరిట సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయసాగారు.

ఇందుకోసం ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో ఆకర్షణీయ మైన పోస్టర్లతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. కొన్నిసార్లు ఇందులో 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు చెబుతున్నారు. కాఫీ డేట్ కింద 499 రూపాయలు, సినిమా డేట్ కింద 1249 రూపాయలు, షాపింగ్‌లు, పెళ్లిలకు తోడుగా బాయ్ ఫ్రెండ్స్‌లా వచ్చే సమయంలో రెండు వేల రూపాయల (రెండు నుంచి నాలుగు గంటల వరకు) ధరలను ప్రకటించారు. ఇదే సమయంలో పది గంటల ఫుల్ డే ప్యాకేజీకి 4499 రూపాయలు అంటూ సైబర్ కేటుగా ళ్లు ప్రకటించారు.

ఏఐతో రూపొందించిన శరీర సౌష్టవం, అందంగా వుండే యువకుల ఫొటోలతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టిస్తున్న సైబర్ నేరగాళ్లు వీటి సహాయంతో అమ్మాయిలను టార్గెట్ చేస్తున్నారు. ఈ మెసేజ్‌లకు స్పందించిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో చాటింగ్ మొదలుపెట్టి, ఆ తరువాత బుకింగ్ కన్మార్మింగ్, సెక్యూరిటీ డిపాజిట్ వాలెట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా వేలాది రూపాయలను దోచుకుంటున్నారు.

### అమ్మాయిలు జాగ్రత్త..వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయవద్దు: సజ్జనార్ హెచ్చరిక

ఇదిలా వుండగా ఈ తరహా మోసాల పట్ల అమ్మాయిలు జాగ్రత్తగా వుండాలని సిటీ కొత్వాల్ సజ్జన్నర్ తెలిపారు. ముఖ్యంగా ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత ఫోటోలను షేర్ చేయవద్దని ఆయన అమ్మాయిలను కోరారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ కూడా చేయవద్దని, ఒకవేళ చాటింగ్ చేసినట్లయితే ఆ నంబర్ల ఆధారంగా బ్లాక్ మెయిల్‌కు పాల్పడతారని, దీనివల్ల వ్యక్తిగత జీవితం ప్రమాదంలో పడే వీలుందని ఆయన హెచ్చరిం చారు.

అపరిచత వ్యక్తుల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, ఇలాంటి ప్రకటనలు వస్తే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చే యాలని సజ్జన్నర్ కోరారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో వారి సోషల్ మీడియా, ఆన్‌లైన్ పరిచయాలపై నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు.

## తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పృథ్వీశ్వర్‌రెడ్డిపై వేటు

**హైదరాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త:** జూనియర్ మహిళా బాస్కెట్ బాల్ క్రీడాకారిణితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనకు సంబంధించి మా దాపూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో నిందితుడు, తెలంగాణ బాస్కెట్ బాల్ జనరల్ సెక్రటరీ పృథ్వీశ్వర్ రెడ్డిపై వేటు పడింది. తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ పృథ్వీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి నిర్వహిం చిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జాతీయ బాస్కెట్ బాల్ ఫెడరేషన్‌కు తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియే షన్ లేఖ పంపింది. పృథ్వీశ్వర్ రెడ్డి స్థానంలో జాయింట్ సెక్రటరీగా వున్న విష్ణుకుమార్‌ను నియమించినట్లు అసోసియేషన్ ప్రకటించింది. మ రోవైపు ఫోక్సో కేసులో పృథ్వీశ్వర్ రెడ్డికి బెయిల్ రావడంపై బాధిత బాలిక తల్లిదండ్రులు తీవ్ర అభ్యంరం తెలిపారు. ఈ కేసులో పృథ్వీశ్వర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## నీట్, జెఇఇ పరీక్షలకు లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త:** తెలంగాణ వెనుకబడిన తరగతుల విద్యార్థులు జాతీయ వైద్య ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షలో ప్రతిభ కనబరిచి సీట్లు సాధించేందుకు లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలనీ మహాత్మ జోతిబ్యాపూలే తెలంగాణ వెనుకబడినతరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. బాలురకు నీట్‌లో వంద, జెఇఇకి 40సీట్లు బాలికలుల నీట్‌లో 50సీట్లు ,జెఇఇ 50సీట్లు ఉంటాయని తెలిపారు. బాలురకు బాటసింగారంలో బాలికలలకు నాగోల్ కోచింగ్‌ఇస్తారు. ఆగస్టు 9నుంచి 16వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గ్రామీణ విద్యార్థుల తలితండ్రులకు లక్షా 50వేల పట్టణ విద్యార్థుల తలితండ్రులకు రెండులక్షలు వార్షిక ఆదాయం లోపు ఉంటే దరఖాస్తులకు అర్హులు అని పేర్కొన్నారు.

# అత్తను హత్యచేసి కాల్చి బూడిద చేసిన అల్లుడు

## తుంబూరులో దారుణ సంఘటన

**సత్తుపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త:** పిల్లనిచ్చిన అత్తను, అల్లుడు దారుణంగా హత్య చేసి రెండో కంటికి తెలవకుండా మాయ చేద్దామని రాత్రికి రాత్రే మరొకరి సహాయంతో బస్తాలో బాడీని మూటగట్టి సమీపంలోని పామాయిల్ తోటల్లో శవాన్ని కాల్చి బూడిద చేసిన దారుణమైన సంఘటన సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామంలో వెలుగు చూసింది. సభ్య సమాజం తలవంచుకునే విధంగా జరిగిన ఈ దారుణమైన సంఘటన గురించి గ్రామస్తులు కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం తుంబూరు గ్రామానికి చెందిన వెదుళ్ళ గుండాల వెంకట నరసమ్మ (65) కు ముగ్గురు కుమార్తెలు సంతానం. తిరుపతిరావు కు కుమార్తెను ఇచ్చి వివాహం చేయగాగ్రామంలో ఉంటూ తిరుపతిరావు ప్రైవేట్ గా విద్యుత్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తిరుపతిరావుకు గ్రామంలో మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొనికొనసాగిస్తున్నాడని గత మూడు రోజుల క్రితం కుటుంబీకులు మధ్య వివాదం జరగటంతో దీన్ని ఏ విధంగా అయినా అత్తను కడతేర్చాలనితిరుపతిరావు నిర్ణయించుకున్నాడని కుటుంబీకులు గ్రా మస్తులు ద్వారా తెలిసింది. గత మూడు రోజుల నుంచి తల్లి వెంకట నరసమ్మ గ్రామంలో కనిపించడం లేదని సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో కుమార్తె ఫిర్యాదు చేయడం జరిగింది. అత్తవెంకట నరసమ్మ హత్యకు కారణం తిరుపతిరావు మరో మహిళతో సంబంధం పెట్టుకోవడమే నని, లేదా ఆస్తి వివాదంలోనూ అయినా ఉండవచ్చని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అల్లుడు హత్య చేసి అత్తను రాత్రి కి రాత్రి తుంబూరు నుంచి సత్తుపల్లి వైపు వచ్చే నారాయణపురం గ్రామ సమీప పామాయిల్ తోటల్లో శవాన్ని కాల్చి బూడిద చేశారని ఆ నోట ఈ నోట సమాచారం పోలీసులు కు అందటంతో ఏసీపి వసుంధర యాదవ్ ఆదేశాలతో శనివారం సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఆధ్వర్యంలో ఎస్సై వీర ప్రసాదు, క్లూస్ టీం, శవాన్ని దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించగా ఖాళీ బూడిదైన ఉండగా ఎముకలను, ముడుసులను, క్లూస్ టీం సేకరించి డిఎన్ఏ పరీక్షకు తీసుకెళ్లారు. ఇంత దారుణానికి వడిగట్టిన అల్లుడు తిరుపతిరావు, ఈ హత్యకు ఆయనతో సహకరించిన వారికోసం కల్లూరు ఏసిపి వసుంధర యాదవ ఐపీఎస్ పర్యవేక్షణలో సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఆధ్వర్యంలో ఎస్సై వీరప్రసాద్ పోలీస్ బృందం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు.

## నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు8:** నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ఎల్పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారని, ఇది నిరుద్యోగుల తప్పా.. లేక ఉద్యోగాలు కల్పించ డంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం తప్పా..? అని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో క్రిమినల్ వేస్ట్ అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలా డటం చూస్తుంటే యథా రాజా.. తథా అధికారులు అన్న సామెత గుర్తుకొస్తోందని విమర్శించారు. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు..? అని అడిగారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికీ 32 నెలలు దాటిందని, ఆ హామీ ఏమైందని నిలదీశారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్...జాబ్ క్యాలెండర్ బోగస్.. నిరుద్యోగులకు ఆయన ఇచ్చిన హామీలు బోగస్ అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని, నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పిజి, పిహెచ్‌డి వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిం దని వ్యాఖ్యానించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదు..భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, వారిని అవమానిం చినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## నేతన్నల పొదుపు సొమ్ము ఇవ్వడం బిఆర్ఎస్ హయాం నుంచే ఆపేశారు

### మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్

**హైదరాబాద్,ఆగస్టు8,ప్రభాతవార్త:** నేతన్నల పొదుపు సొమ్ము వాపసు ఇవ్వడం బిఆర్ఎస్ హయాంలో 2021 నుంచే ఆపేశారని,కూళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు డబ్బులు మాత్రం ఇచ్చారనిమినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ ఆరోపించారు. గాంధీభవన్ లో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ కు దోచుకోవడం తప్పా పేద ప్రజలు కష్టాలు తెలియదనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. హాండ్లూమ్, పవర్ లుమ్ కు తేడా తెలియకుండా ఆ శాఖకు కెటిఆర్ మంత్రిగా పనిచేయడం మన దౌర్భాగ్యమనీ అన్నారు. ఆఫ్ నాలెడ్జ్ తో కెటిఆర్ సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసాడనీ దుయ్యబట్టారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో నేతన్నల పొదుపు సొమ్ము ఆగిపోయిందనీ, కానీ నేతన్నల పొదుపు సొమ్ము ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించడం విడ్డూరం అన్నారు.సిరిసిల్లలో ఎంతోమంది నేతన్నలు చనిపోయారు కానీ కెటిఆర్ పట్టించుకోలేదనీ ఆవేదన చెందారు.

# 'హైడ్రా' ఉద్యోగాలకు పోటెత్తిన అభ్యర్థులు

## సరూర్‌నగర్ స్టేడియంలో ఈవెంట్స్ ఏర్పాటు

## పెద్దత్తున తోపులాట.. కనీస ఏర్పాట్లు లేకపోవడంతో అసహనం



**హైదరాబాద్, ఆగస్టు 8,ప్రభాతవార్త:** హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శని, ఆదివారాల్లో ఈవెంట్స్ ఉంటా యని హైడ్రా ప్రకటించింది. దీంతో ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత తెల్ల వారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు.కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యో గులతో కిక్కిరిసి పోయింది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవ డంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. నిద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిరక్ష్యంగా ప్రవర్తించా రంటూ వాపోయారు వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆతర్వాత అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపి టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని చెప్పారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayIndia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

టెండర్ ప్రకటన నం. 20 / 2026, తేది : 07.08.2026
PUB/541

స్టోర్స్ సామగ్రి సరఫరా.
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు:

ఈ క్రింది టెండర్లు ఆన్‌లైన్‌లో జారీ చేయబడ్డాయి. ఆసక్తి గలవారు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరడమైనది. టెండర్ వివరాలు, పరిమాణం EMD మరియు SD వంటి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మాన్యువల్ (చేతితో సమర్పించే) ఆఫర్లు లేదా పోస్ట్ ద్వారా పంపే ఆఫర్లు స్వీకరించబడవు. "దేశీయంగా తయారైన ఉత్పత్తుల ఆఫర్ల కోసం, EMDని కేవలం www.ireps.gov.in లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే స్వీకరించడం జరుగుతుంది."

| టెండర్ నం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 66266425A | ప్లాసర్ తయారీ TM విడిభాగాలు |
| 66266657 | ప్లాసర్ తయారీ TM విడిభాగాలు |
| 29261226 | WAP-7 లోకో కోసం 20 పళ్ళు కలిగిన పినియన్ షాఫ్ట్ |
| 80255027A | హైడ్రాలిక్ ఆయిల్-Shell Tellus S2VX68 |
| 80261215 | Shell Gadus S5 V 42 P 2.5 గ్రీజు |
| 66257118 | TM కోసం విడిభాగాల సేకరణ |
| 66266199A | ప్లాసర్ తయారీ TM విడిభాగాలు |
| 60265423 | ట్రాప్ స్విచ్ స్లీపర్స్ T-5836 నుండి T-6068 వరకు |
| 77261010 | ఎనామెల్ పెయింట్ - Gentian Blue షేడ్ (RAL-5010) |
| 29261412 | WAG9 లోకోల కోసం ప్రైమరీ యాక్సిల్ డాంపర్ |
| 77261252 | పెట్రోలియం హైడ్రోకార్బన్ సాల్వెంట్ (థిన్నర్) |
| 25263459 | పాంటోగ్రాఫ్ – రకం AM12 పూర్తి |
| 77261145A | పెయింట్ రెడీ మిక్స్ - Red Oxide (ISC:446) - బ్రషింగ్/ఫినిషింగ్ |
| 60267639 | T-8838 కోసం TWSEJ స్లీపర్లు |
| 66267047 | ప్లాసర్ తయారీ TM విడిభాగాలు |
| 60267551 | 1 in 12, 60KG, T-4218 కోసం NCR రబ్బర్ ప్యాడ్‌ల సేకరణ |
| 29265008 | విద్యుత్ ఆధారిత విండ్‌స్క్రీన్ వైపర్ సరఫరా, అమరిక మరియు వినియోగంలోకి తీసుకురావడం |
| 66267345 | TM కోసం వాల్వ్‌లు మరియు పంపుల సేకరణ |
| 66267318 | TM కోసం TCTT సేకరణ |
| 66265850 | TM విడిభాగాల సేకరణ |
| 66266943 | TM విడిభాగాల సేకరణ |
| 45261110 | రైల్వే క్యారేజ్ బ్రష్‌లెస్ ఫ్యాన్ |
| 45261386 | 70Ah, 110V VRLA నిర్వహణ అవసరం లేని బ్యాటరీ |
| 45261043 | బ్రష్‌లెస్ ఆల్టర్నేటర్ 4.5 KW |
| 42261482 | 400A, 3ph, 750V ZS కప్లింగ్ |
| 56261007 | PVC భూగర్భ రైల్వే సిగ్నలింగ్ కేబుల్ పరిమాణం: 12 కోర్ x 1.5 sq.mm |
| 56261006 | PVC భూగర్భ రైల్వే సిగ్నలింగ్ కేబుల్ పరిమాణం: 30 కోర్ x 1.5 sq.mm) |

గమనిక : టెండర్ తెరచుట గడువు తేదీలు
SL.No.01 to 03 తేది : 24.08.2026.
SL.No.04 to 06 తేది : 25.08.2026.
SL.No.07 &08 తేది : 26.08.2026
SL.No.09 to 16 తేది : 27.08.2026.
SL.No.17 to 25 తేది : 28.08.2026
SL.No.26 & 27 తేది : 31.08.2026

పైన పేర్కొన్న టెండర్లే కాకుండా, రూ. 50 లక్షల కంటే ఎక్కువ విలువైన ఇతర టెండర్లు కూడా ఉన్నాయి. వివరాల కోసం దయచేసి రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/సికింద్రాబాద్

టెండర్ ప్రకటన నం. 19 / 2026, తేది : 07.08.2026
PUB/540

స్టోర్స్ సామగ్రి సరఫరా.
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు:

ఈ క్రింది టెండర్లు ఆన్‌లైన్‌లో జారీ చేయబడ్డాయి. ఆసక్తి గలవారు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరడమైనది. టెండర్ వివరాలు, పరిమాణం EMD మరియు SD వంటి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మాన్యువల్ (చేతితో సమర్పించే) ఆఫర్లు లేదా పోస్ట్ ద్వారా పంపే ఆఫర్లు స్వీకరించబడవు. టెండర్ గడువు ముగిసే సమయం 14:30 గంటలు. "దేశీయంగా తయారైన వస్తువుల ఆఫర్లకు సంబంధించి, EMD కేవలం www.ireps.gov.in లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే స్వీకరించబడుతుంది."

| టెండర్ నం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 45261191 | LHB రకం కోసం LED ట్రిప్ ఎమర్జెన్సీ లైట్ యూనిట్ |
| 33261436 | Fiat బోగీ కోసం బోల్స్టర్ |
| 65265003 | హెవీ-డ్యూటీ ఎస్కలేటర్ |
| 33261090A | LHB కోచ్‌ల కోసం YAW డాంపర్ |
| 30263628A | నాన్-ఆస్బెస్టాస్ ఆధారిత 'K' రకం హై-ఫ్రిక్షన్ కాంపోజిట్ |
| 33261019 | సేఫ్టీ వైర్ రోప్ అసెంబ్లీ |
| 33261165A | బ్రేక్ కాలిపర్ యూనిట్ |
| 43265013 | బ్యాటరీలతో కూడిన CMS కియోస్క్‌లు ఆన్‌లైన్ UPS |
| 38261544 | ఎయిర్ బ్రేక్ హోస్ కప్లింగ్ పైప్ (పొడవు 790mm) |
| 38261499A | సరుకు రవాణా కోసం నాన్-ఆస్బెస్టాస్ ఆధారిత L-రకం కాంపోజిషన్ బ్రేక్ బ్లాక్ 1000mm చక్రం డయా |
| 45261021 | 1100 AH లెడ్-యాసిడ్ బ్యాటరీ |
| 33261104 | LHB కోచ్‌లకు జనరేటర్ కార్ కోసం ప్రైమరీ స్ప్రింగ్ అవుటర్‌కు |
| 30261379 | IRS సైడ్ బఫర్ కేసింగ్ |
| 33261010 | ఫియట్ బోగీల తయారీకి 25 వస్తువుల సెట్ |
| 30261385 | స్క్రూ కప్లింగ్ అసెంబ్లీ |
| 33261321 | జనరేటర్ కార్ కోసం ప్రైమరీ స్ప్రింగ్ ఇన్నర్/లోపలి భాగం |
| 33261415A | LHB నాన్-AC & AC కోచ్‌ల కోసం ప్రైమరీ స్ప్రింగ్ ఇన్నర్ |
| 45261192 | 4.5KW రెగ్యులేటెడ్ కమ్ ఎమర్జెన్సీ బ్యాటరీ ఛార్జర్ |
| 45261073 | 120 AH VRLA బ్యాటరీల సెట్ |
| 46261019F | పోర్సిలిన్ బ్రాకెట్ ఇన్సులేటర్ |
| 38261023 | లాకింగ్ ప్లేట్ కన్ఫార్మింగ్ |
| 46267001 | కాటెనరీ వైర్ 65 SQ.MM |
| 38261543 | ఎయిర్ బ్రేక్ హోస్ కప్లింగ్ అసెంబ్లీ |
| 38261023 | లాకింగ్ ప్లేట్ కన్ఫార్మింగ్ |
| 33261600 | స్పైరో ఎలాస్టిక్ రబ్బర్ బేరింగ్ |
| 33265020 | (PAPIS) యొక్క సరఫరా, అమరిక, పరీక్ష మరియు కమీషనింగ్ |
| 56261187 | 6 క్వాడ్ కేబుల్ |

గమనిక : టెండర్ తెరచుట గడువు తేదీలు
SL.No.01& 02 తేది: 24.08.2026. SL.No.03 to 07 తేది: 25.08.2026. SL.No. 08 తేది: 26.08.2026 SL.No.09 to 17 తేది: 27.08.2026. SL.No.18 to 21 తేది: 28.08.2026 SL.No.22 02.09.2026. SL.No.23 తేది: 31.08.2026. SL.No.24 తేది: 28.08.2026. SL.No.25 తేది: 31.08.2026. SL.No.26 తేది: 03.09.2026. SL.No.27 తేది: 31.08.2026.

పైన పేర్కొన్న టెండర్లే కాకుండా, రూ. 50 లక్షల కంటే ఎక్కువ విలువైన ఇతర టెండర్లు కూడా ఉన్నాయి. వివరాల కోసం దయచేసి రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/సికింద్రాబాద్
A633

తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

# అభివృద్ధికి ముఖద్వారం భోగాపురం విమానాశ్రయం

**విజయకుమార్ ఘంటా**

ఒకొక్కటిగా కలలు సాకారం అవుతుంటే, ఆ ఆనందం అనిర్వచనీయం .రాజధానితో సహా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా వేరుపడితే, అంతుచిక్కని అంతర్మథనం. ఈ రాష్ట్రానికంటూ ఒక రాజధాని ఉండదా అనే ఓ ప్రవల్లిక ప్రతి ఆంధ్రుని మోమున నిలిచిన క్షణంలో అమరావతి రాజధానిగా సాక్షాత్కరించింది. రాష్ట్రం నుంచి తెలంగాణా వేర్పాటయిన తరువాత హైదారాబాదే ఉమ్మడి రాజధాననుకున్నా, అప్పటి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమరావతి పేరిట కృష్ణాతీరంలో సుందర రాజధానిని నిర్మించుకుందామనే తలంపుకు ప్రాణం పోసింది. 2016 నాటికి ఏపీ రాజధానిగా అమరావతి ప్రకటితమైనప్పటికి సచివాలయం,అసెంబ్లీ భవనాలు,హైకోర్టు భవనాలన్ని తాత్కాలికంగా నిర్మితమయ్యాయి. 30వేలఎకరాల్లో రాజధాని నిర్మాణ ప్రతిపాదనలను చట్టసభలు అంగీకరించాయి. సుందరనగరం రాజధానిని నిర్మించాలనే ప్రయత్నం జరిగింది. కొన్ని భవనాలు నిర్మితమయ్యాయి. 2019–24 మధ్య అమరావతి రాజధాని నిర్మాణం వెనుకబడింది. మూడు రాజధానుల ప్రతిపాదనలో అమరావతి పేరుకే రాజధాని అయింది. అమరావతి కోసం దగ్గర,దగ్గర మూడేళ్ళ పోరాట మహిళలు,రైతులు సాగించారు.ఈ దశలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చింది. వస్తూనే అమరావతిని అంతర్జాతీయ నగరం చేస్తామనే ప్రతిజ్ఞ చేసింది. చూస్తుండగానే కూటమి ప్రభుత్వ పాలన రెండేళ్ళలో ఎన్నో మైలురాళ్ళు దాటింది. అమరావతి క్రమక్రమంగా అభివృద్ధి పథంలోకి అడుగుపెట్టి, వెనక్కి తిరగకుండా ముందుకు సాగుతుంది.రూ.లక్షల కోట్లు పెట్టుబడులు రాజధానికి వచ్చి చేరుతున్నాయి.నగరం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మితమైంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకుని,జాతీయ.అంతర్జాతీయ సర్వీసులకు సిద్ధమైంది. రాష్ట్ర విభజన తర్వాత ప్రారంభమైన తొలి అతి పెద్ద అంతర్జాతీయ విమానాశ్రయంగా ఖ్యాతికెక్కింది. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి ముఖచిత్రాన్ని మార్చటంలో ఇది కీలకమైన ముందడుగుగా ఏపీ ప్రభుత్వం ఈవిమానాశ్రయ ప్రారంభ సమయంలో ప్రకటించింది. ఈమాటలకు బలం చేకూరుస్తూఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, స్వర్ణాంధ్ర విజన్ సాకారానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభం అత్యంత కీలకమైన రోజు అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ



విమానాశ్రయం ప్రారంభోత్సవంతో పాటు రాష్ట్రంలో మొత్తంగా రూ.18వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన ప్రకటించారు. ఇదంతా యాధృచ్ఛికం కాదు, దార్శనీక దృక్పథ వచనం,దాంతో నవ్యాంధ్ర రెండేళ్ళ అభివృద్ధి కార్యచరణానికి ప్రాణవాయువు చిక్కినట్లయింది. ఉత్తరాంధ్ర యువత ప్రగతికి ఈ సరికొత్త ఎయిర్ పోర్టు ఒక రన్‌వేలా, లాంచ్ ప్యాడ్‌లా పని చేస్తుందని ప్రధాని వ్యాఖ్యానించారు. స్వర్ణాంధ్రతో పాటు వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజిన్ సర్కార్ రాత్రింబవళ్ల శ్రమిస్తోందని వెల్లడించారు. గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలపై ఆయన పేరుతోనే ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పరిశ్రమల ద్వారా పెట్టుబడులు పెరగడం, తద్వారా ఉత్పత్తి, ఎగుమతులు పెరిగి యువతకు ఉపాధి లభించడమే ఎన్డీఏ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. పెట్టుబడుల ద్వారా ప్రజల జీవితాలను మార్చడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాయని వివరించారు. చంద్రబాబు సారధ్యంలో ఏపీనిర్దేశిత అభివృద్ధి గమ్యాన్ని చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రారంభించుకున్న ప్రాజెక్టులన్నీ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపి,స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ సంకల్పాన్ని వంద శాతం నెరవేరుస్తాయని ప్రధాని మోడీ భరోసాఇచ్చారు. దేశంలో అత్యంతఆధునీకంగా ప్రైవేటు రంగ సంస్థ జీఎంఆర్ భాగస్వామ్యంతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత ఆధునీక వసతులతో నిలిచింది. ఇది శరవేగంతో స్వరాంధ్ర విజన్ 2047 సీఎం చంద్రబాబు నేతృత్వంలో సాగుతున్న ప్రగతికి నిదర్శనంగా చెప్పాలి. ఇప్పుడు ఈ విమానాశ్రయం పర్యాటక,పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ప్రగతికి కేంద్రబిందువుగా నిలవనుంది.ఈ విమానాశ్రయానికి ఎవరు పునాది వేసారు.ఎవ్వరు నిర్మాణ కార్యచరణలో పెట్టారనే అంశాన్ని పక్కన పెడితే కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ చూపించి శరవేగంగా విమానాశ్రయ పనులు పూర్తిచేయించింది. ఇందుకు సీఎం చంద్రబాబు మార్గదర్శనంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహననాయుడు కృషి ఉంది.రాష్ట్రమానవ వనరుల శాఖామంత్రి నారాలోకేష్‌దౌత్యం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక, సాంకేతికత, అత్యుత్తమ స్థాయి మౌలిక వసతులతో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని గతవారం ఆరంభంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించి జాతికి అంకితంచేసారు.సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో ఎగిరే చేప ఆకృతిలో విమానాశ్రయాన్ని నిర్మించారు. టెర్మినల్ సీలింగ్ సంప్రదాయ ముగ్గులు, నాదస్వరం థీమ్‌తో రూపొందించారు.జీఎంఆర్ సంస్థ ప్రత్యేక శ్రద్ధతో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు,కళలు ఉట్టిపడేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దింది.స్వాగత ద్వారంవద్ద భారీ ఏటికొప్పాక బొమ్మను పెట్టారు. విమానాశ్రయం లోపల రాష్ట్ర చారిత్రక వైభవం చాటేలా తోలు బొమ్మలాట,బొబ్బిలి వీణ, భౌగోళికవారసత్వం తెలియజెప్పేలా బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.ఉత్తరాంధ్ర వైభవం చాటేలా తప్పెటగుళ్ళ, విజయనగరం రాజవంశీయుల కోట, అరసవల్లి సూర్యనారాయణస్వామి,శ్రీ ముఖలింగం, శ్రీకూర్మం, సింహాచలం, కనక మహాలక్ష్మి దేవస్థానం, థింసా నృత్యంవంటి కళారూపాలను టెర్మినల్ భవనం గోడలపై అలంకరించారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణ వ్యయం రూ.4,750కోట్లు అయి నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విస్తీర్ణంగా చూస్తే 2,203 ఎకరాలు ఉంది. గంటకు 275 కి.మీ. వేగం తో వీచే గాలులను తట్టుకునేలా విమానాశ్రయం నిర్మాణం జరిగింది. ప్రయాణీకులు ఇబ్బంది పడకుండా చెక్‌ఇన్‌కౌంటర్లు 40 ఏర్పాటు చేసారు. ఇమిగ్రేషన్ కేంద్రాలు 10ఏర్పాటు చేసారు.బ్యాగేజ్ బెల్ట్‌లు డొమెస్టిక్ 5, ఇంటర్నేషనల్ 2 సెల్ఫ్ చెక్‌ఇన్‌లు, బ్యాగేజ్ రీక్లెయిమ్ సదుపాయాలు, ప్రయాణికుల సామర్థ్యం తొలి దశలో ఏడాదికి 60 లక్షలు,రెండోదశలో 1.20కోట్లు,మూడో దశలో1.80కోట్లమంది అనేది అంచనాగాఉంది. కమర్షియల్ హబ్, హోటళ్లు,ఎంటర్ టైన్‌మెంట్ జోన్లతో జీఎంఆర్ ఏరో సిటీని అభివృద్ధి చేస్తోంది. ఎయిర్ బస్, బోయింగ్ వంటి భారీ విమానాలు కూడా సులువుగా ల్యాండయ్యేలా 3.8కిలోమీటర్ల పొడవు,45మీటర్ల వెడల్పున రెండు రన్‌వేలు, ఫార్మా,ఆక్వా,సముద్ర సంపద ఎగుమతులతో పారిశ్రామికా వృద్ధికి దోహదపడేలా 5వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 25వేల టన్నుల సరకు రవాణా సామర్థ్యంతో కార్గో టెర్మినల్, లాజిస్టిక్ జోన్. రెండు అంతస్తుల్లో 79వేల చ.మీ విస్తీర్ణంలో ప్రయాణికుల టెర్మినల్ భవనం. కేంద్రీకృత డిజైన్, సులభతరమైన చెక్‌ఇన్,సహజకాంతి, సౌకర్యవంతమైనప్రయాణానికి ప్రపంచ స్థాయి వసతులు, 55 మీటర్ల ఎత్తులో 11 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏటీసీ టవర్. 360 డిగ్రీల్లో ఏరో డ్రమ్ విమాన సమాచార సేవలు,25 ఎకరాల్లో విమానాల నిర్వహణ, మరమ్మతుల ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో). యాప్రాన్లు, విమానాలు కదిగే ప్రదేశాలు, ఎయిర్‌సైడ్,ల్యాండ్ సైడ్ సర్క్యులేషన్, హ్యాంగర్లు, ఇంజిన్ రన్‌అప్ వేలు, నైపుణ్యాభివృద్ధి ప్రోత్సాహానికి, ప్రాంతీయ ఆర్థిక వృద్ధి వేగవంతానికి జీఎంఆర్ ఏవియేషన్ యూనివర్సిటీ, ఏరో సిటీతో సమీకృత పర్యావరణ వ్యవస్థ భోగాపురం లోహవిహంగ స్థలికి ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. ●

ప్రత్యక్షంగా 15 వేల మందికి, ఉత్తరాంధ్ర వ్యాప్తంగా పరోక్షంగా 5.85లక్షల మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. అనుష్యాంగా పర్యాటకులను ఆకర్షించే దిశలో మన్యం వేదిక విప్లవ పంథాలో స్వాతంత్ర్య సమరం చేసిన యోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఇక్కడభారీ ఎత్తులో ఆకర్షణీయం కానున్నది. ఎగిరే పక్షి ఆకారంలో సముద్రం, పచ్చని కొండల మధ్య నిర్మించిన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును కాపాడిన వ్యక్తి మోడీ అని అన్నారు. ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయన్నారు. రూ.2,784 కోట్లతో 8ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేరేడి బ్యారేజ్ కలను నిజం చేస్తామని, ఈ నెల 14న గోదావరి జలాలను ఉత్తరాంధ్రలోని అనకాపల్లికి తీసుకొస్తామని, గోదావరి, వంశధార అనుసంధాన బాధ్యత తమదేనని స్పష్టం చేశారు.పీఎం మోడీ రాజధాని అమరావతికి నిధులు ఇచ్చిఅండగా నిలబడ్డారన్నారు.2028నాటికి అమరావతి మొదటి దశ పనులన్నీ పూర్తిచేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు భోగాపురంవిమానాశ్రయం రేపటి ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తిగానే నిలుస్తోంది. రాష్ట్రంలో అన్నిప్రాంతాలను సమాంతరంతీర్చిదిద్దాలనే స్వప్నం నిజం కానున్నదనే ఆశలు చిగిరిస్తున్నాయి.త్వరలోఅమరావతిలో 47అంతస్తులట్విన్‌టవర్స్ నిర్మాణానికి ఆమోదంలభించింది.ట్విన్ టవర్స్‌లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది.రాజధానికి కీలకమైనస్పీడ్ యార్సిస్ రోడ్డునిర్మాణం పూర్తయింది.ఈదారి ఇప్పుడు రాజధానిలోకి సునాయాసప్రయాణానికి అనువుకానున్నది. రాష్ట్రంప్రగతి పథం వైపు దృఢసంకల్పంతో ముందుకు వెళ్తుంది.

---

# బండ్లు.. ఓడలు!

బీహార్

**ఎ.వి.వి ప్రసాద్**

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయంటారు. రాజకీయాలలో అది మరింత సహజం. అందుకు బీహార్‌లోని బాంకీపూర్ నియోజకవర్గమే తాజా ఉదాహరణ. దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ సెగ్మెంట్ బిజెపికి కంచుకోట. ప్రస్తుతం ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడుగా ఉన్న నితీన్ నబీన్ ఇదే నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు మార్లు గెలుపొందుతూ వచ్చారు. తొమ్మిది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దాదాపు 50వేల మెజారిటీతోఘవిజయం సాధించారు. తర్వాత ఆయన జాతీయ రాజకీయాల్లోకి అధిరోహించడం, రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఆ స్థానానికి ఉపఎన్నిక అవసరమైంది. యధా ప్రకారం ఈ ఎన్నికలో కూడా విజయం తనకే అనుకొంది బిజెపి. అయితే ఈసారి పరిస్థితి తారుమారయింది. అక్కడి నుంచి అనూహ్యంగా జన్ సురాజ్ పార్టీ అధినేత అయిన ప్రశాంత్ కిశోర్ (పికె )19 వేలు పైగా మెజారిటీతో విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దృష్టిలో ఉంచుకుని చూస్తే అయన గెలుస్తారని ఎవరూ చెప్పలేరు. వివిధ వర్గాల్లో నితిన్‌కు గల పట్టు సామాన్యమేమీ కాదు. ఆయన నియోజకవర్గంలో గెలవడం చాలా కష్టమని పికెకు కూడా తెలుసు. అయినా ఓ రాయి వేసి చూద్దామని అక్కడి నుంచే పోటీ చేశారు. స్థానబలం అధికంగా ఉన్న బిజెపి అలవోకగా విజయాన్ని వరించగలదనే అంతా అనుకున్నారు. పికె జన్ సురాజ్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చింది 3 శాతం ఓట్లు మాత్రమే. అంత తక్కువ ఓట్లున్న పార్టీకి గెలుపు అనేది సాధారణంగా కలే అవుతుంది. కానీ పికె ఉప ఎన్నికల్లో సంచలన విజయం సాధించి కొత్త రికార్డు సృష్టించారు. బిజెపి,జన్ సురాజ్ రెండు పార్టీల్లోను ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. కేవలం తొమ్మిది నెలల్లోనే. ఇది బిజెపికి పరాజయమా?జన్ సురాజ్ విజయమా? అని ప్రశ్నిస్తే సమాధానం ఒక్కటే అయినా, విశ్లేషణలు భిన్నంగా ఉంటాయి. పికె కు రాజకీయ వ్యూహ కర్తగా ఇప్పటికే చాలా పేరుంది.డిజిటల్ మీడియా ఆయుధంతో ఆయన తన చిత్ర విచిత్రమైన రాజకీయ వ్యూహాలను నేతలకు అందిస్తూంటారు. బిజెపి, జెడియు, కాంగ్రెస్, ఆప్, టిఎంసి, డిఎంకె, వైఎస్సార్సీ వంటి పలు ప్రధాన పార్టీలు ఆయన ఖాతాదారులే. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడుతన వ్యూహరచనతో పాప్యులర్ అయిన పికె తర్వాత నితీశ్ కుమార్ బీహార్ సీఎంగా విజయాలు సాధించడానికి, తమిళనాట డిఎంకె అధికారంలోకి రావడానికి చాలా కృషి చేశారు. చివరికి రాజకీయ మేధావిగా భావించే మమతా బెనర్జీ కూడా పికె వ్యూహాలనే పలుమార్లు అనుసరించారు. వ్యూహకర్తగా విజయాలనే గాక అనేక వైఫల్యాలు కూడా ఆయన చవిచూశారు. 2017 ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం, 2022 గోవా ఎన్నికల్లో టిఎంసి కోసం అనుసరించిన వ్యూహాలు బెడిసికొట్టడంతో ఆయన పాపులారిటీకూడా కొంత క్షీణించింది. సరిగ్గా అప్పుడే ఆయన తన వ్యూహాలను సొంత పార్టీ ఏర్పాటు దిశగా మరల్చారు. 2024లో గాంధీ జయంతి రోజున జన్ సురాజ్ పార్టీ ప్రారంభించడానికి రెండేళ్ల ముందే 'జన్ సురాజ్ అభియాన్ అనే రాజకీయ ఉద్యమాన్ని ఆరంభించారు. చాలా పకడ్బందీ వ్యూహంతో పార్టీని నిర్మించినా తొలుత ఆశాభంగమే ఎదురైంది. 2022 లో ఉద్యమంగా మొదలై, 24లో పార్టీగా మారి, 25లో తొలి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని 26లో బాంకిపూర్‌లో తొలి విజయం సాధించేదాకా అనేక ఎత్తుపల్లాలు ఎదురైనా, ఇప్పుడు ప్రధాన రహదారిపైకి వచ్చారు. అయితే ఈ పరిణామంలో ఆయన ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగార్థులు, రైతులు, మహిళలు, వలస కార్మికుల ఓట్లు ఆకర్షించడం పైనే దృష్టి పెట్టి సాగినట్లు కనిపిస్తుంది. ఢిల్లీ, మరికొన్ని ప్రాంతాల్లో సాగుతున్న విద్యార్థుల ఆందోళనలు ఉప ఎన్నికల సమయానికి ఆయనకు బాగా కలిసి వచ్చాయనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలు తోడవకపోతే ఆయన అదనంగా చాలా ప్రయత్నించవలసి వచ్చేది. ఆ ఓట్లే ఆయనకు సంచలన విజయాన్ని అందించాయి. 2025లో ఇదే బాంకిపూర్‌లో బిజెపికి 63శాతంఓట్లురాగా, జన్ సురాజ్‌కు 5శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అటువంటి బిజెపి కంచుకోటనే ఎంచుకొని ఈసారి ఎనిమిది రెట్లు ఎక్కువగా ఓట్లు సాధించారంటే అది విద్యార్థులు, యువకుల మద్దతు వల్లనే. జన్ సురాజ్‌కు ఓట్ల శాతం ఈ నియోజకవర్గంలో 5 నుంచి 49 శాతానికి పెరిగింది. 'అనేక ఎన్నికల్లో పలువురు ప్రముఖ నేతలను గెలిపించాను. ఇప్పుడు నేనే మీ ఓట్లకోసం వచ్చాను' అంటూ ఆయన చేసిన ఎన్నికల ప్రచారం కూడా ఎక్కువ ప్రభావం చూపిందనిపిస్తుంది. ఈ వ్యక్తిగత గుర్తింపు బిజెపి సంస్థాగత బలాన్ని చాలా వరకు ఎదుర్కొంది. గతంలో కీలక పాత్ర వహించిన లాలూ ఆర్జేడీ పరిస్థితి చాలా క్షీణించడం కూడా పికెకు కలిసివచ్చింది. ఈ ఒక్క ఎన్నికలో సాధించిన విజయం వల్ల జన్ సురాజ్‌కు అధికారం దక్కక పోవచ్చు కానీ అధికార పార్టీ పునాదులు కదల్చడానికి ఎంతో కొంత ఉపకరించింది. భవిష్యత్తులో బిజెపి, ఆర్జేడీ, కాంగ్రెస్‌లను పక్కకు జరపాలంటే పికె తన వ్యూహాలకు మళ్లీ పదును పెట్టవలసి ఉంటుంది. బిజెపి, ఆర్జేడీకి రాష్ట్రంలో చాలా స్ట్రాంగ్ ఓటు బ్యాంకు ఉంది. దానిని తన గుప్పెట్లోకి తెచ్చుకోవాలంటే పికె మారిన పరిస్థితులకు తగినట్లుగా కొత్త వ్యూహరచన చేయవలసి ఉంటుంది. బీహార్ యువత పక్క రాష్ట్రాలకు వలస పోకుండా వారికి స్వరాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలు చూపాలని ఇతర పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు అందుకు ఆయన చేయగల కృషి ఏమిటో ప్రజలకు చెప్పవలసి ఉంది. ఏది ఏమైనా రాజకీయ నాయకునిగా మారిన పికె తన భవిష్యత్తుకు ఎటువంటి వ్యూహాలను రూపొందించుకొంటారో చూడాలి. ●



ప్రశాంత్ కిశోర్

---

# సౌదీకి మిలీషియా ముప్పు

సౌదీ అరేబియా

**గన్ని మోహన్**

సౌదీ అరేబియాపై రెండు వైపుల నుంచి మూకుమ్మడి దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో సౌదీరాజు ప్రభుత్వానికి స్వీయరక్షణ అనివార్యమైంది. అందుకోసమే పాక్, టర్కీలతో కలిసి సంయుక్త భద్రత రక్షణ ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే అమెరికా ఇరాన్‌పై జరుపుతున్న దాడుల కారణంగా సౌదీలోఉన్న అమెరికా స్థావరాలపై దాడులు పేరిట ఇరాన్ చేస్తున్న దాడులు సౌదీకి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సంయుక్త ఒప్పందం జరిగినప్పటికీ ఇరాన్ నుంచి సౌదీ రక్షించుకోలేదని, అమెరికా స్థావరాలకు అవకాశం లేకుండా ఉన్నపుడే సౌదీకి భద్రత ఏర్పడుతుందని ఇరాన్ చేస్తున్న హెచ్చరికలను పరిగణనలోనికి తీసుకునే సౌదీ అరేబియా రాజు ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో ఐరన్ డోమ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకునే ప్రతిపాదనలకు ఓకే చెప్పింది. అయినా కూడా అమెరికా ఇరాన్‌పై ముప్పేట దాడిచేసినప్పుడల్లా అమెరికా స్థావరాలున్న గల్ఫ్‌దేశాలపై ఇరాన్ ఐఆర్జీసీ దాడులు చేసి కలవరం సృష్టిస్తోంది. దాడుల్లో భాగంగా ఆదేశాల చమురు సంస్థలపైనా దాడులు చేయడంతో సౌదీ ఒకానొక సమయంలో అమెరికాపై ఒత్తిడి కూడా తెచ్చింది. సౌదీ ఇతర గల్ఫ్‌దేశాల ఒత్తిడికి అమెరికా మెత్తబడినా మళ్లీ దాడులు అంటూ ట్రంప్ రోజుకొక ప్రకటనగా చేస్తున్న తన సొంత సోషల్‌మీడియా ట్రూత్‌పోస్టులు గల్ఫ్‌దేశాల్లో సందేహాలను కూడా పెంచుతున్నాయి. మరోపక్క పాక్‌తో దోస్తీకంటే కేవలం వాణిజ్య, భద్రతపరంగానే సౌదీ ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు చేయనున్న తాజా దాడులు కనుక జరిగితే సౌదీకి ఆర్థిక, వాణిజ్య పరంగా భారీనష్టం కూడా కలుగుతుందని నిస్సందేహంగా చెప్పగలం. అసలు ఈ దాడుల పూర్వాపరాలను పరిశీలిస్తే కేవలం ఆమెరికా, ఇజ్రాయెల్‌లతో ఉన్న దోస్తీకారణంగానే ఇరాన్ ఈదాడులు చేస్తోందని సౌదీ గుర్తించింది. ఇరాన్ చెపుతున్న కారణాలు కూడా అమెరికా స్థావరాలున్న గల్ఫ్‌దేశాల లక్ష్యాలను ఛేదిస్తామని ఇరాన్ ఐఆర్జీసీ చెపుతూ వస్తోంది.ఈ క్రమంలో ఇప్పుడు మిలీషియా దాడులపై సౌదీ ముందస్తు వ్యూహాలను పెంచుకోవాల్సిన అవసరంవచ్చింది. ఇరాన్ మద్దతుఉన్న ఇరాక్ మిలీషియాగ్రూపులు, యెమెన్‌కు చెందిన హౌతీలుకలిసి సౌదీపై దాడులకు సిద్ధమవుతున్నట్లు నిఘాసంస్థలు ఇప్పటికే సౌదీకి పంపించాయి. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పర్యవేక్షణలో ఈ సమన్వయం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇరాక్‌లోని మిలీషియా గ్రూపులు,హౌతీలుఅత్యంత సమీప భవిష్యత్తులో సమన్వయ దాడులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ నివేదికలు సూచిస్తున్నాయి. ఉత్తరం, దక్షిణం వైపు నుంచే ఈ దాడులు జరుగుతాయని కూడా దిక్కులనుసైతం నిఘా ఏజెన్సీలు వెల్లడించాయి. నిఘావర్గాల అంచనాల ప్రకారం ఇరాక్ మిలీషియా గ్రూపులుసౌదీ అరేబియా పై ఉత్తరదిశ నుంచి, యెమెన్‌లోని హౌతీ బలగాలు దక్షిణ దిశనుంచి దాడులుచేసే అవకాశం ఉంది. రెండు వైపుల నుంచి ఏకకాలంలో దాడులు జరిపే ఈ వ్యూహాన్ని భద్రతా నిపుణులు పిన్సర్ అటాక్‌గా అభివర్ణిస్తున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు సౌదీ అరేబియా కట్టుబడి ఉందని కానీ తమపై ఎలాంటి దాడి జరిగినా తగినరీతిలో స్పందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెపుతున్న సౌదీ అందుకోసమే ఈ ఉమ్మడి రక్షణ ఒప్పందంపై సంతకంచేసిందనిచెప్పాలి. మిలీషియాదాడులు చమురు సంస్థలు, విమానాశ్రయాలే లక్ష్యాలు. చమురు,ఇంధన ఉత్పత్తి కేంద్రాలు,వాణిజ్య నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు,దేశ ఆర్థికవ్యవస్థకు కీలకమైన ఇతర వ్యూహాత్మక ప్రాంతాలు దాడుల లక్ష్యాలుగా ఉండొచ్చని తెలుస్తోంది. ఈ దాడులకు ఉపయోగించనున్న డ్రోన్లు, క్షిపణులను ఇప్పటికే ప్రయోగ ప్రాంతాలకు తరలించినట్లు కూడా సమాచారం అందిందని అధికారులు పేర్కొన్నారు. ఇరాక్‌కు చెందిన కతాయిబ్ హెజ్బొల్లా,హారకత్ హెజ్బొల్లా అల్‌నుజబా, కతాయిబ్ సయ్యద్ అల్‌షుహదా వంటి షియా మిలీషియా గ్రూపులు సౌదీ ఉత్తర సరిహద్దు సమీపంలో హౌతీల కార్యకలాపాలకు లాజిస్టికల్, సాంకేతిక, కార్యాచరణ సహకారం అందిస్తున్నట్లు అంచనాలున్నాయి. అదే సమయంలో హౌతీలకు చెందిన నిపుణులు ఇరాక్ మిలీషియాలకు డ్రోన్ కార్యకలాపాలు, సాంకేతిక పరిజ్ఞానంలో సహాయం చేస్తున్నట్లు సమాచారం. సౌదీ అరేబియాపై దాడుల ముప్పుపైహెచ్చరికల నేపథ్యంలో ఇటీవల పలు ఘటనలు చోటుచేసుకున్నాయి.యెమెన్ నుంచి సౌదీపై దాడులు జరగడంతోపాటు ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలీషియాల నుంచి డ్రోన్ దాడులు కూడా ఇటీవలి వారాల్లో చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు ప్రారంభంలో సౌదీలోని నజ్రాన్‌ప్రాంతం సమీపంలో దాడులుచేసినట్లు హౌతీలు ప్రకటించగా, ఇరాన్ మద్దతుఉన్న గ్రూపులు తమపైదాడులను విస్తరిస్తున్నాయని సౌదీ ఆరోపించింది. ఇప్పటి వరకు విడివిడిగా జరుగుతున్న ప్రాక్సీదాడులు ఇరాన్ అనుకూలంగా ఉన్న పలుసాయుధగ్రూపుల సమన్వయంతో ప్రాంతీయస్థాయి సైనిక చర్యగా మారేఅవకాశం ఉందని సౌదీకిప్రమాద సంకేతాలు ఇచ్చాయి.నివేదికల్లో పేర్కొన్న ప్రణాళికలు నిజంగా అమలైతే సౌదీ అరేబియా ఉత్తర,దక్షిణ సరిహద్దు నుంచి ఏకకాలంలో దాడులనుఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది దేశవైమానిక రక్షణ వ్యవస్థతోపాటు కీలక మౌలిక సదుపాయాలపై తీవ్రఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. ఈ ఆరోపణలపై ఇరాన్, ఇరాక్ మిలీషియా గ్రూపులుఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న ప్రాంతీయ సాయుధ గ్రూపుల మధ్య పరస్పర సమన్వయం పెరుగుతోందన్న ఆందోళనలకు తాజా పరిణామాలు ఊతం ఇస్తున్నాయి. సౌదీఅమెరికా, ఇజ్రాయెల్ సాయంతోనే ముందుకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చిపడ్డాయి. సౌదీ ఎలా ముందుకు వెళుతుందన్నది దాడుల తీవ్రతపైనే ఆధారపడి ఉంది. ●



మహ్మద్ బిన్ సల్మాన్

---

# ఆదివాసీల రాజ్యాంగ హక్కులను గౌరవించాలి

**కుంజా శ్రీను**

ఈ విశ్వంలో ప్రకృతితో మమేకమై, అడవినే అమ్మగా, కొండనే దేవుళ్లుగా భావిస్తూ తరతరాలుగా జీవిస్తున్న మూలవాసులు ఆదివాసీలు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐదు వందల మిలియన్లకు పైగా ఉన్న ఆదివాసీల విశిష్ట సంస్కృతి, జీవన విధానం, సాంప్రదాయ భూహక్కులను గుర్తించి రక్షించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి 1994 డిసెంబర్ 23న ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీని 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'గా ప్రకటించింది. ఆదివాసీల స్వచ్ఛ స్వయంపాలన, జల్‌జంగల్‌జమీన్ హక్కులే ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న కలుగునేది ఈదినోత్సవ పరమార్థం. అయితే, స్వతంత్ర భారతదేశంలో దశాబ్దాలు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ ప్రాంతంలో నేటికీ ఆదివాసీ గూడేలు ఆకలి కేకలు, పౌష్టికాహార లోపం, డోలీ మోతలు, రాజ్యాంగ చట్టాల ఉల్లంఘనలు,మాతృభాషల వినాశనంతో తీవ్రమైన జీవన్మరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. సాంస్కృతికంగా ఎంతో ఆధ్యాత్మికత, సామాజిక సమన్వయం కలిగిన ఆదివాసీల సమాజం నేడు బాహ్య ప్రపంచపు వ్యాపారీకరణ, ఆధునీకరణ పేరిట జరుగుతున్న ఆక్రమణల వల్ల తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. ఆదివాసీ జీవన విధానం కేవలం జీవనోపాధికి సంబంధించినది మాత్రమే కాదు, అది అడవి, పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉన్న సహజసిద్ధమైన సాంస్కృతిక వారసత్వం. ఒక జాతి సంస్కృతికి, మూలాలకు నిదర్శనం వారి మాతృభాష. లిపి లేకపోవడం, పరాయి భాషల ఆధిపత్యం, పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల నేడు ప్రాచీన ఆదివాసీ మాతృభాషలు అంతరించిపోయే ప్రమాదంలోపడ్డాయి. ముఖ్యంగా ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న గోండి (కోయ)తోపాటు కొండదొర, కువి, సవర, గదబ, చెంచు, కొలం, జాతాపు, నాయక్ పోడ్ వంటి ప్రాచీన ఆదివాసీ భాషలు నేడు మనుగడ కోసం పోరాడుతున్నాయి. భాష నశిస్తే ఆ జాతి సంస్కృతి, వారి పవిత్ర ఆచారాలు, దేవతల కొండలు, సాంప్రదాయ వైద్యం, ఆచార వ్యవహారాలు శాశ్వతంగా కనుమరుగవుతాయి. అందుకే ప్రతీ ఏటా జులై 21న 'ప్రపంచ గోండి (కోయ) భాషా దినోత్సవం' నిర్వహిస్తూ మాతృభాషల పరిరక్షణకు పోరాడుతున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఆదివాసీ మాతృభాషల్లోనే బోధన అందించాలని, ఆర్టికల్ 350ఎని కఠినంగా అమలు చేయాలని, గిరిజన భాషలను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాల నుండి ఆశించిన స్పందన కరువైంది. విద్యా వ్యవస్థలో ఆదివాసీ సాంస్కృతిక, భాషా గుర్తింపును విస్మరించడం వల్ల భవిష్యత్ తరాలు తమ మూలాలను మరచిపోయే ప్రమాదం ఏర్పడింది. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్‌బి.ఆర్. అంబేడ్కర్, 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు ప్రత్యేక రాజ్యాంగ రక్షణలు కల్పించారు. '1874 షెడ్యూల్డ్ డిస్ట్రిక్ట్స్ యాక్ట్', '1917 ఏజెన్సీ ట్రాక్ట్స్ యాక్ట్'ల నుంచి నేటి 1/70 చట్టం వరకు ఆదివాసీ భూమి నాన్‌ట్రైబల్స్ చేతుల్లోకి పోకుండా స్పష్టమైన రక్షణ అంక్షలు ఉన్నాయి. అంతేకుండా, 1997 సుప్రీంకోర్టు చారిత్రాత్మక 'సమత తీర్పు' ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాలోని భూములను నాన్‌ట్రైబల్స్‌కు లేదా ప్రైవేట్ కార్పొరేషన్లకు మైనింగ్ లీజులకు ఇవ్వడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేయబడింది. కానీ క్షేత్రస్థాయిలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో నాన్ ట్రైబల్ టూరిజం, మైనింగ్ మాఫియా పంజా విసురుతోంది. మారేడుమిల్లి, రంపచోడవరం, పాడేరు, అరకు, లంబసింగి, మోతుగూడెం వంటి పర్యాటక కేంద్రాల్లో బినామీ ఒప్పందాలు, పవర్ ఆఫ్ అటార్నీల ద్వారా ఆదివాసీ భూములను నాన్ ట్రైబల్స్ ఆక్రమించి విలాసవంతమైన రిసార్టులు కడుతున్నారు. ఇక పేసా గ్రామసభ తీర్మానాల్ని రోడ్డుపై పడేసి క్వారీలు, గ్రానైట్ మైనింగ్ నడుపుతుంటే ఆదివాసీ రోడ్లు, పరిసర వాతావరణం, పవిత్ర కొండలు ధ్వంసమైపోతున్నాయి. ఆదివాసీల ఆత్మగౌరవానికి, భూహక్కులకు గుండెకాయ లాంటి 1/70 చట్టాన్ని



రద్దు చేయాలంటూ నాన్‌ట్రైబల్స్ దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దావాలో రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ రాజ్యాంగ న్యాయవాదులను నియమించి చట్టాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో, ఏజెన్సీ భూములను ఆక్రమించిన నాన్ ట్రైబల్స్‌పై ఎల్‌టిఆర్ యాక్ట్ 3(5), సెక్షన్ 6ఎ ప్రకారం తక్షణమే అధికారులు నేరుగా కేసులు నమోదు చేయాలి. ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, అక్రమంగా నిర్మించిన రిసార్టులు, వ్యాపార సంస్థలకు విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లు రద్దు చేయడమే కాకుండా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వ యంత్రాంగం చూపుతున్న ఉదాసీనత వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో సామాజిక అసంతృప్తి, రాజకీయ అశాంతి పెరుగుతున్నాయి. అదేవిధంగా ఏజెన్సీప్రాంతాల్లోనిపాఠశాలల్లో 100 ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఆదివాసీలకే కేటాయించే జీవో నంబర్ 3ని సుప్రీంకోర్టు కొట్టివేసిన తర్వాత, ఏజెన్సీ విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 5వ షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతం కేవలం 4.6 (7,445 చదరపు కిలోమీటర్లు) మాత్రమే ఉంది. సాధారణ 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ పరిమితి సూత్రాన్ని ఈ చిన్న వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతానికి వర్తింపజేయడం సమంజసం కాదు. తమిళనాడు ప్రభుత్వం 69 శాతం రిజర్వేషన్ చట్టాన్ని చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చిన నమూనానుకానీ, మేఘాలయ (85 శాతం), నాగాలాండ్ (80శాతం), మిజోరం (95శాతం) అనుసరిస్తున్న విధానాలను కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదు? రాజ్యాంగంలోని ఆర్టికల్ 254(2) ప్రకారం రాష్ట్ర శాసన సభలో ప్రత్యేకంగా ద షెడ్యూల్డ్ ఎరియాస్ ట్రైబల్ ఎంప్లాయిమెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం పొంది 9వ షెడ్యూల్‌లో చేర్చడంద్వారా 100శాతం స్థానిక గిరిజన ఉపాధ్యాయ నియామకాలకు చట్ట బద్ధత కల్పించవచ్చు.జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక చట్టం తీసుకురావడానికి రాజ్యాంగపరంగా, చట్ట పరంగా స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 350ఎ (మాతృభాషలోనే ప్రాథమిక విద్య),1952 నేషనల్ ఫారెస్ట్ పాలసీ, యు.ఎన్. ధేబర్ కమిటీ సిఫార్సులు, పేసా చట్టంలోని సెక్షన్ 4 నిబంధనలు, ఉచిత నిర్బంధ విద్యహక్కు చట్టం, జాతీయ విద్యావిధానం 2020వంటివన్నీ కూడా ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక చట్టం తెచ్చి 100 శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే కేటా యించడానికి బలమైన రాజ్యాంగ, విధానపరమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి. ఈ అంశాన్ని ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసినప్పటికీ, హామీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ప్రభుత్వానికి నిజంగా ఆదివాసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ప్రత్యామ్నాయంగా 'ప్రత్యేక ఉద్యోగ రక్షణ చట్టాన్ని' తక్షణమే శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాలి. మరొక వైపు రాష్ట్రవ్యాప్తంగా మూలవాసుల ప్రాథమిక హక్కులు పూర్తిగా పడకేసాయి. తరతరాలుగా పోడువ్యవసాయం చేసుకుంటున్న వేలాది మంది ఆదివాసీ దరఖాస్తులు పెం డింగ్‌లోనే ఉండిపోయాయి. ఉమ్మడి జిల్లాలవారీగా పెండింగ్‌లో ఉన్న పోడుభూములన్నింటికీ ప్రాధాన్యతా క్రమంలో పట్టాలు వెంటనే పంపిణీ చేయాలి.అనేక గూడేలకు నేటికీ రహదారి సౌకర్యం లేదు, రోడ్డువేద్దామంటే అటవీ శాఖ అభ్యంతరాలు చెబుతోంది. అటవీ హక్కుల చట్టం 2006 (ఎఫ్ఆర్ఎసెక్షన్ 3(2))ప్రకారం ప్రజోపయోగ పనులకు స్పష్టమైన వెసులుబాటుఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.అత్యవసర వైద్యంఅందక, రోడ్డు లేక గర్భిణులు, రోగులను మైళ్ల కొద్దీ డోలీల్లో మోసుకెళ్లే దృశ్యాలు నేటికీ నిత్యకృత్యమవుతూ అడవిపిల్లల ప్రాణాలుగాల్లో కలసిపోతున్నాయి. అంతేకాకుండా ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1,400కు పైగా క్లాస్.4జు పోస్టులను భర్తీ చేయకపోవడం, ప్రతి పాఠశాలకు ఒక ఎఎన్ ఎమ్ఇ నియమించకపోవడం, మెస్ వంటలకు గ్యాస్ సౌకర్యం లేకపోవడం గిరిజన విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.ఆదివాసీ రిజర్వేషన్ల దయతో గెలిచి చట్ట సభలకు వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఆదివాసీల సమస్యలపై నోరు విప్పకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించి ఆదివాసీల మనుగడకు అండగా నిలవాలి. ●

# ప్రపంచం ఫాస్ట్‌గా మారుతోంది..

## యువత ఆవిష్కరణలతో స్టార్టప్ వ్యవస్థ బలోపేతం

## ఐఐటి విద్యతోనే మెరుగైన సామర్థ్యం : ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఐఐటీలో చదువుకోవడం వల్ల సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యం విద్యార్థులకు వచ్చినట్లు ప్రధాని మోడీ చెప్పారు. దేశానికి సేవ చేయాల్సిన బాధ్యత కూడా ఆ విద్యార్థులపై ఉందని ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్19 మహమ్మారి వేళ జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్నానని, ఇప్పుడు భౌతికంగా ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక రంగంలో చాలా విప్లవాత్మక రీతిలో మార్పులు జరుగుతున్నాయని, రాబోయే 20 నుంచి 30 యేండ్లలో ప్రపంచం మరోలా కనిపిస్తుందన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, ప్రొఫెషన్స్ ఎప్పుడూ మారుతుంటాయని, కానీ ఎప్పుడూ నేర్చుకోవడమే కీలకమైన అంశంగా మిగులుతుందన్నారు. ఎవరైతే కొత్త విషయాలను నేర్చుకుంటారో, వారే విజేతలుగా నిలుస్తారని ప్రధాని అన్నారు. కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించే ధైర్యాన్ని విద్యార్థులు ప్రదర్శించాలన్నారు. అవరోధాలను అవకాశాలుగా మార్చుకోవాలన్నారు. అకాడమిక్ జీవితంతో పాటు క్యాంపస్ బయటి ప్రపంచం గురించి వివరిస్తూ. ఐఐటీ పరీక్షల్లో కచ్చితమైన సిలబస్ ఉంటుందని, కానీ జీవితమనే పరీక్షలో మాత్రం, అన్నీ సిలబస్‌లో లేని అంశాలే ఉంటాయన్నారు. కానీ ఉత్సుకతతో ఉండాలని ఆయన విద్యార్థులను ఎంకరేజ్ చేశారు. వ్యవస్థీకృత సిద్ధాంతాలను ప్రశ్నిస్తూనే వాటికి తగిన పరిష్కారాన్ని కనుగొనే ధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, సెమీకండక్టర్స్, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్రిటికల్ మినరల్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ లాంటి రంగాలు విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని యువత ఆవిష్కరణల వల్ల స్టార్టప్ వ్యవస్థ, డిజిటల్ ఎకానమీ బలోపేతం అయ్యిందన్నారు. పరిశోధనా రంగం మరో కీలకమైన అంశమన్నారు. ప్రైమ్‌మినిస్టర్స్ రీసర్చ్ ఫెల్లోషిప్, ద రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్, అనుసంధాన్ నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ వ్యవస్థలను వాడుకోవాలన్నారు. పరిశోధనా, అధ్యయన వ్యవస్థలను బలోపేతం చేసేందుకు యువ పరిశోధకులు మరింత పట్టుదలతో ఉండాలన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, విద్యార్థుల కెరీర్ దానిలో భాగస్వామ్యం కావాలన్నారు. కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సమయంలో జాతీయ ప్రయోజనాల గురించి ఆలోచించాలన్నారు. జీతాలు, ఉద్యోగాలు, కంపెనీలు, ఘనతల గురించి విద్యార్థులు మిగితా వారితో పోల్చుకోవద్దు అని, ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇలాంటివి చేయకూడదని ప్రధాని మోడీ విద్యార్థులను హెచ్చరించారు. జీవితం అంటే లీడర్‌బోర్డు కాదు అని, మీ పోటీ ఇతర వ్యక్తులతో కాదు అని, మీతో మీరే పోటీపడాలని అన్నారు. స్వంత ప్రగతిపై ఫోకస్ పెట్టాలని, నిరంతరం నేర్చుకోవాలని, జీవితంలో కొత్తది నేర్చుకునేందుకు ఎప్పుడూ ఉత్సుకతతో ఉండాలన్నారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ పరం ప్రాగ్యా హై పర్ఫార్మెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సూపర్‌కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐఐటీ ఢిల్లీ సోనిపేట్ క్యాంప్‌లో ఈ సెంటర్‌ను ఆవిష్కరించారు.

## నేనేమీ బాబా యోగేశ్వర్‌ను కాను

### విద్యార్థులతో ప్రధాని మోడీ ఛలోక్తులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఢిల్లీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో పాల్గొన్న మోడీ తనదైన శైలిలో మాట్లాడి ఛలోక్తులు విసిరారు. ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు. మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్ల గురించి ఆలోచిస్తుండవచ్చని మోడీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు.



## భారత్‌పై 100% టారిఫ్‌ల భారం

### బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం

**వాషింగ్టన్, ఆగస్టు 8:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మళ్లీ టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు ముందడుగు పడింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా సెనెట్ తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఇటీవల మృతి చెందిన సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా, ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ 86-11తో ఆమోదించింది. ఆగస్టు 31న ఈబిల్లు ప్రతినిధుల సభముందుకు రానుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అమెరికా అధ్యక్షుడి సంతకంతో ఇది చట్ట రూపం దాల్చనుంది. ఈ బిల్లు అమలులోకి వస్తే భారత్‌పై 100 శాతం సుంకాల మోత మోగనుంది. ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థికసంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకొనే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది. ఇది అమలులోకి వస్తే భారత్, చైనా, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ వంటి దేశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ టారిఫ్‌లు 500 శాతం వరకు ఉండాలని ట్రంప్ సర్కార్ ప్రతిపాదించింది. ఆ తర్వాత పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి అంతర్జాతీయ పరిణామాలతో సుంకాల పరిమితిని సవరించి 100 శాతానికి తగ్గించారు.

## అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు కొత్తపేర్లు

### చైనాకు భారత్ గట్టికౌంటర్




**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. ఆ రాష్ట్రానికి చెందిన కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో దానికి కౌంటర్‌గా భారత్ కూడా కొత్త పేర్లను ఫిక్స్ చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రీత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చురీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.

## పెరుగుతున్న వృద్ధుల జనాభా

### 2050 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరికి 60 దాటిన వయసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** భారత దేశం వృద్ధాప్యం దిశగా అడుగులు వేస్తున్నది. 2050 నాటికి దేశంలోని ప్రతిఐదుగురిలో ఒకరు 60 యేండ్లు, అంతకు పైబడిన వయసు వారు ఉంటారని ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా వెల్లడించింది. అందులో 70శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారని తెలిపింది. గ్రామీణ భారత దేశంలో జనాభా పరిణామాలు, మారుతున్న కుటుంబ వ్యవస్థ, సంరక్షణ వ్యవస్థ భవిష్యత్ పేరిట ఈ సంస్థ నివేదిక విడుదల చేసింది. జనాభా వృద్ధులుగా మారకముందే సంపన్న దేశాలుగా మారిన అనేక అభివృద్ధి చెందిన దేశాలకు భిన్నంగా భారత్ సంపద దేశంగా మారక ముందే వృద్ధాప్య దశలోకి అడుగు పెడుతున్నదని ఈ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశ జనాభాలో 34.7 కోట్ల మంది 60 యేండ్ల పైబడిన వారు ఉంటారని, ప్రతి పదిమందిలో ఏడుగురు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారని తెలిపింది.

## రాహుల్ వైఖరిలో మార్పు కనిపిస్తోంది

### మహిళా బిల్లుపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** మహిళల స్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన ఆస్క్ మీ ఎనీథింగ్ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలని వ్యాఖ్యలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళల్లో ఉన్న శక్తి పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదని రాహుల్ అన్నారు. మహిళలు తమకు నచ్చిన విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాలని చెప్పారు. ఇళ్లలో, కుటుంబాల్లో, సమాజంలో తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యులు అంగీకరించని విషయాలపై కూడా మహిళలు తమ అభిప్రాయం చెప్పగలగాలని అన్నారు. పురుషుల ఆధిపత్యం నుంచి మహిళలకు కొంత స్వేచ్ఛ అవసరమని చెప్పారు.
అప్పుడే దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని రిజిజు అన్నారు. మహిళల విషయంలో రాహుల్‌గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నా అని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా ఈ చట్టం ఉంది. అయితే దీని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరం. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లును తిరిగి తీసుకొచ్చేందుకు విపక్షాల మద్దతును ప్రభుత్వం కోరుతోంది. రాహుల్‌గాంధీతో రిజిజు ఫోన్‌లో మాట్లాడారు. బిల్లును త్వరగా తీసుకొస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగంగా జరిగే అవకాశం ఉందని అన్నారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు కాకపోతే వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని చెప్పినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## భారత్‌లోనే రాఫెల్ యుద్ధవిమానాల తయారీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** భారత వాయుసేన సామర్థ్యాన్ని మరింత ఇనుమడింపజేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో భాగంగా, 94 విమానాలను భారత్‌లోనే తయారు చేసేందుకు ఫ్రాన్స్ సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫ్రాన్స్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనను సమర్పించింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే, ఫ్రాన్స్ వెలుపల రఫేల్ యుద్ధ విమానాల ఉత్పత్తి జరగడం ఇదే తొలిసారి కానుంది. ఈ యేడాది మే నెలలో 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు సంబంధించి భారత వాయుసేన ఫ్రాన్స్‌కు అభ్యర్థన లేఖ పంపింది. దీనికి స్పందనగా డసో ఏవియేషన్‌తో పాటు ఎంబీడీఏ, సఫ్రాన్, థేల్స్ వంటి ఫ్రెంచ్ రక్షణ రంగ దిగ్గజాలు సంయుక్తంగా ఈ ప్రతిపాదనను సిద్ధం చేశాయి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దేశీయ సంస్థల భాగస్వామ్యంతో ఇక్కడే 94 జెట్లను ఉత్పత్తి చేయనున్నారు. కేవలం తయారీకే పరిమితం కాకుండా, కీలక సాంకేతిక పరిజ్ఞాన బదిలీతో పాటు స్వదేశీ అస్త్ర క్షిపణుల వంటి అధునాతన ఆయుధ వ్యవస్థలను ఈ విమానాలకు అనుసంధానించడం కూడా ఈ ఒప్పందంలో ప్రధానాంశం. వాయుసేనలోని పాత మిగ్ విమానాలను దశలవారీగా ఉపసంహరిస్తుండటం, స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం ఎల్‌సిఎ తేజస్ సరఫరాలో జాప్యం నెలకొనడంతో స్క్వాడ్రన్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఈ లోటును భర్తీ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ భారీ ఒప్పందంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఒప్పందం ద్వారా దేశీయ ఏరోస్పేస్, రక్షణ రంగాలకు భారీ ఊపు లభించనుంది. దీనివల్ల టాటా, ఎల్ అండ్ టి వంటి భారతీయ కంపెనీలకు సుమారు రూ.1.6 లక్షల కోట్ల మేర వ్యాపార అవకాశాలు దక్కుతాయని అంచనా. ప్రస్తుతం ఈ ప్రతిపాదన రక్షణ మంత్రిత్వ శాఖ, వాయుసేన సేకరణ విభాగాల పరిశీలనలో ఉంది. ఇప్పటికే వాయుసేన, నౌకాదళం కోసం భారత్ 62 రఫేల్ జెట్లను ఆర్డర్ చేయగా, ఈ కొత్త ఒప్పందం పూర్తయితే భారత వాయుసేనలో వీటి మొత్తం సంఖ్య 176కు చేరుకుంటుంది.



## గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి పొడవైన జుట్టు ఉన్న మహిళ

### ఉత్తరాఖండ్ రేణుధరియాల్ రికార్డు

**డెహ్రాడూన్, ఆగస్టు 8:** భారత్‌కు చెందిన రేణు ధరియాల్ ప్రపంచంలోనే అత్యంత పొడవైన జుట్టు కలిగిన మహిళగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఆమె జుట్టు పొడవును అధికారికంగా కొలవగా, అది 271.50 సెంటీమీటర్లు (8 అడుగుల 10 అంగుళాలు) ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో ఆమె పేరు గిన్నిస్ బుక్‌లో నమోదైంది. ఈ యేడాది ఏప్రిల్‌లో ఈ రికార్డును అధికారులు ధ్రువీకరించారు. దీంతో ఉక్రెయిన్‌కు చెందిన అలియా నసిరోవా (257.33 సెం.మీ.) పేరిట ఉన్న పాత రికార్డు బద్దలైంది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రపంచంలోనే అత్యంత పొడవైన వ్యక్తిగా రికార్డులకెక్కిన రాబర్ట్ వాడ్లో (272 సెం.మీ.) ఎత్తుకు రేణు జుట్టు పొడవుకేవలం కొద్దిగా మాత్రమే తక్కువ. రేణు ధరియాల్ వృత్తిరీత్యా ఒక కంటెంట్ క్రియేటర్, యూట్యూబర్. మహిళలకు అందం, జుట్టు సంరక్షణపై చిట్కాలు అందిస్తుంటారు. భారతీయ సంస్కృతిలో పొడవాటి జుట్టును అందానికి, సంప్రదాయానికి చిహ్నంగా భావిస్తారని, అదే తనకు స్ఫూర్తినిచ్చిందని రేణు తెలిపారు. 2015 నుంచి జుట్టును పెంచుతున్నానని, అప్పటి నుంచి ఒక్కసారి కూడా కత్తిరించలేదని ఆమె వివరించారు. ఇంత పొడవాటి జుట్టును సంరక్షించడం చాలా ఓపికతో కూడుకున్న పని అని రేణు చెప్పారు. జుట్టును శుభ్రం చేయడానికి, చిక్కులు తీయడానికి గంటల సమయం పడుతుందని అన్నారు. నేలపై పడకుండా ఉండేందుకు తన ఒత్తైన, నిగనిగలాడే జుట్టును పెద్ద జడగా అల్లుకుంటానని ఆమె పేర్కొన్నారు.

## శాంతియుత పరిష్కారానికి సిద్ధమే

### బెదరింపులకు లొంగేది లేదు: ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

**టెహ్రాన్, ఆగస్టు 8:** అమెరికా సహా పాశ్చాత్య దేశాలు విధిస్తున్న ఆర్థిక, దౌత్యపరమైన ఆంక్షలపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా స్పందించారు. శాంతియుత చర్చలకు తాము ఎల్లప్పుడూ సిద్ధమే అయినా, బలవంతపు ఆంక్షలు, బెదిరింపులతో తమను లొంగదీసుకోవచ్చని భావిస్తే అది అపోహే అవుతుందని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ దేశాలతో పరస్పర గౌరవంతోకూడిన సంబంధాలనే కోరుకుంటున్నామని, అయితే తమ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. టెహ్రాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇరాన్ ఏ దేశంతోనూ యుద్ధాన్నిగానీ, ఉద్రిక్తతలనుగానీ కోరుకోవడం లేదు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధమని తెలిపారు. చర్చల పేరుతో ఏకపక్ష నిబంధనలు రుద్దాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆంక్షలు, బెదిరింపుల ద్వారా ఇరాన్‌ను లొంగదీసు కోవచ్చని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.



## ఐఎఫ్ వింగ్ కమాండర్ అరెస్టు

### పాక్ మహిళ హనీట్రాప్‌లో పడి రహస్య సమాచారం చేరవేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** పాకిస్థానీ మహిళ హనీట్రాప్ వలలో చిక్కుకున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఎఎఫ్) వింగ్ కమాండర్ అధికారిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అతడు దేశ రక్షణకు సంబంధించిన సున్నితమైన, రహస్యమైన సమాచారాన్ని ఆ మహిళకు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, ఆ అధికారి పేరును మాత్రం పోలీసులు వెల్లడించలేదు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఐఎఫ్ వింగ్ కమాండర్‌కు సోషల్ మీడియా ద్వారా ఒక మహిళ పరిచయమైంది. ఆమె.. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ సర్వీసెస్ కోసం పని చేస్తున్నది. ఇండియాకు చెందిన రక్షణ, రహస్య సమాచారాన్ని సేకరించడమే ఇలాంటి మహిళల లక్ష్యం.
రక్షణ అధికారులను హనీ ట్రాప్‌లో దించి, భారత రహస్యాలను సేకరిస్తుంటారు. ఈ ఘటనలో కూడా ఐఎఫ్ అధికారిని పాక్ మహిళ అలాగే హనీట్రాప్‌లోకి దించింది. దాదాపు రెండేళ్లనుంచి వీరి మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. మొదట సోషల్ మీడియా ద్వారా పాక్ మహిళ వింగ్ కమాండర్‌ను పరిచయం చేసుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా అతడి ఫోన్‌లోకి ఒక రహస్య యాప్ ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పింది. అయితే, ఇందుకోసం ఆ అధికారి వేరే మొబైల్ ఉపయోగించాడు. ఈ యాప్ ఇక్కడి డాటా సేకరణకు ఉపయోగపడుతుంది. ఇదే సమయంలో మొబైల్ ద్వారా ఏం మాట్లాడుతున్నారో నిరంతరం వినే వీలుంటుంది. ఈ రహస్య యాప్ పనితీరు గురించి, ఇంకా పూర్తి వివరాలు తెలియవు. మరోవైపు ఐఎఫ్ అధికారికి బాగా దగ్గరైన ఆ మహిళతో అతడు రెగ్యులర్ చాటింగ్ చేసేవాడు. వీడియో కాల్స్ చేసుకునే వాళ్లు. ఇక్కడి ఫొటోలు, వీడియోలు తీసి అతడు ఆమెకు షేర్ చేసేవాడు. అలాగే, రక్షణ విభాగానికి చెందిన రహస్య సమారాన్ని కూడా అతడు ఆమెకు చేరవేశాడు. ఆమె అడిగిన కీలక వివరాల్ని అందజేశాడు. ఈ విషయంపై నిఘా ఉంచిన ఐఎఫ్ ఉన్నతాధికారులు అతడిపై ఫిర్యాదు చేశారు. దీంతో గత మే 30న ఆ ఐఎఫ్ అధికారిని ఢిల్లీ పోలీసులు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ కింద అరెస్టు చేశారు. జుడీషియల్ కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. అతడు ఆమెకు ఏ సమాచారం చేరవేశారు వంటి వివరాలను పోలీసులు సేకరించారు. అలాగే, చాటింగ్, వీడియో కాల్స్, వీడియోలు, ఫొటోలను కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో కీలక విచారణ పూర్తయింది. దీంతో జులై 30న చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో కేసు విచారణ సాగుతోంది.

## సంక్షిప్త వార్తలు

### లోయలో పడిన బస్సు, ఏడుగురు మృతి



**సిమ్లా, ఆగస్టు 8:** హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చంబా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి సుమారు 100 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు డ్రైవర్, కండక్టర్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శర్మ ట్రావెలర్స్‌కు చెందిన బస్సు శనివారం ఉదయం సుమారు 6.30 గంటలకు బైరాగఢ్ నుంచి చంబా పట్టణానికి బయలుదేరింది. దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత చాలుజ్ మలుపు వద్ద ప్రమాదం జరిగింది.

### పోర్చుగల్‌లో భారత్ మహిళకు హింసలు

**పూణె, ఆగస్టు 8:** యురోపియన్ దేశంలో నెలకు రూ. 1.5 లక్షల జీతంతో సూపర్‌మార్కెట్ క్యాషియర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, నాగ్‌పూర్‌కు చెందిన 28 యేళ్ల మహిళ నుంచి రూ.11 లక్షలు కాజేసిన ఘరానా మోసం పుణేలో వెలుగుచూసింది. పుణే కేంద్రంగా పనిచేస్తున్న ఒక జాబ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ బాధితురాలిని మే నెలలో పోర్చుగల్ పంపించగా, అక్కడ ఆమె పాస్‌పోర్టును లాక్కుని ఆమెను ఓ బీరు షాప్ యజమానికి విక్రయించారు. అక్కడ ఆమెతో బలవంతంగా పని చేయిస్తూ తీవ్రమైన మానసిక, శారీరక హింసకు గురిచేశారు.

### హార్ముజ్‌లో వాణిజ్య నౌకపై మళ్లీ దాడులు

**టెహ్రాన్, ఆగస్టు 8:** అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి తూర్పు ముఖద్వారం వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఓ వాణిజ్య నౌకపై దాడి జరగడంతో అందులో భారీగా మంటలు చెలరేగాయి. నౌక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూ, సహాయం కోసం అత్యవసర సందేశాలు పంపారు. చైనాకు చెందిన జిన్హువా వార్తా సంస్థ సేకరించిన ఓడల మధ్య రేడియో సంభాషణల ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగిందని, దీంతో నౌక ఇంజిన్ రూమ్‌లో మంటలు వ్యాపించాయని సిబ్బంది తెలిపారు.

### ప్రధానిమోడీతో భేటీ అయిన ఎంపి రాఘవ్ ఛద్దా

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** రాజ్యసభ ఎంపీ, ఇటీవల ఆప్ నుంచి బిజెపిలో చేరిన రాఘవ్ చద్దా ప్రధాని మోడీతో శనివారం భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. పంజాబ్ ఎన్నికలకు ముందు బిజెపి చద్దాకు కీలక బాధ్యతలు అప్పగించబోతుందా అనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

### నడిరోడ్డుపై కాంగ్రెస్‌నేత దారుణ హత్య

**ఉడుపి,ఆగస్టు 8:** నడిరోడ్డుపై కాంగ్రెస్ నేత దారుణహత్యకు గురయ్యారు. ఈ హత్యోదంతం మొత్తం సిసి కెమెరాల్లో రికార్డయింది. కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో ఈ దారుణం జరిగింది. స్థానిక కాంగ్రెస్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త అయిన డేవిడ్ డిసౌజాను గుర్తుతెలియని దుండగులు అతి కిరాతకంగా కాల్చిచంపారు. రోడ్డు పక్కన ఆపి ఉన్న తన కారు ఎక్కుతుండగా వెనుక నుంచి వచ్చిన ఓ దుండగుడు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ భయానక ఘటన మొత్తం అక్కడి సిసి టివి కెమెరాలో రికార్డయ్యింది.

### మోహన్‌లాల్‌కు వీసా తిరస్కరణ.. ఆస్ట్రేలియాలో షో వాయిదా



**సింగపూర్, ఆగస్టు 8:** మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు ఆస్ట్రేలియా వీసా సకాలంలో రాకపోవడంతో సిడ్నీలో జరగాల్సిన ఆయన లైవ్ షో వాయిదాపడింది. ఆస్ట్రేలియాలోని నార్‌వెస్ట్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం 'వైకిట్టు ఎంద పరిపాడి' అనే కార్యక్రమంలో మోహన్‌లాల్‌తోపాటు పలువురు హాజరు కావాల్సి ఉంది. కానీ, వీసా మంజూరు ప్రక్రియలో అనూహ్యజాప్యం కారణంగా ఆయన ఆస్ట్రేలియా వెళ్లలేకపోయారు. దీంతో నిర్వాహకులు ఈ షోను వాయిదా వేశారు. ప్రస్తుతం వీసా కోసం ఎదురుచూస్తూ సింగపూర్‌లో ఉన్న మోహన్‌లాల్.. ఆస్ట్రేలియాలోని తన అభిమానులకు సోషల్‌మీడియా వేదికగా క్షమాపణలు చెప్తూ ఓ వీడియో పోస్టు చేశారు.

# కమాండ్ కంట్రోల్‌లో ఘనంగా జాతీయ పోలీసు సదస్సు

## హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయసహా

## పలువురు సీనియర్, విశ్రాంత పోలీసు అధికారులు హాజరు



హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త: నగరంలోని కమాండ్ కంట్రోల్‌లో లక్ష్యం చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నాడు జాతీయ పోలీసు సెమినార్ ఘనంగా జరిగింది. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ దీనిని లాంఛనంగా ప్రారంభించగగా సిటీ కొత్వాల్ సజ్జనార్‌సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన సీనియర్ పోలీసు అధికారులు, విశ్రాంత అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో ఆధునిక పోలీసింగ్ అవసరం, నేరాల తీరుతెన్నులు, సాంప్రదాయక నేర విచారణ, శాంతి భద్రతల పరిరక్షణకు అనుసరిస్తున్న పద్దతులు, మారుతున్న కాలంలో ఎంచుకోవాల్సిన పద్దతులు, కృత్రిమ మేధస్సు వాడి నేరాల నివారణ, ఆర్థిక నేరాలను అరికట్టడం, పెరిగి పోతున్న డ్రగ్స్ కల్చర్‌ను, సైబర్ నేరాలను సమూలంగా నివారించడం, వీటి వెనుక వున్న వ్యవస్థీకృత ముఠాలను ఏరిపారేయడం వంటి అంశాలపైను దీర్ఘంగా చర్చించారు. దీంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో కీలకంగా వున్న కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయడంపైనా చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతికతను వాడుతున్నా ప్రజల విశ్వాసం లేని పక్షంలో అంతా వృధాయేనని సెమినార్‌లో పాల్గొన్న వక్తలు అభిప్రాయ పడ్డారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల విశ్వాసాన్ని పొందాలని, అనేక అంశాలలో వారిని భాగస్వాములను చేయాలని వక్తలు కోరారు. మారుతున్న కాలంలో పోలీసులపై విధి నిర్వహణకు సంబంధించి తీవ్రమైన ఒత్తిడి వుంటోందని, దీనిని అధిగమించేందుకు కొత్త తరహా పద్దతులను అనుసరించడంతో పాటు శిక్షణ ఇవ్వాలని వారు అభిప్రాయ పడ్డారు. భవిష్యత్ పోలీసింగ్‌కు నిరంతరం ప్రాధాన్యతను ఇవ్వాలని వారు కోరారు. ఈ సెమినార్‌లో పాల్గొన్న వారిలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, హర్యానా హోం శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ సుధీర్ రాజ్‌పాల్, జమ్మూకాశ్మీర్ మాజీ డిజిపి రాజేంద్రకుమార్, విశ్రాంత డిజిలు అరుణా బహుగుణ, గోపీనాథ్‌రెడ్డి, కోడె దుర్గా ప్రసాద్, తమిళనాడు మాజీ డిజిపి ఎండి షకీల్ అహ్మద్, విశ్రాంత ఎస్‌పి ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణుడు రామ్మోహన్‌రావు మాజీ ఎంఎల్‌సి, సెమినార్ నిర్వాహకుడు కె. దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

# డబుల్ శాలరీలపై క్రిమినల్ కేసులు

## ఏడు రోజుల్లో రికవరీ చేయాలి

## అధికారుల కుమ్మక్కుపై విచారణ

## ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు

హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త: ప్రభుత్వ శాఖల్లో డబుల్ వేతనాలను పొందుతున్న ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంచలన ఆదేశాలు జారీ చేశారు. ఈ దందాను తీవ్రమైన ఆర్థిక నేరంగా పరిగణిస్తూ అన్ని శాఖలకు నకిలీ పత్రాలు సృష్టి, విశ్వాస భంగం, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులు బనాయించి, కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతే కాకుండా ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి డబుల్ వేతనాల రూపంలో అక్రమంగా పొందిన సొమ్మును వెంటనే రికవరీ చేయాలన్నారు. ఆదేవిధంగా అక్రమార్కులపై తెలంగాణ సీసీఏ నియమావళి ప్రకారం శాఖాపరమైన తీవ్ర చర్యలు తీసుకోవాలి. ఇదే సమయంలో ఒకే ఉద్యోగి వేర్వేరు శాఖల్లో వేతనాలు తీసుకుంటున్న నేపథ్యంలో అందులో అధికారులు కుమ్మక్కుపై విచారణ చేయాలని తెలిపారు. డ్రాయింగ్ అధికారులు నిబంధనలు పాటించక పోవడం వెనక నిర్లక్ష్యం ఉందా లేక ఉద్యోగులతో కుమ్మక్కయ్యారా అనే కోణంలో విచారణ జరిపి, వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కాగా ఒక ప్రభుత్వ ఉద్యోగి రెండు శాఖల్లో జీతాలు తీసుకుంటున్నట్లు ఆర్థిక శాఖ గుర్తించింది. ఈ విధంగా దాదాపు 80 మంది వరకు ఉండొచ్చని ఒక నిర్ధయానికి వచ్చింది. దీనిపై ప్రభుత్వం సీరియస్ కావడంతో విచారణకు, క్రిమినల్ కేసులు, రికవరీకి ఆదేశాలు జారీ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న యజ్ఞం పవన్‌కుమార్‌శర్మ

# నిజమైన బ్రాహ్మణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి

## ప్రభుత్వానికి ఐక్యవేదిక డిమాండ్

హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 8, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బ్రాహ్మణులను గత బిఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని తెలంగాణ బ్రాహ్మణుల ఉద్యమకారుల ఐక్యవేదిక ఆరోపించింది. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను ప్రారంభించి కేవలం రెండు పథకాలను మాత్రమే అమలు చేసి మిగతా పథకాలను అమలు చేయకుండా మార్చివేసిందని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేయలేదని వేదిక నాయకులు ఆరోపించారు. శనివారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వేదిక ప్రతినిధులు డా.యజ్ఞం పవన్‌కుమార్‌శర్మ, పోచంపల్లి రమణరావు, అకినేపల్లి వేణుగోపాల్‌రావు తదితరులు 'బ్రాహ్మణ్ ఫర్ సోషల్ రీ ఇంజనీరింగ్ ఇంక్లూజీవ్ ఎంపవర్మెంట్ సిస్టం'ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పరిషత్‌ను పునరుద్ధరించి తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేదని వారికి ఛైర్మన్, వైస్-ఛైర్మనల్ పదవులను కట్టబెట్టి నిజమైన ఉద్యమకారులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని నిజమైన ఉద్యమకారులను గుర్తించి, డైరెక్టర్లుగా నియమించాలని, అలాగే ప్రభుత్వ నామినేటేడ్ పదవుల్లో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని, బ్రహ్మణ పరిషత్‌కు 25 కోట్లు నిధులను విడుదల చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రసాదరావు, గంపా రామారావుశర్మ, గూడ రాజేశ్వర్‌రావు, రవికిరణ్, శ్రావణ్‌కుమార్, శ్రీధర్‌రావు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఏ ఛైర్మన్‌గా గంప వేణుగోపాల్ నియామకం

## సేఫ్ ఎన్విరాన్‌మెంట్ సోషల్ జస్టిస్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద

హైదరాబాద్, ఆగస్టు 8,ప్రభాతవార్త: తెలంగాణలో కాంగ్రెస్ క్షేత్రస్థాయి పట్టును బలోపేతం చేసేందుకు గంప వేణుగోపాల్ సంఘటన్ సృజన్ అభియాన్ ఛైర్మన్‌గా నియామకం చేశారు. వేణుగోపాల్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్ఎస్ఏకి సంబంధించి కార్యకలాపాల సమన్వయం, పర్యవేక్షణ. అమలుకు నాయకత్వం వహించడం జరుగుతోందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు. సంస్థాగత నిర్మాణం, క్రమశిక్షణ,క్షేత్రస్థాయి అమలును బలోపేతం చేయడమే ఈ నియామకం లక్ష్యం అని పేర్కొన్నారు. సేఫ్ ఎన్విరాన్‌మెంటల్ సోషల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు. ఈ కమిటీ సోషల్ జస్టిస్ సంబంధించిన అంశాలను పిసిసి చీఫ్‌కు రిపోర్టు చేస్తోందని మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులో పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్ (చిక్కడపల్లి) ఆగస్టు 8, ప్రభాతవార్త : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి కమిటీ మూడవ ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పులి లక్ష్మయ్య, నాయకులు బక్క జడ్సన్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న, పృధ్వి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు కేవలం ఉద్యోగుల సమస్య లు మాత్రమే కావని ఇవి సామాజిక న్యాయం కార్మిక హక్కులు గౌరవపదమైన ఉపాధి సంబంధించిన విషయన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు పులి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయ కుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నేరుగా అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు దోలుపడి శ్రీధర్, దుర్గం శ్రీనివాస్, కోశాధికారి కోటల సంతోష్, శేఖర్ రెడ్డి, సురేందర్ గౌడ్, రాజు మహమ్మద్, జ్యోతి, పద్మ, విజయలక్ష్మి, రవి కిరణ్, క్రాంతి ,అజయ్, లింగయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

# యుఎఇ బతుకమ్మ సంబురాలకు కెటిఆర్‌కు ఆహ్వానం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 8: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమి రేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ-యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతి నిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి యేటా బతుకమ్మతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు.
ఈటీసీఏ ప్రతినిధులతో సమావేశమైన కేటీఆర్ గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికుల ప్రస్తుత పరిస్థితులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణకు దూరంగా గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ, ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయ సహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో చిక్కుకుపోయిన పలువురు తెలంగాణవాసుల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ చూపి, వారిని స్వస్థలాలకు చేరుకునేలా చేసిన విషయాన్ని ఈటీసీఏ ప్రతినిధులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. తెలంగాణ బిడ్డల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ అందిస్తున్న సహకారానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, యూఏఈలోని తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఈటీసీఏ ఏర్పాట్లు చేస్తోంది



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

# సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీమంత్రి తలసాని

హైదరాబాద్ (సికిందరాబాద్), ఆగస్టు 8, ప్రభాతవార్త: పద్మారావునగర్‌లోని పల్స్ హాస్పిటల్ లైన్‌లో కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో నిర్మించాలని, ప్రజాధనం దుర్వి నియోగం కాకుండా రోడ్డు నిర్మాణ సమయంలో స్థానికులు దగ్గరుండి పనులను పరిశీలించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మారావునగర్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బన్సీ లాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, అంబులెన్స్ సురేష్, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కొత్తూరు వెంకట్, సుధాకర్‌రెడ్డి, అబ్బాస్, శ్రీనివాస్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీతోనే ఉద్యోగం రాదు.. నైపుణ్యాలుంటేనే ఉపాధి అవకాశాలు

## ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్-అవార్డ్స్ 2026 కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 8: మార్కుల మెమోలతో డిగ్రీలను అందించే వ్యవస్థ నుంచి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మ విశ్వాసంతో కూడిన యువతను తయారు చేసే గమ్యం వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. విద్య, పరిశ్రమ, ఉపాధిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి యువతను భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాయదుర్గంలోని టీ-వర్క్స్ ప్రాంగణంలో శనివారం జరిగిన ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్-అవార్డ్స్ 2026 కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. క్వాలిటీ థాట్ ఫ్యూచర్ స్కిల్స్ ఫౌండేషన్ పరిశ్రమ, విద్యాసంస్థలు, యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని ఈ సందర్భంగా అన్నారు.
తెలంగాణలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ తదితర వృత్తి విద్యా కోర్సుల నుంచి ఏటా 2 లక్షల మందికి పైగా గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. వారికి డిగ్రీలు, ప్రతిభ, ఎదగాలన్న బలమైన ఆకాంక్ష ఉన్నప్పటికీ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో డిగ్రీ ఒక్కటే సరిపోదన్నారు. పరిశ్రమకు నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, కమ్యూనికేషన్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారే శక్తి, నిరంతరం నేర్చుకునే తత్వం అవసరమని చెప్పారు.
టాటా సన్స్ సహకారంతో రూ.2,400 కోట్లతో ఈ కేంద్రాలను భవిష్యత్తు పరిశ్రమ అవసరాలకు తగిన విధంగా తీర్చి దిద్దుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటి పరిశ్రమల్లో మొదటి రోజు నుంచే పనిచేయగల నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లను తయారు చేయడమే లక్ష్యమన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ దేశంలో నైపుణ్యాభివృద్ధికి కొత్త నమూనాగా నిలుస్తుందని మంత్రి చెప్పారు. విద్య ఉపాధికి దారితీయాలి. కోర్సుల రూపకల్పనలో పరిశ్రమకు మరింత బలమైన పాత్ర ఉండాలి. ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా ఉంటుంది.. పరిశ్రమే నైపుణ్యాల వ్యవస్థలో కేంద్రంగా ఉండాలి అని అన్నారు.
ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో యూనివర్సిటీ పనిచేస్తోందని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు, ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమల్లో అనుభవం కల్పించడమే లక్ష్యమన్నారు.ప్రతి విద్యార్థి డిగ్రీతోపాటు కనీసం ఒక పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాన్ని సంపాదించాలి అని శ్రీధర్‌బాబు తెలిపారు.ఏఐ, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ మార్కెటింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి రంగాల్లో నైపుణ్యాలు పొందాలని సూచించారు.
టెక్నాలజీ మారుతోంది.. పరిశ్రమలు మారతాయి.. కానీ నేర్చుకోవాలన్న తపన మాత్రం మారకూడదు. డిగ్రీతో చదువు ముగియదు.. జీవితాంతం నేర్చుకోవడం కొత్త ఆర్థిక వ్యవస్థలో తప్పనిసరి అని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ) ఐటీ రంగానికే పరిమితం కాకుండా వైద్యం, తయారీ, ఆర్థిక రంగం, విద్య, వ్యవసాయం తదితర దాదాపు అన్ని రంగాలను మారుస్తోందని మంత్రి తెలిపారు. ఏఐ వల్ల ఉద్యోగాలు మారతాయని, అదే సమయంలో కొత్త వృత్తులు, కొత్త పరిశ్రమలు, కొత్త అవకాశాలు భారీగా వస్తా యని చెప్పారు. ఏఐ, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, క్వాంటమ్ టెక్నాలజీలు భవిష్యత్ సాంకేతిక విప్లవానికి కీలకంగా మారనున్నాయని తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో సుమారు 20 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. శిక్షణ ఇవ్వడమే కాదు.. నేరుగా ఉపాధితో అను సంధానించడమే మా లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్ నిర్వాహకులు రమణ, క్రిష్, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తణికెళ్ల, టాస్క్ సీఈవో నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

# హాస్టల్ సీట్లు దొరకక రైల్వే స్టేషన్లలో పడుకుంటున్న విద్యార్థులు

## బిసి విద్యార్థుల కష్టాలపై ముఖ్యమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లోని కాలేజీల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు హాస్టల్ సీట్లు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే 120 కొత్త బీసీ కాలేజీ హాస్టళ్లు, 100 బీసీ గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆర్. కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.
హైదరాబాద్‌లోని కాలేజీల్లో సీట్లు లభించక కొందరు విద్యార్థులు రాత్రివేళల్లో రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌లపై నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం వల్ల 2008లో మంజూరైన కాలేజీ బాలికల హాస్టల్ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదని, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.
గతంలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాలనలో 300, రోశయ్య పాలనలో 300 హాస్టళ్లను ఒకేసారి ప్రారంభించారని, కేసీఆర్ పాలనలో మూడు దశల్లో 270 బీసీ గురుకులాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.
ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి కనీసం 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 100 బీసీ గురుకులాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, సంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం వంటి జిల్లా హెడ్‌క్వార్టర్లలో సీట్లు లభించక వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ హాస్టళ్ల ఫీజులు భరించలేక చదువు స్వస్తి చెప్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాల వారీగా హాస్టళ్లను మంజూరు చేయాలని కోరారు.

# పేదల సంక్షేమాన్ని ఉచితాలుగా చిత్రీకరించడం సరికాదు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త: ధనికులకు రాయితీలు ఇస్తూ పేదల సంక్షేమంపై నిందలు వేయడమేకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు రాయితీలు, సబ్సిడీలు, రుణమాఫీలు చేస్తున్నవి విస్మరించి, పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, ఉచితాలపై హైకోర్టు న్యాయ మర్తి చేసిన వ్యాఖ్యలపై సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నదనీ రాష్ట్ర క్యారద్శి జాన్ వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్, పెన్షన్లు, విద్య, వైద్యం, గృహ, ఉపాధి, రైతు సహాయం తదితర సంక్షేమ పథకాలు ఏమాత్రం ఉచితాలు" కావు. పేదప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, సామాజిక అసమానతలను తగ్గించడానికి ప్రజాధనాన్ని వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సిపిఐ(ఎం) భావిస్తున్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు అనర్హులకు పథకాలు వర్తింపజేస్తున్నాయనే వ్యాఖ్యలో భాగంగా, ఉచిత పథకాల వల్ల ప్రజలు పనులకు వెళ్లడం లేదని, వ్యవసాయ కూలీలు అందుబాటులో లేరని చేసే వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించడమే అని ఆవేదన చెందారు. కూలీలకు ఏడాది పొడవునా పని దొరుకుతుందా, కనీస వేతనం అందుతోందా, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఉన్నాయా అనే కనీస అంశాలను పరిశీలించకుండా సంక్షేమ పథకాలను తప్పుపట్టడం సరైందికాదనీ తెలిపారు.




పొలాలకు వెళ్లకుండా నిర్మించిన అడ్డుగోడను తొలగిస్తున్న అన్నదాతలు

# ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ గెస్ట్‌హౌస్ ప్రహరీ ధ్వంసం

హైదరాబాద్ (నార్సింగి), ఆగస్టు 8, ప్రభాతవార్త: నార్సింగి మండలం జాప్తి శివునూర్‌లో 44వ జాతీయ రహదారి పక్కన గల మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ గెస్ట్‌హౌస్‌కు సంబంధించిన ప్రహరీ గోడను పంట పొలాలకు వెళ్లకుండా నిర్మిస్తున్నారని శనివారం రైతులు గోడను తొలగించారు. షబ్బీర్‌అలీ గెస్ట్‌హౌస్ మధ్యలో నుండి అమ్మకుంట, తాతకుంటతో పాటు జాప్తిశివనూర్ గ్రామానికి సంబంధించిన రైతులకు పొలాలకు వెళ్లే దారి ఉంది. అయితే దారి వదిలి ప్రహరీ గోడ నిర్మించుకోవాలని, ఆ దారి గుండా పొలా లకు వెళ్లే రైతులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు పొలాలకు వెళ్లే దారిని వదిలి ప్రహరీగోడ నిర్మించుకోవాలని చెప్పినా వినకుండా గెస్ట్‌హౌస్ చుట్టూ ప్రహరీగోడ నిర్మించారు. 200 ఎకరాల భూమికి సంబంధించిన రైతులు ఆ దారి గుండానే తమ పొలాలకు వెళ్తారు. ఆగ్రహించిన గ్రామస్తులు అడ్డుగా నిర్మించిన గోడను ధ్వంసం చేశారు. గ్రామ రైతులు, గ్రామస్తులు మాట్లాడుతూ అమ్మకుంట, తాతకుంటకు సంబంధించి తమ పంట పొలాలకు వెళే దారిని మూసివేసి, ప్రహరిగోడ నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఎన్నో యేళ్లుగా ఈ మార్గం ద్వారా వ్యవసాయ భూములకు రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. గోడ నిర్మాణం పూర్తయితే తమ పొలాలకు వెళ్లేందుకు దారిలేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్తేనే కేంద్రమంత్రుల్లో కదలిక

## క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపి మల్లు రవి



శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపి మల్లు రవి

హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త: సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్తేనే కేంద్ర మంత్రులలో కదలిక వస్తుందని తెలంగాణ వచ్చే ఎన్నికలల్లో వందశాతం కాం గ్రెస్ అధికారంలోకి వస్తుందని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ఎంపి మల్లు రవి తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్ళి మెట్రో, ఆర్‌ఆర్‌ఆర్,మూసి రివర్ ఫ్రంట్ కోసం కేంద్ర మంత్రులపై ఒత్తిడి తెస్తున్నారనీ వివరణ ఇచ్చారు. బిజెపి వెస్ట్ బెంగాల్ లో అత్యంత అప్రజాస్వామికంగా అధికారంలోకి వచ్చిందనీ ఇక్కడ మాత్రం అదే విధానంలో అధికారంలోకి రావడం అసాధ్యమని క్రమశిక్షణ కమిటి ఛైర్మన్ ఎంపి మల్లు రవి అన్నారు. ఇడి సిబిఐ ని వాడుకొని బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడిందనీ ఎన్నికలు పారదర్శకంగా జరగ కుండా కుట్రలు చేసిందని ఆవేదన చెందారు. ఒక్కోసారి దేశంలో ప్రజా స్వామ్యం బ్రతికి ఉందా అనిపిస్తుందనీ అందుకే జన్ జి ఉద్యమం కాక్రోచ్ ఉద్యమం పుట్టుక కొచ్చిం దనీ అన్నారు. స్వాతంత్ర ఉద్యమం లో బ్రిటీష్ ప్రభుత్వం లాఠీ ఛార్జ్ చేసినట్లు జన్ జిలపై చేశారనీ అభిప్రాయ పడ్డారు పార్లమెంట్ జరుగుతుంటే కేంద్ర హోం మంత్రి రాలేదు నక్స లైట్లది రాజ్యాంగేతర ఉద్యమం వాళ్లది ప్రజాస్వామ్య ఉద్యమం కాదు కానీ జన్ జిలు లు రాజ్యాంగానికి లోబడి చేశారు అని అన్నారు. మా ఫస్ట్ టార్గెట్ బెంగాల్ అయిపోయిందనీ తర్వాత తెలంగాణ అని బిజెపి అంటుందనీ ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి కి తెలంగాణ లో మూడో స్థానం వస్తదో రాదో గ్యారంటీ లేదని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 శాతం అధికారంలోకి వస్తుందనీ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ కు తెలంగాణ కు సారూప్యం లేదనీ ప్రజల కోసం పని చేస్తున్న రేవంత్ రెడ్డికి కి జన్‌జీలలో, అందరిలో ఆదరణ ఉందనీ చెపుకున్నారు. అస్సాం బీహార్ లాగ బిజెపి తెలంగాణ లో అధికారంలోకి రావని చూస్తుందనీ తెలంగాణలో అట్లా నడవదనీ హెచ్చరించారు. ఇక్కడ నాయకుడు 70వేల ఉద్యోగాలు ఇచ్చి ప్రజా పరిపాలన సాగిస్తున్నాడు. డబుల్ బెడ్ ఇళ్లు ఇస్తామని కెసిఆర్ మోసం చేశారనీ అన్నారు. ప్రతి పేదవాడికి గుడిసె లేకుండా చేయాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టామనీ అందులో భాగంగా రేవంత్‌రెడ్డి ఏడులక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాడని చెప్పారు. పేద ప్రజలను ఆదుకోవడం కోసం 200 యూనిట్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నారనీ, రేషన్ కార్డులు ఇచ్చి సన్న బియ్యం ఇస్తున్నారనీ అన్నారు.



## విద్యా సర్టిఫికెట్లకు విలువ ఉందా?

### ఉద్యోగాలు లేనప్పుడు ఏం ప్రయోజనం?

### ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో రాహుల్ ఫైర్

**ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 8:** దేశంలో విద్యా సర్టిఫికెట్లకు ప్రస్తుతం పెద్దగా విలువ లేకుండా పోతోందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో శనివారం నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.విద్యా అర్హతలు ఉద్యోగాలు కల్పించలేకపోతున్నప్పుడు వాటికి అర్థం ఏముంటుందని ప్రశ్నించారు. దేశంలోని 40 కోట్ల మంది యువతే భారతదేశానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా వంటి దేశాల గురించి మాట్లాడుతున్నప్పటికీ, భారత యువత శక్తి అసమానమైనదని అన్నారు. విద్యార్థులతో తాను మూడు 'డీ'ల గురించి మాట్లాడాలనుకుంటున్నానని రాహుల్ చెప్పారు. అవి డర్ (భాధ), డేటా, దౌలత్ (సంపద) అని వివరించారు. దేశంలోని ప్రతి భారతీయుడినీ ఉద్దేశించి తాను యువతను దేశానికి శక్తి, గర్వకారణంగా భావిస్తున్నానని అన్నారు.రాహుల్ గాంధీ ప్రసంగాన్ని వినేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తరలివచ్చారు. వర్షపు నీరు నిలిచిపోవడంతో పాటు ప్రాంగణంలో బురద ఉన్నప్పటికీ వారు కార్యక్రమానికి హాజరయ్యారు. రాహుల్ రాకకు ముందు ముంబైకి చెందిన ర్యాపర్ల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముందు రోజు శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలను, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇబ్బందులను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.

## 15 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు

### రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కార్డుల పంపిణీ

### సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:**రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఈ నెల 15న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్రస్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సంగారెడ్డిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే మిగిలిన 32 జిల్లా కేంద్రాల్లో కూడా మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. అదనంగా 61.09 లక్షల మంది ఆహార భద్రత పరిధిలోకి వచ్చారు.ృకొత్త కార్డుల మంజూరుతో తెలంగాణలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరగా, 3.42 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభిస్తోంది.రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం సిద్ధం చేసింది.జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు.పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ఇచ్చారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందు జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు.పంపిణీకి సిద్ధంగా ఉన్న లామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డులను భద్రంగా ఉంచడంతో పాటు సురక్షితంగా రవాణా చేసి, పంపిణీ కేంద్రాలకు సకాలంలో చేరేలా చూడాలని ఆదేశించారు.

## అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ స్వతంత్ర వైఖరిని కొనసాగించాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త:** దేశ స్వతంత్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంతో పాటు అంతర్జాతీయ వ్యవహారాల్లో స్వతంత్ర వైఖరిని కొనసాగించాల్సిన అవసరం ఉందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా శుక్రవారం "ఇరాన్‌పై అమెరికా యుద్ధం భారత్‌పై ప్రభావం" అనే అంశంపై ఇస్కఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశ విదేశాంగ విధానంలో ఒకప్పుడు కీలకంగా ఉన్న అలీన విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అన్నారు. నెహ్రూ హయాంలో భారత్ అనుసరించిన అలీన విధానం అనంతర కాలంలో విస్మరణకు గురైందని ఆయన అన్నారు. ప్రస్తుతం దేశంలో ఫాసిస్టు భావజాలానికి సంబంధించిన అనేక విధానాలు అమలవుతున్నాయని ఆరోపించారు. మతం, దేశం, జాతి పేర్లతో ప్రజలను విభజించే ధోరణులు పెరుగుతున్నాయని విమర్శించారు. హిందుత్వ పేరుతో సాగుతున్న రాజకీయాలు ఒక రకమైన జాతి దురహంకారానికి దారితీస్తున్నాయని అన్నారు.

# జల విద్యుత్ ప్రాజెక్టులపై కఠిన పర్యవేక్షణ

### త్రైమాసిక ఆప్టిమైజేషన్ ఫ్రేమ్‌వర్క్

### అనుమతుల ప్రక్రియ, ఒప్పందాల అమలు వేగవంతం

### కేంద్రానికి పార్లమెంటరీ హౌస్ కమిటీ సిఫార్సులు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** జల విద్యుత్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని పార్లమెంటరీ హౌస్ కమిటీ కేంద్రానికి సూచించింది. జల విద్యుత్ ప్రాజెక్టు సంబంధించిన అనుమతులు, నిర్మాణం పనుల్లో అభివృద్ధిని వేగవంతం చేయడానికిగాను కొన్ని చర్యలను కేంద్ర ప్రభుత్వానికి శనివారం సిఫార్సు చేసింది. ఈ మేరకు వీటికి సంబంధించి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ సెక్రెటరీ వెల్లడించిన హౌస్ కమిటీ సిఫారులు వివరాలు ప్రకారం వ్యయం, షెడ్యూల్ అతిక్రమణలను ఎదుర్కొంటున్న ప్రాజెక్టుల కోసనమైన పర్యవేక్షణ, వాతావరణ ప్రమాద అంచనాలు, వేగవంతమైన అనుమతి ప్రక్రియలు, నమూనా ఒప్పంద అమలు, జలవిద్యుత్ కాంట్రాక్టర్ల వ్యవస్థక మద్దతు, కొత్త ప్రాజెక్టులకు సాధ్యాసాధ్యాలు, అంతర నిధులు వంటివి ఉన్నాయి. ఈ సిఫార్సులు, ప్రభుత్వ యాజమాన్యంలోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పిసి)పై ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ జరిపిన అంచనాలో భాగంగా ఉన్నాయి. అంతేకాకుండా మహిళలతో సహా, స్వతంత్ర డైరెక్టర్ల సంఖ్యలో ఎన్‌హెచ్‌పిసి కొరతను ఎదుర్కోవడంపై కూడా పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. షెడ్యూల్ లేదా ఆర్థిక వ్యత్యాసాలు 20 శాతానికి చేరిన ప్రాజెక్టుల కోసం కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒక త్రైమాసిక ఆప్టిమైజేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రవేశపెట్టాలని, అలాగే అటువంటి ప్రాజెక్టులను కార్యదర్శి స్థాయి పర్యవేక్షణ బృందానికి నివేదించాలని కమిటీ సిఫార్సు చేసింది. అలాగే తీస్తా వి జలవిద్యుత్ కేంద్రం పునఃప్రారంభ కాలపరిమితికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో దీనికి సంబంధించిన విద్యుత్ మంత్రిత్వ శాఖకు నెలవారీ పురోగతి నివేదికలను సమర్పించాలని ప్యానెల్ సిఫార్సు చేసింది.

ఇది కార్యకలాపాలు సాగిస్తున్న, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను కవర్ చేసే ఒక సమగ్ర వాతావరణ ప్రమాద అంచనా ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ప్రతిపాదించింది. అన్ని ఎన్‌హెచ్‌పిసి జాయింట్ వెంచర్లు, అనుబంధ సంస్థలకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను విస్తరించాలని పేర్కొంది. ఈ రంగంలోని ఇతర ప్రభుత్వ రంగ సంస్థలతో సంబంధిత సాంకేతిక, సమాచారాన్ని పంచుకోవాలని కమిటీ సూచించింది. ప్రాజెక్ట్ అనుమతుల విషయంలో, జాతీయ ప్రాముఖ్యత కలిగిన పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టులకు గ్రామ ప్రయోజనాలను రక్షణ కల్పిస్తూ, 70 నుండి 75 శాతం అర్హత కలిగిన సూపర్‌మెజారిటీ అనుమతి పరిమితి సాధ్యాసాధ్యాలను విద్యుత్ మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాలు, పర్యావరణ మంత్రిత్వ శాఖలతో కలిసి పరిశీలించాలని ఇది పేర్కొంది. అలాగే, ప్రాథమిక సాధ్యాసాధ్యాల పరిశీలన దశలోనే అటవీ హక్కుల చట్ట సమ్మతిని ప్రారంభించాలని కూడా హౌస్ కమిటీ సిఫార్సు చేసింది.

# ప్రతి బూత్‌లో సగటున 350 వరకు బోగస్ తొలగిపోతున్నాయి

### 'సర్' ప్రక్రియ మొదటి విడత సమర్థవంతంగా పూర్తి

### బిఎల్‌ఎలకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు8:** కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ మొదటి విడత సమర్థవంతంగా పూర్తయిందని, బాధ్యతాయుతంగా పనిచేసిన ఎస్ఐఆర్ ప్రతినిధులకు, శ్రేణులకు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభినందనలు తెలిపారు. శనివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ రెండవ విడత (ఫేజ్2) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దాదాపు 21 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరుగుతోందే తప్ప కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుంచి దొంగ ఓట్లను తొలగించడం, చనిపోయిన, ఇతర ప్రాంతాలకు మారిన వారి ఓట్లను సరిదిద్ది, అర్హులైన ప్రతి పౌరుడికి కొత్త ఓటు కల్పించడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల ఓటు బ్యాంక్ రాజకీయాలపై రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కర్ణాటక మోడల్ తరహాలోనే హైదరాబాద్‌లోనూ ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఎఫ్ఆర్‌సి) పేరుతో కొత్త పద్ధతిని తెచ్చి, సరైన గుర్తింపు కార్డులు లేని రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల వంటి అక్రమ చొరబాటుదారులకు బ్యాక్‌డోర్ ద్వారా ఓటు హక్కు కల్పించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.



స్థానిక అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమ నమోదులను ప్రోత్సహిస్తూ బిజెపికి వ్యతిరేక ఓట్లను పెంచుకునేందుకు ఈ మూడు పార్టీలు కుమ్మక్కయ్యాయని, ఈ ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ దోపిడీపై లీగల్‌గా, రాజకీయంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు బయటికి ఎస్ఐఆర్‌ను విమర్శిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రైవేట్ కాంట్రాక్టులు ఇస్తూ దొంగ ఓట్లు చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాయని, పార్టీ శ్రేణులు పూర్తి కమిట్‌మెంట్‌తో ఈ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆగస్టు 7న విడు దలైన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రతి బూత్ అధ్యక్షుడు, బిఎల్ఏ1, బిఎల్ఏ2 లు క్షుణ్ణంగా స్క్రూటినీ చేయా లని రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లో సగటున 300 నుండి 350 వరకు ఉన్న డూప్లికేట్, బోగస్ ఓట్లు తొలగిపోతున్నాయని, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తగ్గడానికి ఈ నకిలీ ఓట్లే కారణమని వివరించారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఇదే ఓటర్ల జాబితా ప్రామాణికం కాబట్టి, డ్రాఫ్ట్‌రోల్‌లో మన అర్హులైన ఓట్లు సరిగ్గా ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు.అర్హులైన కొత్త ఓటర్ల నమోదుకు ఫారమ్6, దొంగ ఓట్ల తొలగింపునకు ఫారమ్7, వివరాల సవరణకు ఫారమ్8 లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.దీంతో పాటుగా, పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్, గేటెడ్ కమ్యూనిటీలు,ఓటర్లకు దగ్గర్లోని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల కేటాయింపుపై కూడా బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే రాబోయే హైదరాబాద్‌రంగారెడ్డి ,మహబూబ్‌నగర్, వరంగల్,ఖమ్మం ,నల్గొండ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, నవంబర్ 1, 2025 కంటే ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రుల డేటాను ఇప్పుడే సేకరించి, వారి ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్, ఎస్ఐఆర్ నిర్వాహకులు శశిధర్‌రెడ్డి, ఆంటోనీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఎల్ఏ 1, బీఎల్ఏ2లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వైద్య సేవలకు సిద్ధంగా డా.ఎంసిఆర్ టిమ్స్

### త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

### వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు8:** ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) సిద్ధంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి వెల్లడించారు. హాస్పిటల్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లు, మౌలిక వసతులు, వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది, భద్రత, ఇతర సహాయక వ్యవస్థలను పరిశీలించేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను సందర్శించారు. హాస్పిటల్‌లోని ఏ,బి,సి బ్లాకులను మంత్రి పరిశీలించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడి సేవల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, ప్రారంభానికి ముందు పూర్తి చేయాల్సిన పనులు, అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. మిగిలిన అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, హాస్పిటల్‌ను పూర్తిస్థాయి సేవలకు సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. హాస్పిటల్ ప్రారంభమైన రోజు నుంచే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేసేలా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. హాస్పిటల్‌లో వైద్య సేవల నిర్వహణ, మౌలిక వసతులు, మానవ వనరులు, నాన్‌మెడికల్ సర్వీసులు, విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం, భద్రత, ఫైర్ సేఫ్టీ, ఇతర వ్యవస్థలపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని ప్రతి విభాగం ప్రారంభానికి ముందే పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని సహాయక సేవలు కూడా నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సెయిలింగ్ ఇంటర్నేషనల్ పోటీలో రజతం గెలుచుకున్న ఎంజెపిటి విద్యార్థిని రిష్విత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు8:**జూలై 30 నుండి ఈనెల 7 వరకు వరకు ఇటలీలోని గార్డా సరస్సు వద్ద జరిగిన సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్(ప్రమోషనల్ క్లాస్)లో ఎం.జె.పి.టి కామారెడ్డి 10వ తరగతి విద్యార్థినీ ఎస్.రిష్విత రజత పతకం గెలుచుకుంది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.మాధవి మాట్లాడుతూ విద్యార్థినుల అంకితభావం, సమయ పాలన, సమిష్టి కృషితో తెలంగాణకు, భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టారని అన్నారు.ఎం.జె.పి.టి సెక్రటరీ బి. సైదులు ప్రత్యేక కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. సాంకేతిక అంశాలపై శిక్షణ ఇప్పించడం వలన, పోటీలకు విద్యార్థులకు ఎన్నో అవకాశాలను అందించారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయం మరింతమంది యువ నావికులకు స్ఫూర్తి నిస్తుందని అలాగే మరిన్ని అంతర్జాతీయ విజయాలకు నాంది పలుకుతుందని బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, బి.సి.సంక్షేమ శాఖ కార్యదర్శి సైదులు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, ఆర్ సి ఓ సత్యనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ పి.మాధవి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# సైబర్ నేరగాళ్లపై దేశవ్యాప్తంగా సిటీ సైబర్ క్రైం పోలీసుల దాడులు

### 15 రాష్ట్రాల్లో 49 మంది అరెస్టు, రూ.98.89 లక్షల జప్తు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించగా 49 మంది పట్టుబడ్డారు. ఈ సందర్భం గా వీరి వద్ద నుంచి 98.89 లక్షల రూపాయల నగదును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం.శ్రీనివాస్ శనివారం మీడియాకు వెల్లడించారు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేబట్టిన సిటీ సైబర్ క్రైం పోలీసులు 70 ఎఫ్ఐఆర్‌లు నమో దు చేశారు. ఇందుకు సంబంధించి వారం రోజుల పాటు దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాలలో సైబర్ క్రైం పోలీసులు నేరగాళ్లను పట్టుకునేందుకు దాడులు నిర్వహించారు. ఈ సందర్భం గా పట్టుబడ్డ 49 మంది నేరగాళ్లలో ట్రేడింగ్ మోసాల్లో 29 మంది, ఐదుగురు సోషల్ మీడియా కేసుల్లో వున్న వారు, డిజిటల్ అరెస్టు కేసుల్లో ముగ్గురు, వాట్సాప్ డిపి కేసుల్లో ముగ్గురు, మ్యాట్రిమోనియల్ కేసు ల్లో ఇద్దరు, ఎపికె ఫ్రాడ్స్, క్రిప్టో కరెన్సీ కేసుల్లో ఏడుగురు వున్నారు. అరెస్టయిన వారిలో తెలంగాణ నుంచి 13 మంది, మహారాష్ట్ర నుంచి ఏడుగురు, రాజస్తాన్ నుంచి ఆరుగురు, బె ంగాల్ నుంచి ఐదుగురు, యు పి నుంచి నలుగురు, బిహార్ నుంచి ముగ్గురు, ఢిల్లీ, హరియాణా, ఝార్ఖండ్‌ల నుంచి ఇద్దరేసి, ఎపి, కర్నాట క, ఒడిషా, పంజాబ్, ఉత్తర్‌ఖండ్‌ల నుంచి ఒక్కొక్కరు వున్నారు. నిందితుల వద్ద నుంచి 98.89 లక్షల రూపాయల నగదుతో పాటు 25 డెబి ట్ కార్డులు, 23 సెల్‌ఫోన్లు, తొమ్మిది చెక్ బుక్కులు, ఏడు పాస్ బుక్కులు, ఐదు రబ్బర్ స్టాంపులు, మూడు లాప్‌టాప్‌లు, రెండు పాన్‌కార్డులు జప్తు చేశారు. కాగా సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు పోలీ సు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం.శ్రీనివాస్ కోరారు. బాధితులు వెంటనే 1908కి ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

## డాన్సర్స్ యూనియన్‌తో ఫిల్మ్ ఫెడరేషన్ తెగతెంపులు

### టాలీవుడ్‌లోని 23 క్రాఫ్ట్స్ కూడా సహాయ నిరాకరణ

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** టాలీవుడ్‌లో విభేదాలు మరోసారి రోడ్డున పడ్డాయి. టాలీవుడ్ కొరియోగ్రాఫర్లు, డాన్సర్ల భవిష్యత్తును వివాదంలోకి నెడుతూ తెలుగు ఫిలిం ఫెడరేషన్ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తెలుగు చిత్రసీమలో డాన్సర్స్ అసోసియేషన్‌కు ఇకపై ఎలాంటి మద్దతు ఇవ్వబోమని ఫెడరేషన్ సంచలన ప్రకటనచేసింది. అలాగే సహాయ సహకారాలు అందించబోమని, తమ అనుబంధాన్ని పూర్తిగా తెంచుకుంటున్నామని అధికారికంగా ప్రకటించింది. డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వ్యవహరిస్తున్న శైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫెడరేషన్ ఒక లేఖను విడుదల చేసింది. డాన్సర్స్ యూనియన్ అధ్యక్షురాలు, ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ, ఫిల్మ్ ఫెడరేషన్, ఫిలిం చాంబర్ నిబంధనలను ధిక్కరిస్తున్నారని ఆరోపించింది. పరిశ్రమ ప్రయోజనాలను, ఫిలిం చాంబర్ మరియు ఫెడరేషన్ ఉమ్మడిగా తీసుకునే మార్గదర్శకాలను పూర్తిగా పక్కనబెట్టారని విమర్శించింది. మెగాస్టార్ చిరంజీవి సూచనలతో పాటు చాంబర్, ఫెడరేషన్ పెద్దలు ఏకాభిప్రాయంతో తీసుకున్న నిర్ణయాలను ధిక్కరిస్తూ ఆమె సొంత నిర్ణయాలతో ముందడుగు వేస్తున్నారని తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రకరకాల వివాదాల వల్ల సస్పెన్షన్‌కు గురైన సభ్యులను కూడా తిరిగి కలుపుకొని సమన్వయంతో పనిచేయాలని కౌన్సిల్ సమావేశంలో అధ్యక్షురాలికి స్పష్టమైన సూచనలు చేశామని, అయినప్పటికీ ఆమె తమ మాటలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఏకపక్షంగా ప్రవర్తించారని ఫెడరేషన్ స్పష్టం చేసింది.

ఈ దిగ్భ్రాంతికర పరిణామాల నేపథ్యంలో, తక్షణమే అమల్లోకి వచ్చేలా డాన్సర్స్ అసోసియేషన్‌కు ఫెడరేషన్ నుంచి లభించే అన్ని రకాల మద్దతును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై డాన్సర్స్ యూనియన్‌లో తలెత్తే ఎలాంటి వివాదాలు, అంతర్గత సమస్యలకు లేదా న్యాయపరమైన చిక్కులకు ఫెడరేషన్ బాధ్యత వహించదని తేల్చిచెప్పింది. ముఖ్యంగా సినీ కార్మికుల జీవితాలకు అత్యంత కీలకమైన వేతన ఒప్పందాలు (వేతన అగ్రిమెంట్లు), ఫిలిం చాంబర్‌తో జరిపే చర్చల ప్రక్రియలో ఫెడరేషన్ నుండి డాన్సర్లకు ఎలాంటి ప్రతినిధ్యం గానీ, మద్దతు గానీ లభించదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, టాలీవుడ్లోని మిగిలిన 23 క్రాఫ్ట్స్‌కు చెందిన అన్ని అనుబంధ యూనియన్లు కూడా ఫెడరేషన్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాయని, డాన్సర్స్ అసోసియేషన్‌కు పూర్తి స్థాయిలో సహాయ నిరాకరణ చేస్తాయని ప్రకటించారు. ఫెడరేషన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో తెలుగు చిత్రపరిశ్రమలో డాన్సర్ల భవిష్యత్తు, రాబోయే రోజుల్లో వారి వేతన సవరణలు మరియు ఉపాధి అవకాశాలు తీవ్రమైన అనిశ్చితిలో పడ్డాయి.

# గోదావరి ఒడ్డున మృతదేహాల మిస్టరీ!

**భద్రాచలం, ఆగస్టు 8, ప్రభాతవార్త:** గోదావరి తీరం వరుసగా గుర్తుతెలియని మృతదేహాలకు వేదికగా మారడం ఆందోళన కలిగిస్తోంది. భద్రాచలం పరిధిలో శుక్రవారం, శనివారం రెండు రోజుల వ్యవధిలో ఇరువైపులా గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. శుక్రవారం లభించిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించడంతో అది ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరుకు చెందిన వ్యక్తిదిగా తేలినట్లు సమాచారం. అయితే శనివారం సారపాక వైపు గోదావరి బ్రిడ్జి సమీపంలో లభించిన మరో మృతదేహం ఎవరిదనే విషయం ఇంకా తెలియరాలేదు. దీంతో ఈ రెండు ఘటనలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**బ్రిడ్జి వద్ద మృతదేహం**

భద్రాచలం గోదావరి బ్రిడ్జి సారపాక వైపు మూడో నంబర్ పిల్లర్ సమీపంలో శనివారం గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభించింది. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మృతుడు బూడిద రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు, నీలిరంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించేందుకు కుటుంబ సభ్యులు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

**వైకుంఠధామం వద్ద మరో శవం**

ఇదే సమయంలో భద్రాచలం గోదావరి ప్రవాహంలో కొట్టుకొచ్చిన మరో గుర్తుతెలియని మృతదేహం వైకుంఠధామం సమీపంలోని ఒడ్డుకు చేరింది. ఈ మృతదేహం వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు ఛాయతో, చిన్న బట్టతల, తెల్లటి జుట్టు, సుమారు ఐదు అడుగుల ఎత్తు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సిమెంట్ రంగు షర్టు, ఆకుపచ్చ రంగు షార్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు.

**ఒకటి తేలింది.. మరొకటి మిస్టరీ**

శుక్రవారం భద్రాచలం గోదావరి పరిసరాల్లో లభించిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించినట్లు సమాచారం. అది తిరువూరుకు చెందిన వ్యక్తిదిగా నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ కేసులో మృతుడి గుర్తింపు సమస్య కొంతవరకు తొలగింది. అయితే శనివారం సారపాక వైపు లభించిన మృతదేహం మాత్రం ఇంకా గుర్తు తెలియని వ్యక్తిగానే ఉంది.

**వరుస ఘటనలపై అనుమానాలెన్నో!**

రెండు రోజుల వ్యవధిలో గోదావరి ఇరువైపులా మృతదేహాలు లభించడంతో స్థానికంగా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి ఉద్ధృతి, ప్రవాహ వేగం కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి మృతదేహాలు కొట్టుకొచ్చే అవకాశం ఉందా? నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన వారివా? లేక ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు వీటికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణాల్లో పరిశీలన సాగుతోంది. అయితే పోస్టుమార్టం, దర్యాప్తు పూర్తయ్యే వరకు మరణానికి కారణం ఏమిటనేది నిర్ధారణ కాలేదు.

**మిస్సింగ్ కేసులే కీలకం**

మృతదేహాల గుర్తింపులో ఎగువ, దిగువ ప్రాంతాల్లో నమోదైన మిస్సింగ్ కేసులు కీలకంగా మారనున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్లలో ఇటీవల నమోదైన అదృశ్యం కేసులను పరిశీలించి, మృతుల వయస్సు, దుస్తులు, శారీరక ఆనవాళ్లతో సరిపోల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదులు, సమాచారం సేకరించడంతో పాటు మృతదేహాల వివరాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సారపాక వైపు లభించిన మృతదేహానికి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉంటే బూర్గంపాడు పోలీసులను సంప్రదించాలని ఎస్సై మేడా ప్రసాద్ కోరారు. అలాగే వైకుంఠధామం వద్ద లభించిన మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే భద్రాచలం టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.బూర్గంపాడు ఎస్సై: 8712682055అదనపు ఎస్సై: 8712682057 భద్రాచలం టౌన్ ఎస్‌హెచ్ఓ: 8712682105, 8712682160

## అమరావతిలో భవనాల అనుమతి ఫీజుల్లో రాయితీ

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పర్యావరణహిత భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు అభివృద్ధి, అనుమతి ఫీజుల్లో భారీ రాయితీలను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు కేవలం బహుళ అంతస్తుల భవనాలకే పరిమితమైన ఈ రాయితీలను, ఇకపై చిన్న భవనాలు, సాధారణ వాణిజ్య, నివాస సముదాయాలకు కూడా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన గ్రీన్ బిల్డింగ్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఈ విషయాలను వెల్లడించారు. హరిత భవనాల నిర్మాణానికి సంబంధించి ఐజీబీసీ ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం డెవలప్‌మెంట్ ఫీజుల్లో రాయితీలు కల్పిస్తోందన్నారు. ప్లాటినం రేటింగ్ సాధించిన భవనాలకు 20 శాతం రాయితీ గోల్డ్ రేటింగ్ సాధించిన భవనాలకు 15 శాతం రాయితీ సిల్వర్ రేటింగ్ సాధించిన భవనాలకు 10శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతిని అత్యుత్తమ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు సీఆర్‌డీఏ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని కమిషనర్ విజయరామరాజు తెలిపారు. కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు రాజధానిలో ఏకంగా మూడు వేల కిలో మీటర్ల మేర వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. 30 నుంచి 35 శాతం విస్తీర్ణాన్ని కేవలం జలాశయాలు, పచ్చదనం జోన్లకే కేటాయించారని చెప్పారు. ఐజీబీసీ అమరావతి చాప్టర్ ఏర్పాటు కోసం సీఆర్‌డీఏ ఇప్పటికే రాజధానిలో స్థలం కేటాయించిందని, అక్కడ ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ బిల్డింగ్ నిర్మించి ఆదర్శంగా నిలవాలని సీఆర్‌డీఏ అధికారులు సూచించారు.

# బడుగుల ఎదుగుదలకు టిడిపి పునాది: మంత్రి సవిత

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాలు అన్ని రంగాల్లో ఎదగడానికి తెలుగుదేశం పార్టీయే పునాది వేసిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ రెండేళ్లలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి వేగవంతంగా సాగుతున్నాయన్నారు. వైసీపీ రెచ్చగొట్టే రాజకీయాలను బడుగువర్గాలు తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి దూరదృష్టి వల్లే నేడు దేశంలోనే అత్యధికంగా పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలివస్తున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఎక్కువగా లబ్ధి పొందేది బడుగు, బలహీన వర్గాల యువతేనని తెలిపారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం పెట్టిన మొదటి సంతకం మెగా డిఎస్సీ పైనే. కుల మతాలకు అతీతంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఈ మెగా డిఎస్సీ ద్వారా వేలాది



శనివారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

మంది బీసీ, నిరుపేద నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించి లబ్ధి పొందారన్నారు. రాష్ట్ర భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే, అలజడులు రేపే గొడ్డలి పార్టీ ని ప్రజలంతా కలిసి శాశ్వతంగా భూస్థాపితం చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో, విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులు నిర్మిస్తూనే ఒకవైపు రైజింగ్ రాయలసీమ మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి సవిత తెలిపారు. జగన్ శ్రీకాకుళం పర్యటనలో వైసీపీ నేత చింత రవి ఏకంగా విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా పోలీసుపైనే దౌర్జన్యానికి పాల్పడితే, మాజీ మంత్రి అంబటి రాంబాబు చట్టాన్ని గేలిచేస్తూ పోలీసులపై నిత్యమూ దాడికి దిగుతున్నారన్నాని మంత్రి సవిత మండిపడ్డారు.

## కార్మికుడి మరణంపై వరల్డ్ బ్యాంకు బృందం అసహనం

### విచారణకు ఇద్దరు అధికారులతో కమిటీ

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పనుల్లో మట్టి పెళ్లలు విరిగిపడి కార్మికుడు మృతి చెందడంపై ప్రపంచ బ్యాంకు బృందం అసహనం వ్యక్తం చేసింది. పనుల్లో కార్మికుల రక్షణ కోసం ఒప్పందం ప్రకారం చర్యలు తీసుకోవడం లేదని తెలిపింది. ఇటీవల అమరావతి పనుల పరిశీలనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు బృందం ముందుగా దొండపాడులోని ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. అక్కడ లేఅవుట్ పనుల్లో మట్టి పెళ్లలు విరిగిపడి ఇటీవల యువ కార్మికుడు మృతి చెందాడు దీనిపై ప్రపంచ బ్యాంకు ఏర్పాటు చేసుకున్న స్వతంత్ర దర్యాప్తు సంస్థ నివేదిక పంపింది. దీనిపై అధికారులిచ్చిన వివరణకు సంతృప్తి చెందకపోవడంతోపాటు అక్కడి సమీక్ష సమయంలో కార్మికుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని పేర్కొంది. ఇప్పటి వరకూ సమర్పించిన నివేదికల ప్రకారం చూస్తే కార్మికుడి మరణం జరగకూడదని, అలా ఎందుకు జరిగిందో సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది. పని ప్రదేశంలో కార్మికుల రక్షణకు నిధుల విడుదలకు సంబంధం ఉండటంతో ప్రభుత్వం వెంటనే కారణాలను అన్వేషించే పనిలో పడింది. ప్రపంచ బ్యాంకు నుండి తీసుకున్న అప్పునకు సంబంధించి విధించిన షరతుల్లో భాగంగా ఒప్పందం చేసుకున్న డిస్బర్స్మెంట్ లింక్డ్ ఇండికేషన్ (డిఎల్ఐ)లో ఈ అంశం కూడా ఉండటంతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు దీన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. దీంతో మొత్తం విచారణ కోసం ఎడిసిఎల్ చీఫ్ ఇంజినీరుతోపాటు మరో అధికారితో కలిపి ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొంది.




విజయవాడ- వాడపల్లి పర్యాటక బస్సును ప్రారంభిస్తున్న ఎపిటిడిసి జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

## విజయవాడ-వాడపల్లి ఒక రోజు టూర్ ప్యాకేజీ ప్రారంభం

### జండా ఊపి ప్రారంభించిన ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

**విజయవాడ.ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వ ర్యంలో విజయవాడ - వాడపల్లి పర్యాటక బస్సును శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రం వద్ద ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు, పర్యాటకులకు అధునాతన సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించటంలో భాగంగా ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన అన్నారు. ప్రతీ శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటుందన్నారు. ప్యాకేజీ ధరపెద్దలకు రూ.1,160/,పిల్లలకు రూ. 1,000/ గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు మరియు పర్యాటకులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని టి ఎస్ వి నారాయణ తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలు 15లోగా పరిష్కరించాలి

### లేకుంటే ఉద్యమమే: ఎపి జెఎసి అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు




శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, నాయకులు దామోదర్, పాండురంగరాజు, లక్ష్మి, విజయలక్ష్మి తదితరులు

**విజయవాడ, ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 95 శాతం ఉద్యోగులకే సరిపోతోందని శ్వేతపత్రంలో ప్రభుత్వం చెప్పడం సరికాదని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, కన్వీనరు దామోదర్, అసోసియేట్ చైర్మన్ పాండురంగరాజు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్, లక్ష్మి, సెక్రెటరీ జనరల్ విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత నెలలో జరిగిన చర్చల తర్వాత సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్న తరుణంలో ఇలాంటి ప్రచారం చేయడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవ దూరంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆదాయంపై ఈ నెల నాలుగో తేదీన ప్రకటించిన శ్వేతపత్రం ఉద్యోగులను తీవ్ర విస్మయానికి గురిచేసిందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇస్తూ ప్రభుత్వ ఖర్చు అంటూ పేర్కొనడాన్ని తప్పు పట్టారు. 2024 నుంచి పదవీ విరమణలు భారీగా పెరిగాయని ఇంతవరకు 41 వేల మందికి పైగా రిటైర్ అయ్యారని చెప్పారు. 2032 నాటికి లక్షా 33 వేల మంది రిటైర్ కాబోతున్నారని కొత్త నియామకాలు లేవని, ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్క ఉద్యోగే చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈనెల 15లోగా ఉద్యోగుల ఆర్థిక సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర ఉద్యమ కార్యచరణ తథ్యమని ఏపీ జేఏసీ అమరావతి నేతలు స్పష్టం చేశారు. హెల్త్ కార్డులు ఆసుపత్రుల్లో పని చేయడం లేదు. 60 రోజుల్లో పరిష్కరిస్తామని స్వయంగా సీఎం చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. సీనియర్ అధికారుల సేవలను ప్రభుత్వం కన్సల్టెంట్లుగా వాడుకోవడాన్ని తాము వ్యతిరేకించబోమని, కానీ వారిని ప్రమోషన్ పోస్టుల్లో కొనసాగించడం వల్ల కిందిస్థాయి ఉద్యోగులు పదోన్నతులు కోల్పోతున్నారన్నారు.

## ఐఎఎస్ అధికారి మంజులే బాలాజీ దిగంబర్ బదలీ

**విజయవాడ.ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి :** స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఐఆర్‌డి) అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్న బాలాజీ దిగంబర్ బదలీ చేసింది. తక్షణమే ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని ఏపీ సర్కార్ స్పష్టంచేసింది. తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీకి రి పోర్ట్ చేయాలని ఆదేశించింది. ఎస్ఐఆర్‌డి అదనపు డైరెక్టర్ పోస్టుకు ఇన్‌చార్జి ఏర్పాట్లు చేయాలని ఈ మేరకు జీఓ ఆర్‌టీ నంబర్ 1540 జారీ చేసింది.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

**విజయవాడ, ఆగస్టు8 ప్రభాతవార్త:** భారత రతన్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యజన్మదినమైన సెప్టెంబర్ 15వ తేదీని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగుల సమస్యలపైనా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రావు అధ్యక్షతన విజయవాడలో శనివారం జరిగింది. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బి.డి. శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు కనపర్తి సంగీతరావు, గౌరవ సలహాదారులు మురళీకృష్ణ నాయుడు, రాష్ట్ర కార్యవర్గం27 జిల్లాల కార్యవర్గ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 800 మంది సెక్షన్ అధికారులు పోస్టులనువెంటనే భర్తీ చేయాలని, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలోసెక్షన్ ఆఫీసర్స్, సహాయక సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నందున, పని ఉత్తిడి అధికంగా ఉన్న కారణంగా 2200 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీర్ఘకాలంగా పని చేస్తున్న సైట్ ఇంజనీర్లను రెగ్యులర్ చేయా లని విజ్ఞప్తి చేశారు. సెక్షన్ ఆఫీసర్లకు రవాణా భత్యంను మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## రైతులు కరవుతో అల్లాడుతుంటే, ప్రభుత్వం కబుర్లతో కాలక్షేపం: వైఎస్ షర్మిల

**విజయవాడ.ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఏపీ పీసీసీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ "ఎక్స్" వేదికగా ఆమె తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థి తులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి




జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరి స్తోందని షర్మిల ఆరోపించారు. ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరఫున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.

# ఆదివాసీ సంఘాల ఏజెన్సీ బంద్ విజయవంతం



**పోలవరంజిల్లా ప్రతినిధి,ఆగస్టు 8 ప్రభాతవార్త:** ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదివాసీ సంఘాలు చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతం అయింది. ఏజెన్సీలోని అనేక జిల్లాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో ఆదివాసి సంఘాల సంపూర్ణ బంద్‌ను నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. 1/70 చట్టం సవర్ణ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ పై కౌంటర్ పిటిషన్ ప్రభుత్వం దాఖలు చేయాలని, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు అధికారంలోకి వస్తే 100ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం, చింతూరు డివిజన్ కేంద్రంలో రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతం అయ్యింది. ఏజెన్సీలో మారుమూల గ్రామాల నుండి పెద్దసంఖ్యలో ఆదివాసిలు రోడ్లపైకి వచ్చి ఆదివాసి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ రిజర్వేషన్ హామీని అమలు చేయాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం పరిహారం చెల్లించాలని, 1/70 చట్టం సవ రణ పిటిషన్ పై రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీట్ పిటిషన్ దా ఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఉన్న విలువైన ఖనిజ సంపద, సహజ వనరులు, ప్రభు త్వం కారు చౌకగా పెట్టుబడిదారులకు దోచి పెట్టాలని చూస్తున్నాయని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసి హక్కులు, చట్టాలు నిర్వీర్యం చేస్తుందని, రాజ్యాంగ బద్ధంగా 5వ,6వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు, ఏజెన్సీ ప్రాంతంలోని సర్వముఖ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్రపతి చట్టాలను రూపొందించి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

## మార్కాపురంలో మహిళపై కత్తితో దాడి



**మార్కాపురం టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** మార్కాపురంలోని విజయ టాకీస్ సమీపంలోని బాసాని బజారులో ఓ మహిళపై యువకుడు కూరగాయలు తరిగే కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. జ్ఞాన దృష్టి నాగలక్ష్మి (40), భర్త రాము, ఇంట్లో వంట చేసుకుంటుండగా బైసాని మురళి (22) పసుపు కావాలంటూ వచ్చి కత్తితో ఆమెపై సుమారు ఎనిమిది సార్లు దాడి చేసినట్లు సమాచారం. నాగలక్ష్మి కేకలు వేయ డంతో స్థానికులు అక్కడికి చేరుకోగా మురళి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన నాగ లక్ష్మిని స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆసు పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దేవుని పేరుపై తాత్సారం ఎందుకో!?

### తిరుపతి విమానాశ్రయానికి 'శ్రీవేంకటేశ్వర'గా మార్పు ఏదీ !

### టిటిడి బోర్డు ప్రతిపాదనలకు యేడాదిన్నర దాటినా దిక్కేలేదు..

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిచెందిన తిరుపతి-తిరుమల చేరుకునేందుకు ప్రధాన విమానాశ్రయం రేణిగుంటలోని తిరుపతి విమానాశ్రయంకు "శ్రీవేంకటేశ్వర"స్వామి పేరు పెట్టాలని ఏడాదిన్నర క్రిందట టిటిడి బోర్డు ప్రతిపాదనలు ఇప్పటికీ అమలుకునోచుకోలేదు. దేశ రాజధాని ఢిల్లీనుండేగాక హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగుళూరు వంటి ప్రధాన నగరాలనుండి ప్రతి రోజూ పదిహేనువరకు విమానాలు తిరుప తికి ఉన్నాయి. ఈ విమానాలన్నీ కేంద్రప్రభుత్వ ఆధీనంలోని విమానయానశాఖ ఆధ్వర్యం లోనే నడుస్తున్నాయి. ప్రతిరోజూ వేలాదిమంది ప్రయాణీకులు తిరుమలకు వస్తుండటం విశేషం. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమేగాక తిరుపతి చుట్టుపక్కల ప్రాం తాల్లో వివిధ రకాల వ్యాపారాలు, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరుల నుండి కూడా వ్యాపారవేత్తలు తిరుపతికి వస్తున్నారు. ఇలా తిరుమల పుణ్యక్షేత్ర ప్రాధాన్యతతో తిరుపతికి ఎయిర్ ఇండియా సంస్థతో బాటు పలు ప్రైవేట్ సంస్థలు విమానాలను నడుపుతున్నాయి. ఇక్కడకు నిత్యం విమానాల్లో విచ్చేస్తున్న యాత్రికుల సంఖ్య కూడా రెట్టింపయిందనేది విమానాశ్రయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో రేణిగుంటలోని తిరుపతి విమానాశ్రయంకు "శ్రీవేంకటేశ్వర"విమానాశ్రయంగా నామకరణం (పేరు మార్చాలని)చేయాలని 2025 జూన్‌లో టిటిడి ధర్మకర్తలమండలి నిర్ణయించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా విమానాశ్రయం డిజైన్‌ను కూడా మార్చాలని నిర్ణయించారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా కేంద్రానికి ఈ సిఫార్సులు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. కేంద్రవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆంధ్రప్రదేశ్‌నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నా పేరుమార్పుపై మాత్రం గెజిట్ రూపొందించలేకపోతున్నారనే అసహనం రాష్ట్రప్రజల్లో ముఖ్యంగా శ్రీవారి భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని పలు విమానాశ్రయాలు తిరుపతి ఎయిర్‌పోర్టుతోబాటు విజయవాడ విమానాశ్రయంకు నందమూరి తారకరామారావు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయంకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేర్లను ప్రతిపాదించారు. ఇవేవీ ఇప్పటికీ మార్పుకాలేదనేది జనంలో చర్చ. ప్రపంచప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలచెంతన రేణిగుంటలో




విమానాశ్రయం నెలకొల్పారు. రేణిగుంట విమానాశ్రయానికి స్వామి వారి పేరున అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు మార్చడం, తిరుమలకు ఐకానిక్‌గా విమానాశ్రయానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా చేసిన టిటిడి బోర్డు సిఫార్సులు మాత్రం ఆచరణకు నోచుకోలేదు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ జిల్లా వాసి కావడం, ఆయన కూడా శ్రీవేంకటేశ్వరస్వామి ప్రియభక్తుడుగా ఉండటంతో ఈ విషయంపై త్వరగా కీలక నిర్ణయం తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# తిరుమల సమాచారం



## వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** వరుససెలవులు.. వారాంతం కలసి రావ డంతో దేశం నలుమూలల నుండి భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వారాంతం వరుసగా రెండవశని, ఆదివారాలు తెలంగాణాలో సోమవారం కూడా సెలవు రావడంతో శనివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. వేలాదిమంది వెలుపల క్యూలైన్లలో బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వారాంతం ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటున్నారు. భక్తజనంతో నిజంగానే కలియుగవైకుంఠం భక్తజనసంద్రంగా మారింది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రివరకు 75,533మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు.



## బ్రహ్మోత్సవాలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు

### సెప్టెంబర్ 19న గరుడసేవకు భక్తులకు సాఫీగా మార్గాలు

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లను ముందస్తుగా పటిష్టం చేసుకుంటున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల డిఎస్పీ కె.విజయ శేఖర్, విఎస్ఒ అల్లం సురేంద్ర, తిరుమల పోలీసు అధికారులు, విజిలెన్స్ సెక్యూరిటీ అధికారులు శనివారం మధ్యాహ్నం తిరుమలలో కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సెప్టెంబర్ 19న జరిగే గరుడసేవ రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తుల రాకపోకలు సజావుగా సాగడంతో బాటు, అవసరమైన సమయంలో భక్తులను సురక్షి తంగా బయటకు తరలించే విధంగా నిష్క్రమణ ప్రణాళికపై ప్రధానంగా చర్చించారు. ఇందులో లేపాక్షి కూడలి, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్, ఎస్ఎంసి, సుపథం, రాగిమానుకూడలి ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీనియంత్రణ, రాకపోకల నిర్వహణ, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షి ంచారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు మరియు అత్యవసర పరిస్థితుల నిర్వహణపై సమగ్ర ప్రణాళికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



## వైభవంగా కోదండరాముని పవిత్రోత్సవాలు

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు, అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల నివృత్తికి, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం సీతారామ సమేత లక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం యాగశాలలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పవిత్ర అభిషేకం నిర్వహించారు. అనంతరం శాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మంగళ విహారాన్ని భక్తులు భక్తిపారవశ్యంతో తిలకించారు. శనివారం రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నేడు ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ బి. నాగరత్న, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# మునగాకు రుచులు

మునగాకంటే ఆషామాషీ అనుకున్నారా? అదేంకాదు. మునగాకు తింటే శరీరమంతా ఆరోగ్యంగా ఉన్నట్లే! అది బలాన్నిస్తుంది, రోగనిరోధకశక్తిని పెంచుతుంది. ఈ కాలంలో వచ్చే అనారోగ్యాల నుంచి కాపాడుతుంది. అంత మంచి మునగాకుతో ఈ వెరైటీలు చేసి చూడండి. !

## థోరన్..

**కావలసినవి :** మునగాకు–4 కప్పులు, కొబ్బరి తురుము–కప్పు, ఉల్లిపాయ ముక్కలు– కప్పున్నర, ఉప్పు–రుచికి సరిపడా, ఆవాలు, జీలకర్ర, పసుపు, వెల్లుల్లి తరుగు–చెంచా చొప్పున, నూనె–2 టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి–3, కరివేపాకు–2 రెబ్బలు.



**తయారీ :** మునగాకునుకడిగి నీళ్లు లేకుండా వడకట్టాలి. మిక్సీ జార్‌లో కొబ్బరి తురుము, అరకప్పు ఉల్లిముక్కలు, పసుపు, వెల్లుల్లి తరుగు, ఎండుమిర్చి వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు వేయాలి. అవి చిటపట లాడతున్నప్పుడు జీలకర్ర, కరివేపాకు, మిగిలిన ఉల్లిముక్కలను జోడించాలి. అవి కాస్త వేగాక.. మునగాకు, ఉప్పువేసి మగ్గనివ్వాలి. మధ్యమధ్యలో కలియబెడుతూ.. పది నిమిషాల తర్వాత కొబ్బరి మిశ్రమం జత చేయాలి. ఇంకో ఏడు నిమిషాల తర్వాత దించేస్తే.. ఘుమఘుమలాడే 'మునగాకు థోరన్' సిద్ధం.

## మఖానా...

**కావలసినవి :** ఫుల్ మఖానా– కప్పు, మునగాకు పొడి–టేబుల్ స్పూన్, నెయ్యి–రెండు చెంచాలు, ఛాట్ మసాలా–అర చెంచా, ఉప్పు–రుచికి సరిపడా.



**తయారీ :** కడాయిలో మఖానాను కలియ తిప్పుతూ సన్న సెగ మీద వేయించాలి. నాలుగైదు నిమిషాల తర్వాత ఒకటి చేతిలోకి తీసుకుని నొక్కిచూడండి. సాగకుండా విరిగితే చక్కగా వేగినట్లు. వీటిని గిన్నెలోకి తీసి..అదే కడాయిలో నెయ్యి, మునగాకు పొడి, ఛాట్ మసాలా, ఉప్పు, వేయించిన ఫుల్ మఖానా వేసి..నిమిషం వేయించి దించేయండి. ఇది వేడిగా ఉన్నప్పుడే కరకరలాడుతూ రుచిగా ఉంటుంది. తర్వాత తినాలనుకుంటే గాలి చొరబడని సీసాలో భద్రం చేయాలి.

## పప్పు...

**కావలసినవి :** కందిపప్పు, మునగాకు–కప్పు చొప్పున, ఉల్లి తరుగు– అరకప్పు, చింతపండు– నిమ్మకాయంత, పచ్చిమిర్చి ముక్కలు–టేబుల్ స్పూన్, ఉప్పు–రుచికి సరిపడా, పసుపు–అర చెంచా, ఎండు మిర్చి–2, కరివేపాకు–4 రెబ్బలు, వెల్లుల్లి తరుగు– ముప్పావు చెంచా, ఆవాలు, శనగ పప్పు, మినపప్పు, జీలకర్ర–చెంచా చొప్పున, ఇంగువ–అర చెంచా.



**తయారీ :** కందిపప్పు, మునగాకులను రెండు కప్పుల నీళ్లు పోసి కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. ఆవిరి పోయిన తర్వాత మూత తెరిచి చారు గరిటెతో మెత్తగా మెదపాలి. దీనికి కొన్ని నీళ్లు, చింతపండు గుజ్జు, పసుపు, ఉప్పు, జోడించి ఉడికించాలి. రెండు పొంగులు వచ్చాక దించేయాలి. ఇప్పుడు ఆవాలు, శనగపప్పు, మినపప్పు,జీలకర్ర, వెల్లుల్లి, తరుగు, ఎండుమిర్చి కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేస్తే సరి. రుచికరమైన మునగాకు పప్పు రెడీ.


## ఆలూ సబ్జీ



**కావలసినవి :** మునగాకు–2 కప్పులు, బంగాళదుంపలు–3, ఉల్లితరుగు–పావు కప్పు, నూనె–2 టేబుల్ స్పూన్లు, ఉప్పు–రుచికి సరిపడా, తరిగిన పచ్చిమిర్చి–టేబుల్ స్పూన్, వెల్లుల్లి తరుగు–చెంచా, జీలకర్ర–ఒకటిన్నర చెంచా, గరం మసాలా– అర చెంచా, కారం– ముప్పావు చెంచా, పసుపు,ఇంగువ– పావు చెంచా చొప్పున. **తయారీ :** బంగాళదుంపలు చెక్కు తీసి, అంగుళమత ముక్కలు కోయాలి. కడాయిలో నూనె వేడయ్యాక జీలకర్ర.. అది వేగాక.. పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి తరుగు, ఇంగువ, ఉల్లిపాయ ముక్కలు ఒక్కొక్కటిగా వేయాలి. ఉల్లి దోరగా వేగిన తర్వాత బంగాళదుంప ముక్కలు, పసుపు, ఉప్పు వేసి వేయించాలి. నాలుగు నిమిషాల తర్వాత మునగాకు జతచేసి.. మధ్యమధ్యలో కలియ తిప్పుతూ ఇంకో ఆరేడు నిమిషాలు వేయించాలి. చివర్లో కారం, గరంమసాలా జోడించి కలియ బెట్టి దించేస్తే సరిపోతుంది.

## పచ్చడి..

**కావలసినవి :** మునగాకు, కొబ్బరి తురుము–కప్పు చొప్పున, పచ్చిమిర్చి–8, అల్లం ముద్ద–చెంచా, ఉప్పు–రుచికి సరిపడా, నూనె–2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం–రెండు చెంచాలు, ఆవాలు, జీలకర్ర–చెంచా చొప్పున, కరివేపాకు–2 రెబ్బలు, ఇంగువ–పావు చెంచా, **తయారీ :** కడాయిలో ఒక టేబుల్ స్పూన్ నూనె కాగనిచ్చి పచ్చి మిర్చి, మునగాకులను ఒక నిమిషం వేయించాలి. ఎక్కువ వేగకూడదు. చల్లారిన తర్వాత మిక్సీ జార్‌లో వేసి.. కొబ్బరి తురుము, అల్లం ముద్ద, ఉప్పు, అర కప్పు నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. మిగిలిన నూనె వేడిచేసి.. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేసి, నిమ్మరసం కలిపితే సరి.. వహ్వా అనిపించే మునగాకు పచ్చడి తయారైపోతుంది.




## పరోటా...



**కావలసినవి :** గోధుమపిండి, మునగాకు–కప్పు చొప్పున, అల్లం ముద్ద–చెంచా, ఉప్పు–రుచికి సరిపడా, జీలకర్ర, కారం, గరం మసాలా– అర చెంచా చొప్పున, వాము, పసుపు– పావు చెంచా చొప్పున, నూనె–చెంచా, నెయ్యి–2 టేబుల్ స్పూన్లు.
**తయారీ :** మునగాకు కడిగి, పావుగంట నీళ్లలో ఉంచి, తర్వాత నీళ్లు తీసేయాలి. ఒక వెడల్పాటి పాత్రలో గోధుమపిండి, మునగాకు, అల్లం ముద్ద, ఉప్పు, జీలకర్ర, కారం, గరం మసాలా, వాము, పసుపు, నూనె వేసి కొన్ని నీళ్లతో బాగా కలపాలి. ఈ పిండిని ఒక అరగంట పక్కనుంచి, మరోసారి కలిపి.. చపాతీల కంటే కొంచెం మందంగా రొట్టెలు వత్తుకోవాలి. అన్నీ అయ్యాక.. పెనం వేడిచేసి.. నెయ్యితో పరోటాలను రెండు వైపులా కాల్చుకోవాలి. వీటికి చెట్నీ లేదా గ్రేవీ ఏదైనా బాగుంటుంది. □

## ముఖమెంతో ఛాయ

వయసు పెరిగినా అందం తరిగిపోకూడదనే అందరూ కోరుకుంటారు. ఈ క్రమలోనే పలు చికిత్సలు తీసుకోవడంతో పాటు ఇంటి చిట్కాలూ పాటిస్తుంటారు. అయినా కొందరికి చిన్న వయసులోనే ముఖంపై ముడతలు, గీతలు.. వంటివి ఏర్పడు తుంటాయి. ఇలాంటి వృద్ధాప్య ఛాయల్ని దూరం చేయడంలో 'ఫేసియల్ కప్పింగ్' పద్ధతి చక్కగా దోహదం చేస్తుంది. బాడీ కప్పింగ్‌ను పోలి ఉన్నా.. ఎన్నో విధాలుగా అందాన్ని ద్విగుణీకృతం చేసే ఈ పద్ధతిని పాటించే అమ్మాయిల సంఖ్య క్రమంగా పెరుగుతుందం టున్నారు. మరి, ఏంటీ ఫేషియల్ కప్పింగ్? సౌందర్య పోషణలో దీని పాత్రేంటి? తెలుసుకుందాం..





**బాడీ కప్పింగ్..** చాలామందికి తెలిసిన పద్ధతే! శారీరక నొప్పుల్ని దూరం చేసుకునేందుకు చాలా మంది ఈ చికిత్స తీసుకుంటారు. ఫేషియల్ కప్పింగ్' కూడా ఇలాంటిదే! కానీ దీని ప్రయోజ నాలు వేరుగా ఉం టాయి. చర్మానికి రక్తప్రసరణను పెంచి పునరుత్తేజితం చేసే ఈ సౌందర్య థెరపీతో వృద్ధాప్య ఛాయల్నీ దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. బాడీ కాప్పింగ్‌లో భాగంగా శరీరంపై కప్స్ అమర్చుకున్నప్పుడు మచ్చలు పడే అవకాశం ఎక్కువగా ఉన్నప్పటికీ. ఫేషియల్ కప్పింగ్‌లో ఈ సమస్య ఉండకపోవచ్చంటున్నారు. కప్పింగ్‌లో మాదిరిగానే ఫేషియల్ కప్పింగ్‌లోనూ సిలికాన్, గ్లాస్ మెటీరియల్‌తో రూపొందించిన వివిధ రకాల కప్స్ ఉపయోగిస్తారు. అయితే ఇవి కాస్తమృదువుగా ఉండడం వల్ల చర్మంపై మచ్చలు పడే అవకాశం చాలా తక్కువంటున్నారు నిపుణులు. ఫేషియల్ కప్పింగ్ కోసం ప్రత్యేకమైన కిట్స్ కూడా మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించి ఫేషియల్ కప్పింగ్ ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం.

ముందుగా ముఖాన్ని శుభ్రం చేసుకొని కాస్త తేమగా ఉండేలా తుడుచుకోవాలి. ఇప్పుడుచేతులు, మునివేళ్లతో ముఖంపై కాసేపు మర్దన చేసుకోవాలి. కొన్ని ఫేస్ ఆయిల్/ సీరమ్‌ని కూడా వాడచ్చు. దీనివల్ల కప్ మచ్చలు చర్మంపై పడకుండా జాగ్రత్తపడచ్చు. గడ్డం వల్ల నుంచి కప్పింగ్ థెరపీ మొదలుపెట్టాలి. గడ్డం వద్ద చిన్న కప్‌ని అమర్చుకోవాలి. కాసేపటి తర్వాత నోటి చుట్టూ అక్కడక్కడా కప్‌ని కొన్ని నిమిషాల చొప్పున అమర్చుకోవాలి. ఇలా ఆపై బుగ్గలు, నుదుటి వరకూ దశల వారీగా కప్‌ను అమర్చుకొని తొలగించుకోవాలి. బుగ్గలు, నుదురు వంటి విశాలమైన ప్రదేశాల్లో పెద్ద కప్స్‌ని కూడా ఉపయోగించచ్చు. ఇలా అవసరమైన ముఖ భాగాల్లో కప్పింగ్ చేసుకోవాలి. ముందుగా ఫేస్ ఆయిల్/సీరమ్ రాసుకున్న వాళ్లు కప్పింగ్ పూర్తయ్యాక ముఖం శుభ్రం చేసుకొని తడి పొడిగా ఉండేలా తుడుచుకోవాలి. ఆయిల్/సీరమ్ రాసుకోని వారు గోరువెచ్చటి నీటిని ముఖంపై చల్లుకొని తుడుచుకుంటే సరిపోతుంది. దీని వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకొని శ్వాసిస్తాయి. ఫలితంగా అందం ఇనుమడిస్తుంది. ఆపై మీ బ్యూటీ రొటీన్‌ని యథావిధిగా కొనసాగించచ్చు. ఫేషియల్ కప్పింగ్.. సౌందర్య పోషణలో భాగంగా ఉపయోగించే పదార్థాల్ని చర్మం మరింతగా శోషించుకునేలా ప్రేరేపిస్తుంది. అవగాహన ఉన్న వారు ఫేషియల్ కప్పింగ్‌ని ఇంట్లోనే స్వయంగా చేసుకోవచ్చు. లేదంటే నిపుణులు ఎందుకంటే సరైన పద్ధతిలో దీన్ని పాటించినప్పుడు సత్ఫలితాలు పొందవచ్చుంటున్నారు. □

### చిట్కా

స్నానమ్ నామా మనః ప్రసాధనకరం దుస్వప్న విధ్వంసకం స్నానం డిప్రెషన్‌ను తొలగిస్తుంది. ఇది చెడ్డ కలలనును దూరం చేస్తుంది. **స్నానం ఆచరేత్ భుక్త్వా:** ఆహారం తీసుకున్న వెంటనే స్నానం చేయకండి. జీర్ణక్రియ ప్రతికూలంగా ప్రభావితమవుతుంది. □

## మోక్ష గామిని కామికా ఏకాదశి



ఆషాఢ మాసంలో వచ్చే కృష్ణ పక్ష ఏకాదశిని కామిక ఏకాదశి అంటారు. పేరుకు తగ్గట్లే ఈ ఏకాదశి మనసులోని కోరికలను సిద్ధింప చేస్తుంది. ఇది శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వచ్చిన తర్వాత వచ్చే మొదటి ఏకాదశి కావడం వలన పవిత్రంగా భావించి స్వామిని పూజిస్తారు. కామిక ఏకాదశినాడు పాలు ఇచ్చే గోవును దూడతో సహా, గ్రాసం కలిపి దానం చేస్తే సమస్త దేవతల ఆశీర్వాదం లభిస్తుంది. ఈ రోజు ఉపవాసం ఉండటం, జాగరణ చేయడం, వెన్నను దానం చేయడం, తులసిమొక్క వద్ద నేతిదీపం వెలిగించటం శ్రేష్ఠం. కామిక ఏకాదశి విశిష్టత గురించి బ్రహ్మదేవుడు నారదుడికి, శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించినట్లు పౌరాణిక కథనాలున్నాయి. ఈ రోజు తులసి ఆకులతో విష్ణువును పూజిస్తే సర్వపాపాల నుంచి విముక్తులవు తారు, మోక్షం లభిస్తుంది అన్నది పురాణ వచనం. కామిక ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువుకు తులసి దళాలను సమర్పించడం అత్యంత శ్రేష్ఠమైన పూజగా పరిగణించబడుతుంది. తులసి సమర్పణ ద్వారా లభించే పుణ్యం బంగారం, వెండి వంటి విలువైన దానాల ద్వారా కూడా లభించదని ధార్మిక గ్రంథాలు వివరిస్తాయి. ఈ రోజున భక్తితో విష్ణుమూర్తిని ఆరాధించే వారికి మాత్రమే కాకుండా, వారి పితృదేవతలకు కూడా శ్రేయస్సు, మోక్షం కలుగుతుందని విశ్వాసం. కుటుంబంలో సుఖశాంతులు నెలకొని, దైవానుగ్రహం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. □

# తెర

## అందాల అరబొమ్మ !



కయాదు



## 'హాయ్' 28న గ్రాండ్ రిలీజ్


లేడీ సూపర్ స్టార్ నయనతార, కవిన్ తొలిసారి కలిసి నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఖహాయ్ఖ విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం ఆగస్టు 28న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. విష్ణు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నయనతార, కవిన్‌తో పాటు కె. భాగ్య రాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్, వీటీవీ గణేష్, సత్యన్, ఆదిత్య కథిర్, ఖురైషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ అందించగా, జెన్ మార్టిన్ సంగీతం సమకూర్చారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా, ఎస్. కన్నన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. జీ స్టూడియోస్, ది రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై నయనతార, విఘ్నేష్ శివన్, ఎస్.ఎస్.లలిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోద్ సి.జే., కె.ఎస్. మయిల్ వాగనన్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, వి.కె. కుబేంద్రన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు.ఇప్పటికే విడుదలైన తొలి పాటకు డిజిటల్ వేదికల్లో మిలియన్ల వ్యూస్ రావడంతో పాటు అద్భుతమైన స్పందన లభించింది. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌తో పాటు ఆగస్టు 28 విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.దర్శకుడు విష్ణు మాట్లాడుతూ, "హాయ్ టైటిల్‌లాగే ఇది ఒక సింపుల్, హార్ట్‌వార్మింగ్, ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. చెన్నై, కోయంబత్తూరు, పొల్లాచ్చి నేపథ్యాల్లో సాగే ఈ సినిమా కుటుంబం మొత్తం కలిసి థియేటర్‌లో చూసి ఆస్వాదించేలా రూపొందించాం.

## 'కొరియన్ కనకరాజు'కు అద్భుతమైన రెస్పాన్స్



ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుతూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు: సక్సెస్ ప్రెస్ మీట్‌లో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. ఆగస్టు 6న జరిగిన ప్రీమియర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆగస్టు 7న వరల్డ్ వైడ్ థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ప్రెస్ మీట్ లో హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. "నిన్న సాయంత్రం ప్రీమియర్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా అనిపించింది. మొదటి నుంచి ఈ సినిమాపై మాకు పూర్తి నమ్మకం ఉంది. కానీ మేము ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన ప్రేక్షకుల నుంచి వచ్చింది. ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. దర్శకుడు మేర్లపాక గాంధీ మాట్లాడుతూ: నాకు కావాల్సిన హిట్ ఖకొరియన్ కనకరాజుఖగా వచ్చింది. మొదటి నుంచి వరుణ్ తేజ్ ఈ సినిమాకు బ్యాక్‌బోన్‌లా నిలబడి ప్రతి విషయంలో అండగా ఉన్నారు. హీరోయిన్ రితిక నాయక్ మాట్లాడుతూ: తెలుగు ప్రేక్షకులు ఇస్తున్న ప్రేమ, ఆదరణకు చాలా ఆనందంగా ఉంది.నిర్మాత శిరీష్ మాట్లాడుతూ: కొరియన్ కనకరాజు టీమ్ మొత్తానికి అభినందనలు.

## 'అగధ' అద్భుతంగా ఉంటుంది: హీరో శ్రవణ్ రెడ్డి



**'డర్టీ హారి'తర్వాత ఇంత గ్యాప్ ఎందుకు వచ్చింది?..**
'డర్టీ హార్రి కరోనాలో రిలీజ్ అయింది. ఓటీటీలోకి నేరుగా వచ్చినా అక్కడ మాకు అద్భుతమైన రెస్పాన్స్ దక్కింది. ఆ టైంలోనే నాకు చాలా ఆఫర్స్ వచ్చాయి. కానీ కరోనా, లాక్డౌన్ కారణంగా ఆలస్యం అవుతూ వచ్చాయి. మంగళవారం సినిమా కోసం దాదాపు ఏడాది వెచ్చించాను. ఇక చివరకు మళ్లీ ఎంఎస్ రాజు గారు నాకు ఈ అగధ అవకాశాన్ని ఇచ్చారు.

**'అగధ'లో మీ పాత్ర తీరు గురించి చెప్పండి?..**
'డర్టీ హార్రికి పూర్తి భిన్నంగా 'అగధ్ల పాత్ర ఉంటుంది. చాలా పార్శ్వాలు ఉండేలా కారెక్టర్‌ను డిజైన్ చేశారు. చాలా షేడ్స్ ఉన్న ఈ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది. ఎంఎస్ రాజువంటి విజన్ ఉన్న ఫిల్మ్ మేకర్ మళ్లీ నాకు అవకాశం ఇవ్వడం చాలా లక్కీ అనిపిస్తుంది.'అగధ్ల నాకు ఎంతో ఛాలెంజింగ్‌గా, డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది.

**'అగధ' ట్రైలర్ చూస్తే మీదే నెగెటివ్ పాత్రలా కనిపిస్తోంది?..**
ఇందులో నెగెటివ్ పాత్ర అనేది ఉండదు. పరిస్థితుల వల్లే పాత్రలు అలా ప్రవర్తిస్తుంటాయి. గుడ్ వర్సెస్ బ్యాడ్, గాడ్ వర్సెస్ ఈవిల్ అన్నట్టుగా సాగుతుంది. నా పాత్ర కోసం హోం వర్క్ చేయడానికి గానీ, ప్రిపేర్ అవ్వడానికిగానీ నాకు టైం దొరకలేదు. కథ చెప్పిన నాలుగో రోజే సెట్ మీదకు వచ్చాను.

**''అగధ' విజయంపై, మీ పాత్రపై ఎలాంటి అంచనాలు న్నాయి?..**
అంచనాలు లేకుండాఎలా ఉంటాయి (నవ్వుతూ). 'డర్టీ హార్రి ఓటీటీలో సక్సెస్ అయింది. అయితే హీరోకి బాక్సాఫీస్ నంబర్లే ముఖ్యం. 'అగధ్ధతో నాకు ఆ బాక్సాఫీస్ స్టాంప్ వస్తుందని ఆశిస్తున్నాను.

**ఎం.ఎస్. రాజుతో మీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?..**
'డర్టీ హార్రి, అగధ కోసం ఎంఎస్ రాజు గారు రాసిన కథ, నా పాత్ర చాలా కొత్తగా అనిపిస్తుంది. ఎంఎస్ రాజు గారిని'అగధ్ల సెట్‌లో చూస్తే చాలా కొత్తగా కనిపించారు.

**అగధలో వీఎఫ్‌ఎక్స్ వర్క్ ఎలా ఉంటుంది?..**
'అగధ్ధ చిత్రాన్ని దాదాపు నేచురల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశారు. కొన్ని మాత్రం సెట్స్ వేశారు. ఈ మిస్టిక్, హారర్ ఫీల్‌ను ఇవ్వడానికి సెట్స్ వేయాల్సి వచ్చింది. మా సినిమాలోని వీఎఫ్‌ఎక్స్ వర్క్ చాలా నీట్‌గా, ఇంపాక్ట్ క్రియేట్ చేసేలా ఉంటుంది.

**అగధకి సీక్వెల్ గానీ ప్రీక్వెల్ గానీ ఉంటుందా?..**
ఇలాంటి చిత్రాలకు కచ్చితంగా అలాంటి సౌలభ్యం ఉంటుంది. పర్టిక్యులర్‌గా పార్ట్ 2 అని వేయకపోయినా.. కథను అల్లుకోవచ్చు.

## అంచనాలు పెంచేసిన విశాల్ 'మకుటం' ట్రైలర్



హీరోగా, దర్శకుడిగా విశాల్ చేస్తున్నతొలి చిత్రం మకుటంపై ఏర్పడిన హైప్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ మూవీ సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మాణంలో రూపుదిద్దుకుంది. ఈ సినిమాలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు అన్నీ కూడా ట్రెండ్ అయ్యాయి. ఇక తాజాగా విడుదల చేసిన ట్రైలర్ ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది.ఫుల్ యాక్షన్ మోడ్‌తో ట్రైలర్ ఓపెన్ చేయడం.. ఆ తర్వాత ఫ్యామిలీ ఎమోషన్స్‌కి షిఫ్ట్ అవ్వడం.. మూడు డిఫరెంట్ గెటప్స్‌లో విశాల్ తన మాడ్యులేషన్‌ను చూపిస్తుండటం ట్రైలర్‌కి హైలెట్‌గా నిలిచింది. మాస్‌కి కావాల్సిన యాక్షన్ సీక్వెన్స్, యూత్‌కి కావాల్సిన లవ్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కావాల్సిన ఎమోషన్స్ అన్నీ కూడా ఈ సినిమాలో ఉన్నాయని ట్రైలర్ చెప్పకనే చెబుతోంది.'ఆ సరుకుని నేను దించను.. ఇంకెవ్వరినీ దించనివ్వను ర్రా అనే డైలాగ్‌ను లింగా, కృపాకర్ పాత్రల్లో విశాల్ చెప్పిన తీరు అద్భుతంగా ఉంది. ట్రైలర్‌లో చివరి షాట్ మాత్రం హైలెట్ అయ్యేలాఉంది. రిచర్డ్ ఎం.నాథన్ అభినందన్ రామానుజం కెమెరా వర్క్ అదిరిపోయింది. దిలీప్ సుబ్బరాయన్ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ మాస్ ఆడియెన్స్‌కి కిక్కిచ్చేలా ఉన్నాయి. ఇక జీవీ ప్రకాష్ పాటలు, ఆర్ఆర్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచేట్టు ఉందని ఈ ట్రైలర్ చెబుతోంది. ఇక ఆగస్ట్ 14నఈ మూవీని భారీ ఎత్తున రిలీజ్ చేసేందుకు టీం సన్నాహాలు చేస్తోంది.

## 'డిసి'తో లోకేష్ కనగరాజ్ బ్లాక్‌బస్టర్ హిట్



సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని 'డిసి' మరోసారి నిరూపించింది. ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు: సక్సెస్ మీట్‌లో నిర్మాత సురేష్ బాబులోకేష్ కనగరాజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ డిసి. లోకేష్ కనగరాజ్ హీరోగా పరిచయమైన ఈ చిత్రాన్ని అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. వామికా గబ్బి, సంజనా కృష్ణమూర్తి హీరోయినన్స్‌గా నటించారు. అనిరుధ్ సంగీతం అందించారు. ప్రెస్ మీట్ లో నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ.."అందరికీ నమస్కారం. 'డీసీ' సినిమాకు వస్తున్న రిపోర్ట్స్ అద్భుతంగా ఉన్నాయి. సన్ పిక్చర్స్‌కు ధన్యవాదాలు. ఏషియన్ సునీల్ గారు, దిల్ రాజు గారు, మేమంతా కలిసి ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశాం. లోకేష్ కనగరాజ్ గారు పెద్ద దర్శకుడు. ఇప్పుడు మొదటిసారి హీరోగా నటించారు. అద్భుతమైన పెర్ఫామెన్స్ ఇచ్చారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ: . ముందుగా ఈ సినిమా హక్కులు మాకు ఇచ్చిన సన్ పిక్చర్స్‌కు ధన్యవాదాలు. డీసీ అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఇది బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. నిర్మాత శిరీష్ రెడ్డి మాటాడుతూ: ఇంత గొప్ప విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా హక్కులు మాకు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన సన్ పిక్చర్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. స్క్రీన్స్ కూడా పెరుగుతున్నాయి. ఈ విజయం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

## సూర్య 'విశ్వనాథ్ & సన్స్' ట్రైలర్ విడుదల



హృదయాలను హత్తుకునే ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా భారీ అంచనాల ుతమిళ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా నటించిన'విశ్వనాథ్ సన్స్ చిత్రం ట్రైలర్ విడుదలైంది. తొలి ఫ్రేమ్ నుంచే ఆహ్లాదకరమైన, భావోద్వేగ భరితమైన, హృదయాన్ని తాకే కుటుంబ కథా చిత్రంగా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ట్రైలర్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. దర్శకుడు వెంకీ అట్లూరి తనదైన భావోద్వేగ కథనంతో రూపొందించిన ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లలో ఒకటిగా ఈ చిత్రం నిలవనుంది.ట్రైలర్‌లో సంజయ్ విశ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను పరిచయం చేశారు. నలభై ఏళ్ల వయస్సు దాటినా తన కలలను వదలకుండా ముందుకు సాగే వ్యక్తిగా సూర్య కనిపించారు. స్టైల్, హాస్యం, ప్రేమ, భావోద్వేగాలను అద్భుతంగా మేళవిస్తూ ఆయన మరోసారి తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకీ అట్లూరి హృదయానికి హత్తుకునే రచనతో కలిసి సూర్య కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రల్లో ఇది ఒకటిగా నిలుస్తుందనే నమ్మకాన్ని ట్రైలర్ కలిగిస్తోంది.కథానాయిక మమితా బైజు తన సహజమైన అభినయంతో ఆకట్టుకోగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్తో పాటు ఇతర ప్రముఖ నటీనటులు ఈ కుటుంబ కథకు మరింత బలం చేకూర్చారు. . జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన హృద్యమైన సంగీతం, నిమిష్ రవి అందించిన అద్భుతమైన ఛాయాగ్రహణం, వెంకీ అట్లూరి తనదైన శైలిలో చెప్పిన భావోద్వేగ కథనం ట్రైలర్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి.

ఆట

# కొరియా మాస్టర్స్‌లో ఫైనల్‌కు అష్మిత



**న్యూఢిల్లీ:** కొరియా మాస్టర్స్‌లో బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో అష్మిత చాలిహా తొలి ఫైనల్‌కు చేరుకుంది. కొరియా మాస్టర్స్ సూపర్ 300లో తన పరుగును కొనసాగిస్తూ, శనివారం ఇక్కడ జరిగిన పోరులో తన తోటి టీనేజ్ క్రీడాకారిణి రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్‌ను 48 నిమిషాల పోరులో 21-13, 16-21, 21-13 తేడాతో ఓడించి, అష్మిత చలిహా ఫైనల్‌కు అర్హత సాధించింది. 26 ఏళ్ల క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన టాప్ సీడ్, ప్రపంచ 22వ ర్యాంకర్ అయిన హినా అకేచిని ఆశ్చర్యపరిచిన ఈ భారత క్రీడాకారిణి అష్మిత, దూకుడుగా ఆడి తొలి గేమ్‌లోనే 2-2 నుండి 6-2కు వేగంగా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఆమె వరుసగా ఐదు పాయింట్లు సాధించి 13-6 ఆధిక్యాన్ని నెలకొల్పి, 21-13 తేడాతో ఆటను ముగించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఒక గేమ్ వెనుకబడినప్పటికీ, మూడో సీడ్, స్వదేశీ క్రీడాకారిణి అయిన తన్వీ శర్మను ఓడించిన రక్షిత, బలంగా పుంజుకుని 4-1 ఆధిక్యంతో దూసుకుపోయి, దానిని 12-6కు పెంచింది. ఆ తర్వాత అష్మిత వ్యూహాత్మకంగా వ్యవహరించి 13-12తో స్కోరును సమం చేసింది. కానీ రక్షిత తన సంయమనాన్ని కోల్పోకుండా 21-16తో నిర్ణయాత్మక సెట్‌కు దారితీసింది. అయితే, అష్మిత మూడవ గేమ్‌లో తిరిగి పట్టు సాధించి, 8-1 ఆధిక్యాన్ని సంపాదించి, ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని 21-13 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుని, తన మొదటి బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో

# జావెలిన్ త్రోలో ఆశిష్‌కు రజతం

### మహిళ హై జంప్ ఫైనల్‌కు పూజా

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్‌లో, పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో భారత్ అథ్లెట్ ఆశిష్ యాదవ్ రజత పతకం గెలుచుకోగా, జాతీయ సీనియర్ రికార్డు హోల్డర్ పూజా సింగ్ మహిళల హైజంప్ ఫైనల్‌కు అర్హత సాధించారు. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో యాదవ్ మూడవ రౌండ్‌లో 74.09 మీటర్ల త్రోతో రజత పతకాన్ని గెలుచుకోగా, బరిలో ఉన్న మరో భారతీయ క్రీడాకారుడు టి. ధరణిధరన్ 72.35 మీటర్లతో ఆరో స్థానంలో






నిలిచాడు. అలాగే మహిళల హై జంప్ ఈవెంట్‌లో, పూజ 1.79 మీటర్ల ఎత్తును అధిగమించి ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించింది. రెండు క్వాలిఫికేషన్ గ్రూపులలోని 14 మంది అథ్లెట్లలో, 1.79 మీటర్ల ఎత్తును అధిగమించగలిగిన వారందరికీ ఫైనల్‌లో స్థానాలు లభించాయి. 19 ఏళ్ల పూజ 1.93 మీటర్లతో జాతీయ సీనియర్ రికార్డును కలిగి ఉంది. పురుషుల లాంగ్ జంప్‌లో, క్వాలిఫికేషన్ రౌండ్ తర్వాత షానవాజ్ ఖాన్, జితిన్ అర్జున ఇద్దరూ ఫైనల్స్‌కు చేరుకున్నారు. షహనవాజ్ తన మూడవ మరియు చివరి ప్రయత్నంలో 7.73 మీటర్ల జంప్‌తో క్వాలిఫికేషన్ గ్రూప్ బిలో నాల్గవ స్థానంలో మరియు మొత్తంగా ఐదవ స్థానంలో నిలిచాడు. జితిన్ కూడా తన మూడవ మరియు చివరి ప్రయత్నంలో 7.57 మీటర్ల జంప్‌తో, మొత్తంగా 12వ స్థానంలో నిలిచి, అందుబాటులో ఉన్న చివరి స్థానాన్ని దక్కించుకుని ముందంజ వేశాడు.



## ఐస్ హాకీ ఛాలెంజర్స్ కప్.. ఛాంపియన్‌గా ఇండియన్ ఆర్మీ హాకీ జట్టు

**న్యూఢిల్లీ:** ఐస్ హాకీ ఛాలెంజర్స్ కప్ ఫైనల్‌లో లేహ్ కింగ్స్‌ను 6-5 తేడాతో ఓడించి ఇండియన్ ఆర్మీ హాకీ జట్టు తొలి ఛాంపియన్‌గా నిలిచింది. తీవ్ర ఉత్కంఠభరితంగా సాగిన ఈ టైటిల్ పోరులో లేహ్ కింగ్స్ జట్టు, భారత్ ఐస్ హాకీ జట్టుకు గట్టి పోటీ ఇచ్చి, చివరికి ఆఖరి నిమిషంలో నిర్ణయాత్మక గోల్‌ను సమర్పించుకుంది. ముష్తాక్ అహ్మద్ గిరి అందించిన కచ్చితమైన అసిస్ట్‌ను త్సెరింగ్ అంగ్‌చుక్ గోల్‌గా మలచడంతో కింగ్స్ బలంగా ప్రారంభించింది. ఆర్మీ ఐస్ హాకీ జట్టు స్టాన్జిన్ నమ్‌గైల్ సృష్టించిన ఒక కదలిక తర్వాత రిగ్జిన్ నోర్బూ గోల్ చేయడంతో, రెండవ అర్ధభాగం ప్రారంభంలో ఆర్మీ జట్టు తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. అయితే, లేహ్ కింగ్స్ బలంగా పుంజుకుంది, స్టాన్జిన్ లోటస్, ముస్తాక్ అహ్మద్ గిరి అందించిన అసిస్ట్‌లతో స్టాన్జిన్ అంగ్‌చోక్ వెంటవెంటనే రెండు గోల్స్ చేసి స్కోరును 3-3తో సమం చేశాడు. రిగ్జిన్ నోర్బూ ఈ సాయంత్రం తన రెండవ గోల్‌తో ఆర్మీ జట్టుకు మళ్లీ ఆధిక్యాన్ని అందించాడు, కానీ కింగ్స్ త్సెరింగ్ అంగ్చుక్ అందించిన అసిస్ట్‌ను చంబా త్సెటాన్ గోల్‌గా మలచడంతో, చివరి పీరియడ్‌లోకి ప్రవేశించే ముందు స్కోరు 4-4తో సమమైంది. మూడవ పీరియడ్‌లో స్టాన్జిన్ అంగ్‌చోక్ హ్యాట్రిక్‌ను పూర్తి చేయడంతో, లేహ్ కింగ్స్ మరోసారి 5-4 ఆధిక్యాన్ని అందించింది. అయితే జిగ్మత్ కున్జాంగ్ తన రెండవ గోల్ చేసి స్కోరును సమం చేయగా, పద్మ నమ్‌గైల్ మ్యాచ్ గెలిపించే గోల్ చేసి 6-5 తేడాతో ఇండియన్ హాకీ జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు.

# టి20 కెరీర్‌లో.. అత్యధిక రన్నింగ్ హీరోస్

### బౌలర్లకు చుక్కలే చుక్కలు




**న్యూఢిల్లీ:** టీ20ల్లో మ్యాచ్‌లు ఉత్కంఠంగా జరుగుతాయి. ఈ ఫార్మేట్‌లో పలువురు బ్యాటర్లు దుమ్మురేపారు. అంతేకాకుండా బౌలర్లకు సైతం చుక్కలు చూపించారు. ఈ విధంగా టీ20 ఫార్మేట్‌లో అత్యధిక పరుగులు సాధించిన టాప్ 5 బ్యాటర్లలో భారత్‌కు చెందిన ఒక్క ఆటగాడూ లేకపోవడం శోచనీయం. జోస్ బట్లర్ ఇటీవల టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ నెల 5న, మెన్స్ హండ్రెడ్ 2026 సీజన్‌లోని 22వ మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో, బట్లర్ తన కెరీర్‌కే నిర్వచనం ఇచ్చే ఇన్నింగ్స్‌లను ఆడాడు. ఫ్రాంచైజీ క్రికెట్, అంతర్జాతీయ క్రికెట్‌తో కలిపి అతను మొత్తం 522 మ్యాచ్‌లు ఆడిన రికార్డును కలిగి ఉన్నాడు. ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు కాకుండా, ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, ది హండ్రెడ్ టోర్నమెంట్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్, బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ వంటి కొన్ని జట్లకు ఆయన కోచ్‌గా వ్యవహరించారు. అతను ఇటీవల అన్ని జట్ల తరఫున ఆడి 14,833 పరుగులు సాధించి, టీ20 చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అలాగే కీరన్ పొలార్డ్ 20 ఏళ్ల సుదీర్ఘ, విజయవంతమైన కెరీర్‌ను కలిగి ఉన్నాడు. అతను అంతర్జాతీయ మరియు ఫ్రాంచైజీ క్రికెట్‌లో 746 మ్యాచ్‌లు ఆడాడు. వెస్ట్ ఇండీస్‌తో పాటు, పొలార్డ్ వివిధ లీగ్‌లలోని అనేక జట్లకు కూడా ఆడాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ముఖ్యమైన సహకారం అందించాడు. ది హండ్రెడ్‌లో లండన్ స్పిరిట్ తరఫున, బిగ్ బాష్ లీగ్‌లో మెల్బోర్న్ రెనెగేడ్స్ తరఫున కూడా ఆడాడు. యూనివర్స్ బాస్ గా కూడా పిలువబడే క్రిస్ గేల్ 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌ను ఆస్వాదించాడు. అతను టీ20 అంతర్జాతీయ, టీ20 ఫ్రాంచైజీ క్రికెట్‌లో 463 మ్యాచ్‌లు ఆడాడు. వెస్ట్ ఇండీస్ తరఫున ఆడటమే కాకుండా, గేల్ ప్రపంచవ్యాప్తంగా వివిధ లీగ్‌లలో అనేక జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, సిడ్నీ థండర్ జట్ల తరఫున కూడా ఆడాడు. గేల్ క్రికెట్ యొక్క అతి చిన్న ఫార్మాట్‌లో 14,562 పరుగులు సాధించి ఒక పెద్ద మైలురాయిని చేరుకున్నాడు. వీరితో పాటు, అలెక్స్ హేల్స్ 528 మ్యాచ్‌లు ఆడగా, వాటిల్లో 14,449 పరుగులు, డేవిడ్ వార్నర్ 439 మ్యాచ్‌ల్లో 14,284 పరుగులు చేశారు.

# శ్రీలంక మ్యాచ్‌లో టీమిండియా 357 రన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంక క్రికెట్ ఎలెవన్ జట్టుకు టీమిండియా ధీటుగా బదులిస్తోంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు నష్టానికి 357 పరుగులతో టీమిండియా పటిష్ట స్థితిలో నిలిచింది. బ్యాటింగ్‌కు దిగిన





టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లలో యశస్వీ జైస్వాల్ డకౌట్ కాగా, కెప్టెన్ కెఎల్‌రాహుల్ 40 పరుగులతో రాణించాడు. వన్‌డౌన్‌లో వచిచన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో శతకం పూర్తి చేసుకుని రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్లు రిషబ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) పూర్తిగా విఫలమయ్యారు. దీంతో నాల్గో స్థానంలో వచ్చిన స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మరో స్పిన్ బౌలర్ మానవవ్ సుతార్ తోడయ్యాడు. జడ్డూ 117 బతుల్లో 63 పరుగులు చేసి పెవిలియన్ చేరగా, మానవ్ 90 బంతుల్లో 41 పరుగులు చేవ్శాడు. అయితే అసంతక మనోజర్ బౌలింగ్‌లో లెగ్ బిఫోర్ వికెట్‌గా మానవ్ నిష్క్రమించాడు. తదుపరి కుల్దీప్ యాదవ్ 15 బంతుల్లో, మహ్మద్ సిరాజ్ 8 బంతుల్లో ఒక్కో పరుగు చేసి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగగా, 103 పరుగులతో మళ్లీ బ్యాటింగ్‌కు దిగిన పడిక్కల్ మొత్తంగా 164 బంతులతో 142 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

కొలంబోలో టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా, భారత్ బౌలర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఫలితంగా శ్రీలంక తొలి రోజు ఆటలో ఓవర్‌నైట్ స్కోరు 363 వద్దనే తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

## వాణిజ్యం




# ఇన్ఫోసిస్‌కు క్రాక్స్ నుంచి భారీ డీల్!

**ముంబయి,ఆగస్టు 8:** భారత ఐటీ రంగంలోని ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్‌కు మరో భారీ ఇంటర్నేషనల్ డీల్ దక్కింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఫుట్‌వేర్ సంస్థ క్రాక్స్‌తో ఇన్ఫీ 10 సంవత్సరాల వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. క్రాక్స్ వ్యాపార కార్యకలాపాలు, ఐటీ వ్యవస్థల్ని ఆధునికీకరించడంతో పాటుగా ఏఐ ఆధారిత టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. ఈ ఒప్పందం విలువ సుమారు 300 మిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. ఇది భారత కరెన్సీలో చూస్తే దాదాపు రూ. 2800 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. ఒప్పందానికి సంబంధించిన అధికారిక ఆర్థిక వివరాల్ని ఇన్ఫోసిస్ వెల్లడించలేదు. సాధారణంగా 100 మిలియన్ డాలర్లు అంతకుమించిన ప్రాజెక్టుల్ని ఐటీ రంగంలో భారీ డీల్స్‌గా పేర్కొంటారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇన్ఫోసిస్ తన ఏఐ ఫస్ట్ ప్లాట్‌ఫామ్‌లు, ఆటోమేషన్ సామర్థ్యాల్ని ఉపయోగించనుంది. క్రాక్స్ ప్రధాన వ్యాపార వ్యవస్థలు, ఐటీ కార్యకలాపాల్ని మరింత సులభతరం చేయడం, నిర్వహణ ఖర్చుల్ని తగ్గించడం, భవిష్యత్తు విస్తరణకు అనుగుణంగా టెక్నాలజీ వ్యవస్థల్ని సిద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా క్రాక్స్‌కు చెందిన వివిధ వ్యాపార విభాగాల్లో ఉన్న డేటాను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్ఫోసిస్ భావిస్తోంది. దీని వల్ల సంస్థకు రియల్ టైమ్ సమాచారంతో నిర్ణయాలు తీసుకునే అవకాశం లభించడంతో పాటు కార్యకలాపాల్లోనూ సామర్థం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. క్రాక్స్ వేగంగా కొత్త ఉత్పత్తులు, సేవల్ని అభివృద్ధి చేయడం, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్లుగా మరింత మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. క్రాక్స్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ టామ్ బ్రిట్ మాట్లాడుతూ "ఇన్ఫోసిస్ డెలివరీ ఫ్రేమ్‌వర్క్‌లు, ఆటోమేషన్ సామర్థ్యాల్ని ఉపయోగించి కార్యకలాపాల్ని మరింత సమర్థంగా నిర్వహిస్తామని తెలిపారు. ఖర్చుల్ని తగ్గించడంతో పాటు భవిష్యత్తు వృద్ధికి అవసరమైన టెక్నాలజీని ఏర్పాటు చేయడంపై దృష్టి పెడతామని చెప్పారు. ఇక రిటైల్ రంగంలో ఏఐ ఆధారిత డిజిటల్ మార్పులకు సంబంధించి కీలక దశలో ఉందన్నారు క్రాక్స్ గ్లోబల్ హెడ్ కర్మేష్ వాస్వానీ.

# రికార్డు స్థాయిలో ఎస్‌బిఐ లాభం

### రూ.21,121 కోట్లకు పెరిగిన నికర లాభం..

### 2 దశాబ్దాల్లో మెరుగైన ఆస్తుల నాణ్యత

**ముంబయి, ఆగస్టు 8:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో అంచనాలను మించి అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. త్రైమాసిక నికర లాభం చరిత్రలోనే అత్యధికంగా నమోదుకాగా, ఆస్తుల నాణ్యత కూడా రెండు దశాబ్దాలకు పైగా కాలంలో ఎన్నడూ లేనంత మెరుగైన స్థాయికి చేరింది. ఇదే త్రైమాసికంలో బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.110 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. జూన్ త్రైమాసికంలో ఎస్‌బీఐ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.23 శాతం పెరిగి రికార్డు స్థాయిలో రూ.21,121 కోట్లకు చేరింది. మెరుగైన మార్జిన్లు, రుణాల మంజూరులో 18.63 శాతం వృద్ధి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. నిర్వహణ లాభం 9.77 శాతం పెరిగి రూ.33,529 కోట్లకు చేరగా, నికర వడ్డీ ఆదాయం 14.88 శాతం వృద్ధితో రూ.46,992 కోట్లుగా నమోదైంది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 7 బేసిస్ పాయింట్లు పెరిగి 3 శాతానికి చేరింది. మొత్తం బ్యాంకు ఎన్ఐఎం కూడా 5 బేసిస్ పాయింట్లు మెరుగై 2.86 శాతంగా నమోదైంది. అయితే రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలను కఠినతరం చేసిన నేపథ్యంలో ఎస్‌బీఐ తన భారీ నికర ఓపెన్ ఫారెక్స్ పొజిషన్‌ను తగ్గించుకోవడంతో ట్రెజరీ ఆదాయం 70 శాతం మేర తగ్గి సుమారు రూ.2,500 కోట్లకు పరిమితమైంది. బలమైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి 3 శాతం ఎన్ఐఎం లక్ష్యాన్ని కొనసాగిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ఆర్‌బీఐ ప్రత్యేక స్వాప్ విండో ద్వారా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల రాక ప్రస్తుతం ఉన్న సుమారు 6 బిలియన్ డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్లకు మించి పెరుగుతుందని ఆయన అంచనా వేశారు.




ఈ నిధుల రాకతో అధిక వ్యయంతో కూడిన బల్క్ డిపాజిట్లను భర్తీ చేసుకోవడంతో పాటు బ్యాంకు నిధుల సమీకరణ వ్యయం తగ్గుతుందని ఆయన వివరించారు. రుణ వృద్ధి 14-15 శాతం, డిపాజిట్ వృద్ధి 10-11 శాతంగా ఉండొచ్చని శెట్టి అంచనా వేశారు. రూ.110 లక్షల కోట్లకు వ్యాపారంఎస్‌బీఐ మొత్తం వ్యాపారం రూ.110 లక్షల కోట్లను దాటింది. ఇందులో డిపాజిట్లు రూ.60 లక్షల కోట్లకు పైగా ఉండగా, రుణాలు రూ.50 లక్షల కోట్లను అధిగమించాయి. దేశీయ రుణాలు 18.15 శాతం వృద్ధి చెందాయి. రిటైల్ రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా గణనీయంగా పెరిగిందని, అదనంగా మంజూరైన రిటైల్ రుణాల్లో దాదాపు మూడు వంతులు గోల్డ్ లోన్లేనని చెప్పారు. రూపాయి పరంగా విదేశీ రుణాలు 21.38 శాతం, డాలర్ పరంగా 9.97 శాతం పెరిగాయి. మౌలిక రంగాల నుంచి రుణ డిమాండ్‌కార్పొరేట్ రుణాలు 18.05 శాతం పెరిగాయి. పునరుత్పాదక ఇంధనం, డేటా సెంటర్ల వంటి మౌలిక రంగాల నుంచి పెరిగిన డిమాండ్ ఇందుకు కారణమని కార్పొరేట్ బ్యాంకింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎండీ అశ్విని కుమార్ తివారీ తెలిపారు.

### తొలివారంలో రూ.12,291 కోట్ల

# ఎఫ్‌పిఐల పెట్టుబడులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 8:** భారత మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఆగస్టు తొలి వారంలో భారీగా నిధులు పెట్టారు. ఆగస్టు 3 నుంచి 7 వరకు ఐదు ట్రేడింగ్ సెషన్లలో ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, మ్యూచువల్ ఫండ్ విభాగాల్లో కలిపి రూ.12,290.68 కోట్ల నికర పెట్టుబడులు పెట్టినట్లు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ గణాంకాలు వెల్లడించాయి. ఇందులో ఈక్విటీ విభాగానికే అత్యధికంగా రూ.12,921.14 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జూలైలో కొనసాగిన ఎఫ్‌పీఐల కొనుగోళ్ల జోరు ఆగస్టులోనూ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈనెల 5న ఒక్కరోజే ఈక్విటీల్లో రూ.9,323.38 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. మూడోతేదీ రూ.1,351.02 కోట్లు, 4న రూ.1,431.45 కోట్ల చొప్పున పెట్టుబడులు పెట్టారు. అయితే వారాంతానికి కొనుగోళ్ల వేగం తగ్గింది. ఆరవ తేదీ రూ.349 కోట్లు, 7న రూ.466.29 కోట్ల నికర పెట్టుబడులు మాత్రమే నమోదయ్యాయి. డెట్ విభాగంలో మిశ్రమ ధోరణి కనిపించింది. డెట్‌జనరల్ లిమిట్ కింద ఎఫ్‌పీఐలు రూ.621.69 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా, డెట్‌వీఆర్‌ఆర్‌లో రూ.354.20 కోట్లు, డెట్ ఎఫ్ఏఆర్‌లో రూ.377 కోట్ల నికర ఉపసంహరణలు జరిగాయి. హైబ్రిడ్ సాధనాల నుంచి రూ.570.74 కోట్ల నికర నిధులను ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్నారు. మ్యూచువల్ ఫండ్ మార్గాల్లో మాత్రం రూ.49.79 కోట్ల స్వల్ప నికర పెట్టుబడులు వచ్చాయి. ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు విభాగంలో ఈ వారంలో ఎలాంటి లావాదేవీలు నమోదు కాలేదు.






## ఫండ్స్‌లో క్లెయిమ్ చేయని డివిడెండ్లు రూ.2,689 కోట్లు

**ముంబయి,ఆగస్టు 8:** మ్యూచువల్ ఫండ్లలో క్లెయిమ్ చేయని డివిడెండ్ మొత్తంఆర్థికసంవత్సరం ముగిసే నాటికి 15.7% పెరిగి రూ.2,689 కోట్లకు చేరింది. సెబీ వార్షిక నివేదిక25-26లో ఈ వివరాలు వెల్లడించింది. 2425లో రూ.2,324 కోట్లుగా ఉన్న క్లెయిమ్ చేయని డివిడెండ్లు తాజాగా రూ.365 కోట్లు పెరిగాయి. మరోవైపు క్లెయిమ్ చేయని రిడెంప్షన్ మొత్తం స్వల్పంగా 0.5 శాతం తగ్గి రూ.1,122 కోట్లకు చేరింది. గత ఏడాది ఇది రూ.1,128 కోట్లుగా ఉంది. దీంతో 2026 మార్చి 31 నాటికి మ్యూచువల్ ఫండ్లలో క్లెయిమ్ చేయని డివిడెండ్లు, రిడెంప్షన్ మొత్తాలు కలిపి రూ.3,811 కోట్లకు చేరాయి. 2024-25 ముగింపులో ఈ మొత్తం రూ.3,452 కోట్లు. పెట్టుబడిదారులకు క్లెయిమ్ చేయని ఆస్తులను సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి సెబీ పలు చర్యలు చేపడుతోంది. డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్ వివరాలను ఒకే చోట పొందేలా డిజిలాకర్‌తో హోల్డింగ్స్ అనుసంధానానికి అవకాశం కల్పించింది.




## ధూత్ ట్రాన్స్‌మిషన్ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.918.27 కోట్లు

**ముంబయి, ఆగస్టు 8:** ఆటో కాంపోనెంట్స్ తయారీ సంస్థ ధూత్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ ఐపీఓకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.918.27 కోట్లను సమీకరించింది. యాంకర్ ఇన్వెస్టర్ రౌండ్‌లో 72 మంది ఇన్వెస్టర్లకు ఒక్కో షేరును రూ.871 చొప్పున కేటాయించింది. 1,05,42,657 ఈక్విటీ షేర్లను యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. వీటిలో 64,59,984 షేర్లు (61.27 ) ఎనిమిది దేశీయ మ్యూచువల్ ఫండ్లకు చెందిన 46 పథకాల ద్వారా కేటాయించారు. మరో 9,21,895 షేర్లు జీవిత బీమా సంస్థలు, పెన్షన్ ఫండ్లకు కేటాయించారు. యాంకర్ ఇష్యూలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, బ్లాక్‌రాక్, వైట్‌ఓక్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, మిరే, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ధూత్ ట్రాన్స్‌మిషన్ ఐపీఓలో రూ.1,400 కోట్ల విలువైన తాజా షేర్ల జారీతో పాటు, ప్రమోటర్లు 1.63 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. బీసీ ఏషియా ఇన్వెస్ట్‌మెంట్స్, మంగళం క్యాపిటల్ తమ వాటాలను విక్రయించనున్నాయి. కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో లిస్ట్ కానున్నాయి. ఐపీఓకు కోటక్ మహీంద్రా క్యాపిటల్, నోమురా ఫైనాన్షియల్ అడ్వైజరీ అండ్ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, జెఫరీస్ ఇండియా, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, 360 వన్ డబ్ల్యూఏఎం బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. కేఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రార్‌గా ఉంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.494 కోట్లను రుణాల చెల్లింపు లేదా ముందస్తు చెల్లింపులకు వినియోగించనుంది. మరో రూ.272.59 కోట్లను అనుబంధ సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు కేటాయించనుంది.

## జి20 దేశాల్లోనే భారత్ ఆర్థికవృద్ధి భేష్!

### ఐఎంఎఫ్ జి20 దేశాల డేటా విడుదల

**న్యూయార్కు, ఆగస్టు 8:** అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ తాజా గణాంకాల ప్రకారం 2014-2026 కాలంలో జీ20 దేశాల్లోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా భారత్ చరిత్ర సృష్టించింది. కోవిడ్19 మహమ్మారి, గ్లోబల్ సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ యుద్ధాల వంటి కఠినమైన సవాళ్లు ఉన్నప్పటికీ నామినల్ డాలర్ రూపంలో భారత్ సగటున 6.1 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. ఈ రేసులో చైనా 5.9 శాతం, అమెరికా 5.3 శాతంను సైతం భారత్ దాటేసింది. సౌదీ అరేబియా 5.1 శాతం, టర్కీ 4.8 శాతం, ఇండోనేషియా 4.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ దశాబ్దకాలంలో భారత ఆర్థికవ్యవస్థ పరిమాణం ఏకంగా రెట్టింపు కంటే ఎక్కువ పెరిగి, ప్రస్తుతం 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరింది. భారత్ వృద్ధికి మౌలిక సదుపాయాలపై పెరిగిన పెట్టుబడులు కూడా కీలకంగా మారాయి. దేశంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థం 248 గిగావాట్ల నుండి 532.74 గిగావాట్లకు పెరగడం, జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణతో రవాణా, లాజిస్టిక్స్, వ్యాపార కార్యకలాపాలకు మద్దతు పెరిగింది. ఇదే సమయంలో తయారీ సామర్థ్యాన్ని పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, భౌతికడిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు కొనసాగాయి. గత దశాబ్దంలో ఏడో స్థానంలో ఉన్న భారత్, ప్రపంచవ్యాప్తంగా వరుస అంతరాయాలు ఎదురైనప్పటికీ 2014-2026 కాలంలో జీ20లో టాప్‌కు చేరడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ప్రాధాన్యం పెరుగుతున్నదనే దానికి బలమైన సంకేతమని ఐఎంఎఫ్ పేర్కొంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.